సోమవారం
29-9-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 10, సంచిక : 09
పేజీలు : 8, వెల: రూ.5.00

Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com

స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

మద్యం వినియోగంలో కర్నాటక టాప్

బెంగళూరు: భారత్‌లో తయారయ్యే విదేశీ మద్యం వినియోగంలో దక్షిణాది రాష్ట్రాలు ముందున్నాయి. మద్యం అమ్మకాలకు సంబంధించి గత ఆర్థిక సంవత్సరంలో 58 శాతం రాబడి ఈ రాష్ట్రాల నుంచే వచ్చింది. దేశవ్యాప్తంగా విస్కీ వినియోగంలో కర్నాటక తొలి స్థానంలో నిలిచిందని (అమ్మకాల్లో 17 శాతం) కన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఆల్కహాలిక్ బేవరేజ్ కంపెనీస్(సీఐఏబీసీ) వెల్లడించింది. పుదుచ్చేరితోపాటు ఆంధ్రప్రదేశ్, కర్నాటక, కేరళ, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలు మద్యం అమ్మకాల్లో జోరు

- మిగతా 2 లో

గ్రూప్-2 ఫలితాల విడుదల

విశాలాంధ్ర-హైదరాబాద్: గ్రూప్-2 ఫలితాలను టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్ర వెంకటేశం ఆదివారం విడుదల చేశారు. 783 పోస్టులకుగాను ఎంపికైన 782 మంది జాబితాను వెల్లడించారు. ఒక్క పోస్టు ఫలితాన్ని పెండింగ్‌లో పెట్టింది. 2022లో గ్రూప్-2 నోటిఫికేషన్ విడుదల చేసిన టీజీపీఎస్సీ... 2024 డిసెంబరులో రాత పరీక్ష నిర్వహించింది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 2,49,964 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ పరీక్ష ఆఫ్‌లైన్ విధానంలో జరగడంతో ఓఎంఆర్ పత్రాల్లో లోపాలు, బబ్లింగ్ సరిగా చేయకపోవడం వంటి కారణాలతో

- మిగతా 2 లో

భారత్‌పై యుద్ధానికి 50 లక్షల మంది సిద్ధం

న్యూయార్క్: షేక్ హసీనా ప్రధాని పదవికి రాజీనామా చేయడం, బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేతగా మహ్మద్ యూనస్ అధికారంలోకి రావడంతో ఇక్కడి మతోన్మాదులు చెలరేగిపోతున్నారు. భారత్ లక్ష్యంగా విద్వేష వ్యాఖ్యలు చేస్తున్నారు. తాజాగా, బంగ్లాదేశ్ జమాతే ఇస్లామీ డిప్యూటీ లీడర్ అమీర్ సయ్యద్ అబ్దుల్లా మహ్మద్ తాహెర్ 'ఘజ్వా-ఎ-హింద్' గురించి మాట్లాడుతూ భారత్‌ను బెదిరించే ప్రయత్నం చేశారు. భారతదేశాన్ని ఇస్లాం దేశంగా మార్చేందుకు మతోన్మాదులు తరుచూ 'ఘజ్వా-ఏ-హిందూ'

- మిగతా 2 లో

ఇదీ లోకం!

చూసావా! మా సారు ఎంత గొప్పవారో రోడ్ల గుంతలు పూడ్చేవరకూ హెలికాప్టర్లోనే తిరుగుతానని ఒట్టు పెట్టుకున్నారు.

భవిష్యత్తు తరాల కోసమే

ఫ్యూచర్ సిటీ

- న్యూయార్క్‌ను మరిపించే నగరం కడతా
- అమరావతి వరకు బుల్లెట్ ట్రైన్‌కు కేంద్రం అంగీకారం
- మచిలీపట్నం గ్రీన్ ఫీల్డ్ హైవేలో డ్రై పోర్ట్
- సింగరేణి కార్పొరేట్ కార్యాలయానికి 10 ఎకరాలు: రేవంత్

విశాలాంధ్ర - హైదరాబాద్: మన భవిష్యత్ తరాల కోసం ఫ్యూచర్ సిటీని నిర్మించుకోవాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా మీర్‌ఖాన్‌పేటలో భారత్ ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ భవనం, గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్-1 నిర్మాణాలకు ఆదివారం ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. రేవంత్ మాట్లాడుతూ మంచి సంకల్పంతో తలపెట్టిన ఈ భారత్ ఫ్యూచర్ సిటీపై కొందరు కుట్రలు కుతంత్రాలు చేస్తున్నారు, నోటికొచ్చింది మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇక్కడ నాకేదో భూములు ఉన్నాయని ఆరోపణలు చేస్తున్నారు కానీ ఇది తన కోసమో, తన కుటుంబం కోసమో కాదు... భవిష్యత్ తరాల భవిష్యత్తు కోసమనే విషయం వారు గుర్తిస్తే మంచిదని హితవు పలికారు. దక్షిణ భారతదేశంలో పోర్టు లేని రాష్ట్రం తెలంగాణ ఒక్కటే అని, ఫ్యూచర్ సిటీ నుంచి మచిలీ పట్నం గ్రీన్ ఫీల్డ్ హైవేలో డ్రై పోర్ట్ ఏర్పాటు చేసుకోబోతున్నామని స్పష్టం చేశారు. ఫ్యూచర్ సిటీ నుంచి

- మిగతా 2 లో

తొక్కిసలాట వెనుక కుట్ర!

సీబీఐ లేదా సిట్‌తో దర్యాప్తు

హైకోర్టులో టీవీకే పార్టీ పిటిషన్

చెన్నై: తమిళనాడులో కరూర్ తొక్కిసలాట ఘటనపై సీబీఐ దర్యాప్తు చేపట్టాలని కోరుతూ తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. సీబీఐ లేదా ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని పిటిషన్ దాఖలు చేసింది. ఈ ఘటనలో కుట్ర కోణం ఉందని ఆరోపించింది. మరోవైపు టీవీకే అధినేత విజయ్ ఇంటి వద్ద భారీ భద్రతను పెంచారు. ఇదిలా ఉండగా తొక్కిసలాట ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 40కు చేరింది. శనివారం విజయ్ నిర్వహించిన ర్యాలీలో గుర్తు తెలియని వ్యక్తులు

- మిగతా 2 లో

నిద్రావస్థలో ప్రజాస్వామ్య వ్యవస్థలు

కూనంనేని సాంబశివరావు విమర్శ

విశాలాంధ్ర-హైదరాబాద్: ప్రజాస్వామ్యానికి శాసన, న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థలు మూడు స్తంభాలైతే... నాలుగో స్తంభం మీడియా అని, ఈ నాలుగు వ్యవస్థలు కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిన మాదిరిగా కునారిల్లిపోతున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవస్థలను తిరిగి నిలబెట్టడంతో పాటు దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు ప్రగతిశీల శక్తులన్నీ ఐక్యంగా ముందుకు సాగాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక, టీఎస్ జాగో నవతెలంగాణ సంయుక్త అధ్వర్యంలో 'ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించండి-న్యాయవ్యవస్థ, ఎన్నికల కమిషన్ స్వతంత్రతను కాపాడాలి' అనే అంశంపై సదస్సు ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. సదస్సుకు జస్టిస్ బి.చంద్రకుమార్ అధ్యక్షత వహించగా ముఖ్యవక్తగా సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్, వక్తలుగా కూనంనేని సాంబశివరావు, వామపక్ష, ప్రజా, పౌర హక్కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ పేదల హక్కుల కోసం పోరాడుతున్న వ్యక్తులు అక్రమంగా జైళ్లలో బంధించబడుతుంటే... దేశాన్ని దోచుకుంటున్న దొంగలు మాత్రం గద్దెనెక్కుతుండటం దేశానికి పట్టిన గ్రహణమని విమర్శించారు. దేశంలో కొద్దో గొప్పో న్యాయవ్యవస్థ పనిచేస్తున్నందునే సమాజం మనుగడ సాగిస్తోందని, న్యాయ వ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేయాల్సి ఉందన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు జరిగే ప్రతి ఉద్యమంలో సీపీఐ ప్రత్యక్షంగా పూర్తిగా భాగస్వామ్యం అవుతుందని కూనంనేని సాంబశివరావు ప్రకటించారు. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం, దర్యాప్తు సంస్థలు స్వతంత్రను కలిగి ఉంటేనే ప్రజాస్వామ్యం బతికి ఉంటుందని అన్నారు. ప్రస్తుతం దేశ ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని, దానిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. ప్రభుత్వాలతో సంబంధం

- మిగతా 2 లో

ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్

ముగ్గురు మావోయిస్టుల మృతి

విశాలాంధ్ర-చింతూరు: ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ జిల్లా కేంద్రానికి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న చింద్ ఖరక్ అడవిలో ఆదివారం ఉదయం డీఆర్జీ, బీఎస్ఎఫ్ దళాలు ...మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. చింద్‌ఖరక్ కొండ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారన్న సమాచారంతో భద్రతా బలగాలను పంపామని, మావోయిస్టులు ఎదురుపడగా కాల్పులు జరిగాయని, ఈ కాల్పుల్లో మహిళ, మరో ఇద్దరు పురుష మావోయిస్టులు మృతి చెందారని జిల్లా ఎస్పీ కల్యాణ్ ఎలిశల తెలిపారు. మృతులను మైనాపూర్ ఏసీఎం సర్వన్, ఎల్‌వోఎస్ కమాండర్ మడకం రాజేష్ ఎలియాస్ రాకేష్ హేమ్లా, మైనాపూర్-నువపడ ఏరియా ఏసీఎం బసంతి కుంజం ఎలియాస్ హడమేగా గుర్తించామన్నారు. వారి వద్ద ఉన్న యస్‌యల్ఆర్, 303 రైఫిల్, 12 బోర్ రైఫిల్‌తోపాటు విప్లవ సాహిత్యం,

- మిగతా 2 లో

సంపూర్ణ సౌర విద్యుత్ గ్రామం 'కొండారెడ్డిపల్లి'

దక్షిణ భారత దేశంలోనే మొదటిగా ముఖ్యమంత్రి స్వగ్రామం

అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : సంపూర్ణ సౌర విద్యుత్ గ్రామంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లి గుర్తింపు పొందనుంది. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూర్ మండలంలో అచ్చంపేట నియోజకవర్గం పరిధిలో ఉన్న ఈ గ్రామం... దేశంలో రెండో గ్రామంగా, దక్షిణ భారతదేశంలో మొదటి గ్రామంగా తీర్చిదిద్దేందుకు చేపట్టిన పనులు దాదాపు పూర్తయ్యాయి. టీజీ రెడ్కో ద్వారా రూ.10.53 కోట్లతో 514 ఇళ్లతో పాటు 11 ప్రభుత్వ భవనాలకు సౌర విద్యుత్ ప్రాజెక్టును ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రతి ఇంటికి 3 కేవీ సామర్థ్యంతో 480 ఇళ్లకు సౌర విద్యుత్ వసతి కల్పించారు. 60 కేవీ సామర్థ్యం కలిగిన 11 ప్రభుత్వ భవనాలకు సౌర విద్యుత్ పరికరాలు బిగించారు. మొత్తం సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 1,500 కేడబ్ల్యూగా ఉంది. ఇందిరమ్మ ఇళ్లపైనా సౌర విద్యుత్ పరికరాలు బిగించనున్నట్లు టీజీ రెడ్కో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మేనేజర్ కె.మనోహర్ రెడ్డి తెలిపారు. సౌర విద్యుత్‌కు కేంద్ర ప్రభుత్వ సబ్సిడీ రూ.3.56 కోట్లు, ప్రీమియర్ ఎనర్జిస్ కంపెనీ నుంచి కార్పోరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధుల నుంచి రూ. 4.092 కోట్లు భరించారు. మరో రూ 2.59 కోట్లను మౌలిక వసతుల అభివృద్ధికి ఖర్చు చేశారు. ప్రతి ఇంటి నుంచి నెలకు 360 యూనిట్స్ విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ఇళ్ల నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను, ఇంటి వినియోగానికి పోగా, మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేశారు. గ్రిడ్‌కు పంపే విద్యుత్ యూనిట్‌కు రూ.5.25 చొప్పున చెల్లించుటకు లబ్ధిదారులతో విద్యుత్ పంపిణీ సంస్థ ఒప్పందం చేసుకుంది. ఈ నెలలో గ్రిడ్‌కు ఈ గ్రామం నుంచి సుమారు లక్ష యూనిట్స్ విద్యుత్ చేరింది. తద్వారా రూ.ఐదు లక్షలు ఆదాయాన్ని గ్రామస్తులు ఒక నెలలోనే ఆర్జించారు. ఇదిలా

- మిగతా 2 లో

రెండేళ్లుగా యుద్ధం... మృతులు 66 వేలు

గజా: అంతర్జాతీయంగా తీవ్రస్థాయిలో విమర్శలు ఎదురవుతున్నప్పటికీ గజాపై ఇజ్రాయిల్ దాడులు ఆపడం లేదు. దాదాపు రెండేళ్లుగా కొనసాగుతున్న ఇజ్రాయిల్-హమాస్ యుద్ధం కారణంగా గజాలో మృతుల సంఖ్య 66 వేలు దాటింది. మరో 1.68 లక్షల మంది గాయపడ్డారని స్థానిక ఆరోగ్యశాఖ వెల్లడించింది. మృతుల్లో దాదాపు సగం మంది మహిళలు, చిన్నారులేనని అంచనా వేసింది. శిథిలాల కింద వేలాది మంది చిక్కుకున్నట్లు భావిస్తోంది. గత 24 గంటల్లోనే 79 మంది మరణించినట్లు తెలిపింది. అయితే... మొత్తం మృతుల సంఖ్యలో సామాన్య పౌరులు, యుద్ధంలో పాల్గొన్న వారు ఎంతమంది ఉన్నారనే విషయంపై స్పష్టత ఇవ్వలేదు. 2023 అక్టోబరు 7న

- మిగతా 2 లో

'కొలతలు' కల్పతరువు

- అడ్డదారి ఆదాయంపైనే సర్వేయర్ల మక్కువ
- చలానా కట్టినా... రైతుకు తప్పని తిప్పలు
- భూముల సర్వేకు నెలల తరబడి నిరీక్షణ
- ప్రభుత్వ కొలువైనా... ప్రైవేట్‌వైపే చూపు
- వివాదాల భూములకు రెట్టింపు మామూళ్లు

విశాలాంధ్ర -సచివాలయం: ప్రభుత్వ కొలువులో ఉంటూనే ప్రైవేట్ కొలతలపై మక్కువ చూపుతూ అడ్డంగా సంపాదిస్తున్నారు సర్వేయర్లు. అడ్డదారిలో వచ్చే ఆదాయంపై ఉన్న శ్రద్ధ ప్రభుత్వ ఉద్యోగంపై లేదు. నెలకు వేలల్లో జీతాలు తీసుకుంటూనే ప్రభుత్వ పనులను మాత్రం నెలల తరబడి నాన్చుతున్నారు. చలానాలు కట్టి భూకొలతలకు దరఖాస్తులు చేసుకున్న రైతులు నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా సర్వేయర్లు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు హల్‌చల్ చేస్తున్నాయి. భూమి కొలతలకు నిరీక్షణ తప్పడం లేదు. దీనికితోడు ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూముల కొలతలపై సర్వేయర్లు నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. పాసుపుస్తకాలలో ఉన్న వివరాలకు, రెవెన్యూ రికార్డులకు పొంతన లేకపోవడం, ఆన్‌లైన్‌లో దొర్లిన తప్పులను

- మిగతా 2 లో

ఫీజుల చెల్లింపు అరకొరే!

- రూ.4,200 కోట్ల రీయింబర్స్‌మెంట్ బకాయిలు
- విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకం
- ధ్రువీకరణ పత్రాల నిలిపివేత
- ఉన్నత విద్య, ఉద్యోగాలకు దూరం
- మంత్రి లోకేశ్ ఆదేశాలు బేఖాతరు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అరకొర ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలతో విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. కార్పొరేట్ కళాశాలలకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో విద్యార్థుల ధ్రువీకరణ పత్రాల నిలిపివేత, పరీక్షకు హాజరు కానీయకపోవడం వంటి కార్పొరేట్ కళాశాలల చర్యలు చంద్రబాబు సర్కారుకు చెడ్డపేరు తెస్తున్నాయి. విద్యార్థులు డిగ్రీలు పూర్తి చేసినప్పటికీ ఫీజు రీయింబర్స్ మెంట్ సకాలంలో అందకపోవడం వలన కళాశాలల యాజమాన్యాలు వారికి ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడంలేదు. ఈ పరిస్థితి కారణంగా విద్యార్థులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కోల్పోతున్నారు. ఉన్నత విద్యావకాశాలకు దూరమవుతున్నారు. గత, ప్రస్తుత ప్రభుత్వాల హయాంలో మొత్తంగా రూ.4200 కోట్ల ఫీజు రీయింబర్స్ మెంట్, మరో రూ.2,200 కోట్ల స్కాలర్‌షిప్ బకాయిలు పేరుకుపోయాయి. మొత్తంగా రూ.6,400 కోట్ల బకాయిలు విడుదల చేయాల్సి ఉందని విద్యార్థి సంఘాలు ఆందోళనబాట పట్టాయి. వాస్తవ లెక్కల్ని ప్రభుత్వం దాచిపెడుతోందన్న విమర్శలున్నాయి. వాటిని సకాలంలో విడుదల చేయకపోవడంతో విద్యార్థుల చదువులు సాఫీగా సాగడం లేదు. ఉన్నత చదువులు, ఉద్యోగాలకు వారు దూరమవుతున్నారు. అటు ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో రాకపోవడంతో ఇంజినీరింగ్ కళాశాలల నిర్వహణ యాజమాన్యాలకు భారంగా మారింది. రాష్ట్రంలో 230 ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నాయి. ఏపీఈఏపీసెట్ ద్వారా కన్వీనర్ కోటా కింద 70శాతం సీట్లను భర్తీ చేస్తారు. ప్రభుత్వం ఇచ్చే ఫీజు రీయింబర్స్‌మెంట్

- మిగతా 2 లో

శంషాబాద్ ఎయిర్ పోర్టుకు బాంబు బెదిరింపు

విశాలాంధ్ర - హైదరాబాద్ : శంషాబాద్ ఎయిర్ పోర్టుకు బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. బాంబు పెట్టామంటూ దుండగులు ఆదివారం ఈ మెయిల్ పంపారు. అప్రమత్తమైన ఎయిర్‌పోర్టు సెక్యూరిటీ సిబ్బంది ముమ్మర తనిఖీలు నిర్వహించారు. అనంతరం అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రయాణికులను అప్రమత్తం చేశారు. ఎలాంటి ఆందోళన చెందవద్దన్నారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై తమకు వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. కాగా, ఇటీవల కాలంలో వివిధ రాష్ట్రాల్లోని ఎయిర్‌పోర్టులు, పాఠశాలలకు దుండగులు మెయిల్స్ ద్వారా బెదిరింపులకు పాల్పడుతున్నారు. అసలు ఈ మెయిల్స్ ఎవరు పంపుతున్నారన్న విషయంపై కేంద్ర ఇంటెలిజెన్స్ అధికారులు ఆరా తీస్తున్నారు.

భారత్‌తో ఆర్థిక భాగస్వామ్యం పదిలం

రష్యా మంత్రి సెర్గీ లవ్రోవ్

న్యూయార్క్: వాణిజ్యం, ఇంధన సంబంధిత అంశాల్లో భారత్ చర్యల్లో తాము జోక్యం చేసుకోమని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లవ్రోవ్ పేర్కొన్నారు. వీటిపై స్వయంగా నిర్ణయాలు తీసుకొనే సామర్థ్యం ఆ దేశానికి ఉందన్నారు. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశాలకు ఆయన హాజరయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. డిసెంబరులో పుతిన్ భారత్‌లో పర్యటించేందుకు సిద్ధమవుతున్నారని లవ్రోవ్ తెలిపారు. ఇరు దేశాల మధ్య విస్తృతమైన ద్వైపాక్షిక అజెండా ఉందన్నారు. వాణిజ్యం, సైనిక, సాంకేతికత, కృత్రిమ మేధ వంటి కీలక విషయాల్లో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని తెలిపారు. ఇరుదేశాల మధ్య జరిగే సాధారణ దౌత్య చర్చల్లో భాగంగా ఈ ఏడాదిలో విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ మాస్కోలో పర్యటించే అవకాశం ఉందని, తాను కూడా భారత్‌లో పర్యటిస్తానని వెల్లడించారు.

చమురు, వాణిజ్య విధానాలపై భారత వైఖరిని ఆయన ప్రశంసించారు. అంతకుముందు ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో మాట్లాడుతూ... భారత్-రష్యా మధ్య ఉన్న ఆర్థిక భాగస్వామ్యానికి ఎలాంటి ముప్పు లేదని స్పష్టం చేశారు. 'భారత్-రష్యా ఆర్థిక భాగస్వామ్యానికి ఎలాంటి ముప్పులో లేదు. భారత ప్రధానమంత్రి, విదేశాంగ మంత్రి ఇప్పటికే స్పష్టంచేశారు. భారత్ తన భాగస్వాములను తానే ఎంచుకుంటుంది. అమెరికా-భారత్ ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మెరుగుపరచడానికి అమెరికాకు ఏవైనా ప్రతిపాదనలు ఉంటే, దిల్లీ వాటిపై చర్చించడానికి సిద్ధంగా ఉంది. అయితే వాణిజ్యం, పెట్టుబడులు, ఆర్థిక, సైనిక, సాంకేతికత, ఇతర సంబంధాల విషయమై భారత్ ఇతర దేశాలతో మాత్రమే చర్చిస్తుంది. ఆ దేశాలకే అది సంబంధించిన విషయం' అని తెలిపారు. భారత్ జాతీయ ప్రయోజనాల పట్ల రష్యాకు పూర్తి గౌరవం ఉందని స్పష్టం చేశారు. అలాగే ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని ముగించడానికి రష్యా చర్చలకు సిద్ధంగా ఉందని లవ్రోవ్ తెలిపారు. ఏదైనా చేసే ముందు రష్యా భద్రతా సమస్యలు, రష్యన్ మాట్లాడే ప్రజల హక్కులను పరిష్కరించాలని నొక్కి చెప్పారు. దీని ఆధారంగా, ఉక్రెయిన్‌కు భద్రతా హామీలను చర్చించడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

మా ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించొద్దు

భారత్, బ్రెజిల్‌కు అమెరికా మంత్రి హెచ్చరిక

వాషింగ్టన్: అమెరికా తో వాణిజ్య భాగస్వాములైన భారత్, బ్రెజిల్ వంటి దేశాలు తమ గురించి మాట్లాడేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని అమెరికా వాణిజ్యశాఖ మంత్రి హెూవార్డ్ లుట్నిక్ హెచ్చరించారు. వారు తమ మార్కెట్లను తెరిచి.. అమెరికా ప్రయోజనాలకు హానీ కలిగించే విధానాలను వెంటనే రద్దు చేసుకోవాలన్నారు. స్విట్జర్లాండ్, బ్రెజిల్, భారత్ వంటి దేశాలను అమెరికా మరింత సరిచేయాల్సిన అవసరం ఉందంటూ ఓ ఇంటర్వ్యూలో వ్యాఖ్యలు చేశారు. ఆయా దేశాలు తమతో ఆలోచించి మాట్లాడాలని అన్నారు. రష్యా ఉక్రెయిన్‌తో యుద్ధం మొదలుపెట్టాకే భారత్ రాయితీపై రష్యా నుంచి ముడి చమురు కొనుగోళ్లు పెంచిందని హెూవార్డ్ లుట్నిక్ ఆరోపించారు. ఇప్పటికైనా ఎవరివైపు ఉండాలనే విషయంపై భారత్‌లోని మోదీ ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలన్నారు. లుట్నిక్ గతంలోనూ ఇదే విధంగా భారత్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. భారత్, కెనడా, బ్రెజిల్ వంటి దేశాలు అమెరికాలో విక్రయాలు చేపడుతూ...ప్రయోజనాలు పొందుతున్నారని.. కానీ, తమను మాత్రం ఆయా దేశాల్లో విక్రయాలు చేపట్టకుండా అడ్డుకుంటున్నాయని అన్నారు. ఏళ్ల తరబడి తాము ఈ సమస్యను ఎదుర్కొన్నాం కాబట్టే సుంకాలు విధించామన్నారు. తమతో వాణిజ్యం చేసే దేశాలు దీనిని అంగీకరించక తప్పదని చెప్పుకొచ్చారు.

ఇరాన్ అణు కార్యక్రమంపై ఆంక్షల పునరుద్ధరణ

న్యూయార్క్: ఐక్యరాజ్యసమితి ఇరాన్ అణు కార్యక్రమంపై ఆంక్షలను పునరుద్ధరించింది. ఆదివారం అర్ధరాత్రి నుంచి ఇవి అమల్లోకి వచ్చాయి. దీంతో ఇప్పటికే ఆహారం, నిధుల కొరత ఎదుర్కొంటున్న ఆ దేశం మరింత కష్టాల్లోకి జారనుంది. ఆంక్షలను ఆపేందుకు చివరి నిమిషం వరకు ఇరాన్ ప్రయత్నించినా సఫలం కాలేకపోయింది. ఐక్యరాజ్యసమితి ఆంక్షల ప్రకారం.. ఇరాన్‌కు విదేశాల్లో ఉన్న ఆస్తులను స్తంభింపజేయడం, ఆయుధ ఒప్పందాలను నిలిపివేయడం వంటివి చేయనున్నారు. ఇరాన్ బాలిస్టిక్ మిసైల్ ప్రోగ్రామ్‌పై చర్యలు తీసుకోవడం కూడా ఈ జాబితాలో ఉంది. వాస్తవానికి అక్టోబర్ 18తో ఈ ఆంక్షలు శాశ్వతంగా తొలగిపోవాల్సి ఉండగా... గతంలో జరిగిన జాయింట్ కాంప్రిహెన్సివ్ ప్లాన్ ఆఫ్ యాక్షన్ (జేసీపీవోఏ) ఒప్పందాన్ని ఇరాన్ ఉల్లంఘించింది. దీంతో ఆంక్షలు ఎదుర్కోవాల్సి వచ్చింది. జేసీపీవోఏ ఒప్పందం ప్రకారం.. అందులో సంతకం చేసిన ఏ దేశమైనా అవసరమైతే ఆంక్షలను పునరుద్ధరించవచ్చు. ఈ నేపథ్యంలో టెహ్రాన్ ఈ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని యురోపియన్ దేశాలు దేశాల ప్రతినిధులు ఆగస్టులోనే ఐరాసకు వెల్లడించారు.

జర్మనీ, బ్రిటన్ 30 రోజుల క్రితమే ఆంక్షలను పునరుద్ధరించాలని నిర్ణయించాయి. దీనికి తోడు ఈ ప్రక్రియను ఐరాస భద్రతా మండలి వీటో చేయడానికి వీల్లేకుండా డిజైన్ చేశారు. దీంతో చైనా, రష్యా ఈ విషయంలో ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడింది.

గజాపై విరుచుకుపడ్డ ఇజ్రాయిల్ సేనలు

24 గంటల్లో 44 మంది మృతి

టెల్‌అవీవ్ : హమాస్‌ను అంతం చేసి తమ పనిని పూర్తి చేస్తామని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు ఐరాస జనరల్ అసెంబ్లీ సమావేశంలో పేర్కొన్న కొన్ని గంటలకే గజాపై ఇజ్రాయిల్ దళాలు విరుచుకుపడ్డాయి. గత 24 గంటల వ్యవధిలో గాజాలో ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో 44 మంది మరణించారు. అనేకమంది గాయపడ్డారు. మృతుల్లో 9 మంది ఒకే కుటుంబానికి చెందిన వారని గజా అధికారులు తెలిపారు. వీరంతా నుసీరత్ శరణార్థి శిబిరంలో ఉంటున్నారని పేర్కొన్నారు. హమాస్ పేరుతో జనావాసాలపై ఇజ్రాయిల్ దాడులు చేస్తోందని ఆరోపించారు. మరోవైపు హమాస్ వద్ద ఉన్న బందీలను విడిపించే వరకు దాడులు ఆపబోమని ఇజ్రాయిల్ స్పష్టం చేసింది. హమాస్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న భవనాలపై మాత్రమే దాడులు చేస్తున్నట్టు పేర్కొంది. గడిచిన రెండు వారాల్లో గజాలోని రెండు ఆస్పత్రుల్ని ఇజ్రాయిల్ ధ్వంసం చేసింది. ఫలితంగా గజా అంతటా వైద్య సేవలు పూర్తిగా పతనమయ్యే అవకాశాలు ఉన్నాయి. ఆస్పత్రుల్లో ఔషధాలు, పరికరాలు, ఆహారం, ఇంధనాల కొరత నెలకొంది. దాడుల ఉద్ధృతి పెరిగిన నేపథ్యంలో అనేకమంది రోగులు, సిబ్బంది ఆస్పత్రులు విడిచి పారిపోతున్నారు. కాగా, ఇజ్రాయిల్-హమాస్ యుద్ధం కారణంగా గజాలో 2023 అక్టోబర్ నుంచి ఇప్పటి వరకు మృతి చెందిన వారి సంఖ్య 66వేలు దాటింది. గాయపడ్డవారి సంఖ్య లక్షా 67 వేలు దాటింది.

ఫ్యూచర్ సిటీ

(మొదటిపేజీ తరువాయి)

అమరావతి వరకు బుల్లెట్ ట్రైన్ ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందని, ఫ్యూచర్ సిటీలో అండర్ గ్రౌండ్ విద్యుత్ లైన్ ఏర్పాటు చేయబోతున్నామని వివరించారు. రాబోయే పదేళ్లలో ప్రపంచంలో ఉండే ఫార్చ్యూన్ 500 కంపెనీలు ఈ భారత్ ఫ్యూచర్ సిటీలో ఉండాలన్నదే తమ లక్ష్యమని అన్నారు. 'చంద్రబాబు, వైఎస్ఆర్ ముందు తరాల కోసం ఆలోచించినందువల్లే హైటెక్ సిటీ, శంషాబాద్ ఎయిర్‌పోర్టు, ఓఆర్ఆర్ వచ్చాయన్నారు. గత పాలకుల నుంచి మంచి ఉంటే నేర్చుకోవాలన్నారు. మనం ఎప్పుడూ న్యూయార్క్, సింగపూర్, దుబాయ్ గురించి చెప్పుకొంటాం... నాకు పదేళ్లు సమయం ఇవ్వండి... న్యూయార్క్‌ను మరిపించే నగరం కడతా' అని అన్నారు. చిన్నచిన్న సమస్యలు ఉంటే పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నానని భరోసా ఇచ్చారు. రాజకీయ పార్టీల ఉచ్చులో పడి కోర్టులకు వెళ్లి నష్టపోవద్దన్నారు. డిసెంబరులో ఫ్యూచర్ సిటీ అభివృద్ధి భవనం, స్కిల్ యూనివర్సిటీని పూర్తి చేస్తామన్నారు. సింగరేణి కార్పొరేట్ కార్యాలయ నిర్మాణానికి ఇక్కడ పది ఎకరాలు కేటాయించాలని భట్టి, శ్రీధర్‌బాబు కు సూచించారు. ఏడాదిలోగా నిర్మాణం పూర్తిచేసుకునేలా చూడాలన్నారు.

భవిష్యత్తు అంతా ఇక్కడే: భట్టి

ఐటీ, ఫార్మా, వ్యవసాయ రంగానికి సంబంధించిన పరిశ్రమలు, అంతర్జాతీయ స్టేడియరితో అద్భుతమైన నగరంగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం జరగబోతోంది. దేశ భవిష్యత్తు అంతా ఈ ఫ్యూచర్ సిటీ చుట్టే తిరగబోతుందేమో అన్న భావన కలుగుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీని కలుపుతూ రోడ్డు వేయడం, ఫ్యూచర్ సిటీ నుంచి ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని కలుపుతూ బందర్ పోర్టు వరకు గ్రీన్ ఫీల్డ్ రోడ్డు కేంద్ర మంత్రి తో మాట్లాడి మంజూరు చేయించుకుని వచ్చానని సీఎం చెబుతుంటే... చాలా సంతోషం వేసింది అన్నారు.

ఫ్యూచర్ సిటీ దేశానికే కాదు ప్రపంచానికే తలమానికం కాబోతోందన్నారు. గొప్ప సంకల్ప బలంతో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం మొదలు పెట్టిన ఫ్యూచర్ సిటీ నిర్మాణ కార్యక్రమం త్వరితగతిన పూర్తి కావాలని ఆశిస్తున్నట్టు తెలిపారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ దిగ్గజ కంపెనీలు తెలంగాణ వైపు చూసేలా... ప్రపంచంలోని ఇతర నగరాలకు రోల్ మోడల్ గా నిలిచేలా 'భారత్ ఫ్యూచర్ సిటీ'ని అభివృద్ధి చేయాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. 'లివ్... లెర్న్...వర్క్ ... ప్లే' అనే ప్రణాళికతో పరిశ్రమలు, ఆసుపత్రులు, పాఠశాలలు, షాపింగ్ మాల్స్ అన్ని ఒకే చోట ఉండేలా అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ నగరాన్ని అభివృద్ధి చేయబోతున్నామని చెప్పారు. భావి తరాల కోసం, మన బిడ్డల కోసం, వారి బంగారు భవిష్యత్తు కోసం... ఈ రోజు మనందరం కలిసి వేస్తున్న పునాదే ఈ భారత్ ఫ్యూచర్ సిటీ అని తెలిపారు.

తొక్కిసలాట వెనుక కుట్ర!

(మొదటిపేజీ తరువాయి)

రాళ్లు రువ్వడం, పోలీసులు లాఠీఛార్జి చేయడం వల్లే ఈ ఘటన జరిగినట్లు టీవీకే ఆరోపించింది. ఈ ఘటనపై విచారణను ప్రత్యేక దర్యాప్తు బృందం లేదా సీబీఐకి అప్పగించాలని కోరనున్నట్లు టీవీకే న్యాయవాది ఎస్ అరివళగన్ చెప్పారు. ఘటనలో కుట్ర కోణం ఉందనేందుకు స్థానిక ప్రజల నుంచి తమకు విశ్వసనీయ సమాచారం ఉందని ఆయన తెలిపారు. దీనికి సంబంధించి కొన్ని సీసీటీవీ దృశ్యాలు కూడా ఉన్నట్లు పేర్కొన్నారు. ర్యాలీలో నిబంధనలు ఉల్లంఘించారని రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఆరోపణలను అరివళగన్ తోసిపుచ్చారు. గత రెండు నెలలుగా వివిధ ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహించగా, ఎక్కడా ఇలాంటి ఘటనలు జరగలేదని పేర్కొన్నారు. కానీ, కరూర్‌లోనే తొక్కిసలాట జరగడంపై సందేహాలు ఉన్నట్లు చెప్పారు. అయితే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దండపాణి నివాసానికి వెళ్లి విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. సోమవారం(సెప్టెంబర్ 29) మధ్యాహ్నం 2:15 గంటలకు హైకోర్టులోని మధురై బెంచ్‌కు కేసు విచారణకు వస్తుందని వెల్లడించారు. టీవీకే డిప్యూటీ జనరల్ సెక్రటరీ నిర్మల్ కుమార్ కూడా ఇదే విషయాన్ని మీడియాకు వివరించారు.

విజయ్ సహాయకులపై కేసు నమోదు

కరూర్‌లో తొక్కిసలాటకు సంబంధించి విజయ్‌కు చెందిన ఇద్దరు సహాయకులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. పార్టీ ప్రధాన కార్యదర్శి ఆనంద్, జాయింట్ జనరల్ సెక్రటరీ నిర్మల్ కుమార్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ ఘటనకు సంబంధించి నాలుగు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. హత్యాయత్నం, మరణానికి కారణమవడం, అధికారుల ఆదేశాలను ధిక్కరించడం, నిర్లక్ష్యంగా వ్యవహరించడం వంటి సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని లా అండ్ ఆర్డర్ ఏడీజీపీ ఎస్ డేవిడ్‌సన్ ధ్రువీకరించారు. ఈ ఘటనపై ప్రాథమిక దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు.

విజయ్ ఇంటి వద్ద అదనపు భద్రత

తొక్కిసలాట తర్వాత ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు నీలంకరాయ్‌లోని విజయ్ ఇంటి వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. 20మంది సీఆర్‌పీఎఫ్ పోలీసులను మోహరించారు. కేంద్రం ఇప్పటికే విజయ్‌కు వై కేటగిరీ భద్రతను కల్పిస్తోంది. విజయ్ ఇంటి దగ్గర రోడ్డుకు ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేయగా, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ నేతృత్వంలో 20 మందికి పైగా పోలీసులు భద్రత కల్పిస్తున్నారు. భద్రతా కారణాల దృష్ట్యా ఆయన ఇంటి చుట్టూ అదనపు పోలీసు అధికారులను మోహరించారు. విజయ్ ఇల్లు ఉన్న ప్రాంతానికి అనుమానాస్పదంగా ఎవరైనా వస్తే వారిని ప్రశ్నించాలని పోలీసులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో, విజయ్ ఇంటికి అదనపు భద్రత కల్పించడానికి, కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సాయుధ సీఆర్‌పీఎఫ్ పారామిలిటరీ సిబ్బందిని మోహరించారు.

ఫీజుల చెల్లింపు అరకొరే!

(మొదటిపేజీ తరువాయి)

నిధుల ఆధారంగానే కళాశాలలు పనిచేయాల్సి ఉంది. చిన్నపాటి ఇంజినీరింగ్ కళాశాలకు రూ.5 నుంచి రూ.10 కోట్లు, అంతకంటే పెద్ద ఇంజినీరింగ్ కళాశాలలకు రూ.30 నుంచి రూ.50 కోట్లు బకాయిలు పేరుకుపోయాయి.ఇదే అదునుగా యాజమాన్యాలు ప్రభుత్వం నుంచి బకాయిలతో సంబంధం లేకుండా...విద్యార్థుల నుంచే ఫీజుల వసూలు పనిగా పెట్టుకున్నాయి.

కూటమి ప్రభుత్వంలో 1141.49 కోట్ల విడుదల

2024-25 విద్యా సంవత్సరానికి గాను ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.2626.60కోట్ల బకాయిలు ఉండగా, అందులో రూ.1141.49 కోట్లు మాత్రమే చెల్లించామని, మిగిలిన రూ.1485.14కోట్ల బకాయిలను వీలైనంత త్వరగా చెల్లిస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శాసన మండలిలో వెల్లడించారు. విద్యా సంవత్సరం పూర్తయ్యి, డిగ్రీలు పూర్తి చేసిన విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకుండా కళాశాలల యాజమాన్యాలు అడ్డంకులు సృష్టిస్తున్నాయి. ధ్రువీకరణ పత్రాలు నిలిపివేయరాదన్న మంత్రి నారా లోకేశ్ స్పష్టమైన ఆదేశాల్ని సైతం ప్రైవేట్ కళాశాలలు, విశ్వవిద్యాలయాల యాజమాన్యాలు భేఖాతరు చేస్తున్నాయి. తాజాగా గుంటూరుజిల్లా ప్రజాప్రతినిధికి చెందిన ఓ ప్రైవేట్ కళాశాలలో విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలను నిలిపివేసిన ఘటన వెలుగులోకి రావడం ఈ సమస్య తీవ్రతను బయటపెడుతోంది. ఇది ఒక్కటే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అనేక ప్రైవేట్ ఇంజినీరింగ్, విశ్వవిద్యాలయాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. పాత, కొత్త బకాయిలు పేరుకుపోవడం వల్ల వాటిని చెల్లించిన తర్వాతే ధ్రువీకరణ పత్రాలు ఇస్తామని కళాశాలల యాజమాన్యాలు చెబుతున్నాయి. ఈ కారణంగా కొందరు విద్యార్థులు క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో ఎంపికైనప్పటికీ ధ్రువీకరణ పత్రాలు అందక ఉద్యోగ అవకాశాలను కోల్పోతున్నారు. ఈ పరిణామాలు రాష్ట్ర విద్యార్థుల భవిష్యత్తు పై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను పూర్తిగా చెల్లించి, విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలను ఎటువంటి అడ్డంకులు లేకుండా అందించేలా ప్రభుత్వం, విద్యాసంస్థలు తక్షణ చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

అధికారంలోకి వచ్చాక మంత్రి లోకేశ్ మౌనం -ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ

అధికారంలోకి రాకముందు ప్రస్తుత మంత్రి నారా లోకేశ్...అప్పుడున్న వైసీపీ ప్రభుత్వంలో ఎంత ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయో గణాంకలతో సమా వెల్లడించారని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ గుర్తుచేశారు. విద్యార్థులు డిగ్రీలు, పీజీలు పూర్తిచేసుకున్నప్పటికీ సర్టిఫికెట్లు లేక పోవడంతో ఉద్యోగాలు పొందలేక జొమాటో, రేపిడో, స్విగ్గిల్లో పనిచేసుకుంటున్నారని లోకేశ్ చెప్పారన్నారు. వైసీపీ ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా విద్యార్థుల్ని ఇబ్బంది పెడుతోందని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే యూజర్ నెంబర్ స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేసి ప్రతి ఒక్క విద్యార్థికి ధ్రువీకరణ పత్రాల్ని ఇప్పించే పూచి తనదేనని లోకేశ్ హామీ ఇచ్చారన్నారు. నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత అసెంబ్లీ, శాసనమండలి సమావేశాల్లో వైసీపీపై దుమ్మెత్తిపోస్తూ బకాయిలు మొత్తం వైసీపీ హయాంలో ఉన్నాయని, మాకు సంబంధం లేదని చెప్పడం సిగ్గుచేటన్నారు. ఈ విద్యా సంవత్సరం జులై 12వ తేదీన రూ.600 కోట్లు విడుదల చేస్తామని మంత్రి ప్రకటన ఇచ్చారేగానీ...దాన్ని ఆచరణలో పెట్టలేదు. కేవలం విద్యార్థులు మాత్రమే కాదు..కొన్ని కళాశాల యాజమాన్యాలు అప్పుల పాలైన పరిస్థితి ఉందని తెలిపారు. ఫీజుల బకాయిలతో సంబంధం లేకుండా చదువు పూర్తి చేసిన విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని కూటమి ప్రభుత్వం ఆదేశించినప్పటికీ గుంటూరులో సాక్షాత్తూ టీడీపీ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు చెందిన ఇంజనీరింగ్ కళాశాలలో నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థులను పూర్తి ఫీజు చెల్లిస్తేనే...పరీక్ష ఫీజు చెల్లించడానికి అనుమతిస్తామని చెప్పడంతో విద్యార్థి సంఘాలు వెళ్లి అక్కడ ఆందోళనకు దిగడంతో వెనక్కితగ్గారన్నారు. విద్యార్థులకు కావాల్సిందీ..విమర్శలు ప్రతి విమర్శలూ కాదనీ, తక్షణమే రూ.4200 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, మరో రూ.2,400 కోట్ల స్కాలర్‌షిప్ బకాయిలను తక్షణమే ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

నిద్రావస్థలో ప్రజాస్వామ్య వ్యవస్థలు

(మొదటిపేజీ తరువాయి)

లేకుండా స్వతంత్ర కమిషన్ ఏర్పాటు చేసి ఎన్నికల కమిషన్, దర్యాప్తు సంస్థల పని చేయాలని ఆయన సూచించారు. స్వతంత్ర కమిషన్ ఉంటే ఓట్ల చోరీ జరగదని, ప్రభుత్వాలు దర్యాప్తు సంస్థలను భయపెట్టి పనులు చేయించుకునే పరిస్థితులు ఉండవని అభిప్రాయపడ్డారు. ప్రజల ఓట్లతో కాకుండా... ఈవీఎంలు విజయాన్ని నిర్ణయిస్తున్నాయని, ఈసీ పారదర్శకంగా పనిచేయటం లేదని విమర్శించారు. తెలంగాణ సాయుధ పోరాట యోధులు కందిమళ్ల ప్రతాపరెడ్డి మాట్లాడుతూ ఈవీఎంల ద్వారా ఓట్ల చోరీకి పాల్పడుతూ గద్దెనెక్కిన బీజేపీ... దేశంలోని అన్ని ప్రధాన సంస్థలను చెరబట్టి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందన్నారు. బీజేపీ అధికారానికి చరమగీతం పాడేందుకు ఈవీఎం విముక్త భారత్ పేరుతో ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుట్టాలని, ఇందుకు ప్రశాంత్ భూషణ్ దేశవ్యాప్తంగా న్యాయకత్వం వహించాలని కోరారు.

భారత్‌పై యుద్ధానికి 50 లక్షల మంది సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

చేపడుతామని ప్రగల్భాలు పలుకుతున్నారు. బంగ్లాదేశ్‌పై సైనిక చర్యకు ప్రయత్నిస్తే తమ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత భారత్‌పై యుద్ధం చేస్తామని తాహెర్ అన్నాడు. బంగ్లాదేశ్ అమెరికన్ అసోసియేషన్ న్యూయార్క్‌లో నిర్వహించిన ప్రజా స్వాగత సభలో ఆయన ప్రసంగిస్తూ జమాతే ఇస్లామి 'ఘజ్వా ఎ హింద్' కు సిద్ధంగా ఉందని పేర్కొన్నాడు. 1971లో బంగ్లాదేశ్ విముక్తి యుద్ధంలో జమాతే ఇస్లామీ పాకిస్థాన్‌కు మద్దతు ఇచ్చింది. ఆ కళంకాన్ని తుడిచేయడానికి భారత్‌పై యుద్ధంలో పాల్గొనేందుకు బంగ్లాదేశ్‌లో 50 లక్షల మంది యువత సిద్ధంగా ఉన్నారని జమాత్ నేత చెప్పాడు. 'జమాత్ అధికారంలోకి వస్తే భారతదేశం బంగ్లాదేశ్‌పై దాడి చేయగలదని ప్రజలు నమ్ముతారు. వారు ప్రవేశించాలని నేను ప్రార్థిస్తున్నాను. ఇది 1971లో మనపై ఉన్న కళంకాన్ని తొలగిస్తుంది. నిజమైన స్వాతంత్ర్య సమరయోధులుగా నిరూపించుకోవడానికి మాకు అవకాశం ఇస్తుంది' అని అన్నాడు. బంగ్లాదేశ్‌పై భారత్ దాడి చేస్తే షేక్ హసీనా మద్దతు ఇస్తుందని ఆరోపించాడు.

'కొలతలు' కల్పతరువు!

(మొదటిపేజీ తరువాయి)

సరిదిద్దుకునేందుకు రైతులు తమ భూములు సర్వే చేయించుకునేందుకు చలానాలు కట్టి ఎదురుచూస్తున్నారు. ఎకరాకు రూ.రెండు వేల నుంచి రూ.మూడు వేల వరకు ముట్టజెప్పితేనే కొలతకు రావడం లేదని అన్నదాతలు ఆరోపిస్తున్నారు. సాధారణంగా ప్రభుత్వ భూమి 10 ఎకరాలోపు విస్తీర్ణం కొలిస్తే రూ.500 ప్రభుత్వానికి చలానారూపంలో రైతు చెల్లిస్తారు. కొన్ని మండలాల్లో లైసెన్స్‌డ్ సర్వేయర్లు మండల కేంద్రాలకు వచ్చేందుకు అయిష్టత చూపుతున్నారు. వీరిపై పూర్తి అజమాయిషీ అధికారులకు లేదు. ఎందుకంటే నెలసరి వేతనాలు వీరికి ఉండవు. లైసెన్స్‌డ్ సర్వేయర్లను విధిగా హాజరు కావాలని చెప్పే సాహసం అధికారులు చేయడం లేదు. కొందరు ప్రభుత్వ సర్వేయర్లు ప్రైవేటు భూములను కొలిచేందుకు లైసెన్స్‌డ్ సర్వేయర్లను బినామీలుగా మార్చుకుంటున్నారు. సర్వేయర్లకు ప్రైవేటు కొలతలపై ఉన్న మోజు ప్రభుత్వ విధులపట్ల చూపడం లేదు. రియల్ ఎస్టేట్ వ్యాపారం సర్వేయర్ల పాలిట వరంగా మారింది. చలానా చెల్లించిన రైతుల భూములకు కొలతలు వేయడం కన్నా పట్టణాల్లో రియల్ వ్యాపారులు వేసిన వెంచర్లను కొలిచి సొమ్ము చేసుకుంటున్నారు. ఇక వివాదాలు... అసైన్డ్ భూములు, ఆక్రమిత భూముల కొలతలైతే ఆ రేటు మరింత రెట్టింపు ఉంటుంది. వాస్తవానికి ప్రభుత్వానికి చలానా కట్టి కొలతలు వేయించుకోవాలి కాని కొందరు రియల్టర్లు వ్యవసాయ భూములు వ్యవసాయేతర భూములుగా మార్చుకోకుండానే ప్లాట్లు వేస్తున్నారు. దీని వల్ల ప్రభుత్వానికి పెద్ద ఎత్తున నష్టం వాటిల్లుతుంది. ప్రభుత్వ ఉద్యోగం చేస్తూనే కొందరు సర్వేయర్లు ప్రైవేటు వ్యక్తులు చేసే అక్రమ వ్యాపారాలకు మద్దతు తెలుపుతున్నారు. మరికొందరు తెరవెనుక ఉంటూ లైసెన్స్‌డ్ సర్వేయర్లతో పనులు చేయిస్తూ వాటాలు తీసుకుంటున్నారు. సివిల్ వివాదాలు, రెవెన్యూ వివాదాలతో కోర్టుల్లో ఉన్న భూములు, స్థలాలకు కొలతలు వేయించాలంటే సర్వేయర్లకు రెట్టింపు మొత్తంలో అమ్యామ్యాలు ఇచ్చుకోవాల్సి వస్తుందన్న ఆరోపణలు కోడై కూస్తున్నాయి. ప్రధాన సర్వేయర్ ... తనకు తెలియకుండా సహాయక సర్వేయర్లు కొలతలు వేయడానికి వీల్లేదంటూ ఆదేశాలు జారీ చేస్తున్నారు. ప్రభుత్వ సర్వేయర్ల చుట్టూ ప్రదక్షిణలు చేయలేక పలువురు రైతులు ప్రైవేటు సర్వేయర్లను ఆశ్రయిస్తున్నారు. దీనికితోడు తహసీల్దార్ కార్యాలయాల్లో కొందరు లైసెన్స్‌డ్ సర్వేయర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారన్న విమర్శలున్నాయి. ప్రభుత్వ సర్వేయర్, లైసెన్స్‌డ్ సర్వేయర్ల ద్వారానే భూములు సర్వే చేసుకోవాల్సి వస్తే... రైతుల జేబుకు చిల్లు పడుతోంది. కొందరు సర్వేయర్లు ... చేయి తడిపితే తప్ప క్షేత్రస్థాయికి వెళ్లని పరిస్థితి నెలకొంది.

రెండేళ్లుగా యుద్ధం... మృతులు 66 వేలు

(మొదటిపేజీ తరువాయి)

ఇజ్రాయిల్‌పై హమాస్ ఉగ్రవాదులు మెరుపుదాడులకు పాల్పడటం... దీనికి ప్రతీకారంగా హమాస్ నెట్‌వర్క్ అంతమే లక్ష్యంగా టెల్‌అవీవ్ విరుచుకుపడుతోంది. ఫలితంగా గజా జనాభాలో దాదాపు 90 శాతం మంది నిరాశ్రయులుగా మారారు. మరణాలతోపాటు పెద్దఎత్తున విధ్వంసం, మానవతా సంక్షోభం, కరువుతో పరిస్థితులు మరింత దుర్భరంగా మారాయి. కొన్నిరోజులుగా గజా సిటీ లక్ష్యంగా ఇజ్రాయిల్ తన దాడులను ముమ్మరం చేసింది. మరోవైపు... ప్రపంచ దేశాలు నెతన్యాహు సర్కారు తీరును తీవ్రంగా తప్పుపడుతున్నాయి. ఇటీవల ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, బ్రిటన్, కెనడా దేశాలు పలస్తీనాను దేశంగా గుర్తించాయి.

మద్యం వినియోగంలో కర్నాటక టాప్

(మొదటిపేజీ తరువాయి)

కొనసాగించాయి. దేశవ్యాప్తంగా 40.17 కోట్ల విస్కీ కేసుల అమ్మకాలు జరగగా... దక్షిణాది రాష్ట్రాల్లోనే 58 శాతం వినియోగం కనిపించింది. ఈ రాష్ట్రాల్లో 23.18 కోట్ల కేసులు అమ్ముడైనట్లు సీఐఏబీసీ వెల్లడించింది.

కర్నాటకలో అత్యధికంగా 6.88 కోట్ల కేసులు (17శాతం) అమ్ముడవగా... 6.47 కోట్ల కేసులతో తమిళనాడు (16 శాతం) రెండో స్థానంలో నిలిచింది. ఆంధ్రప్రదేశ్ (3.55 కోట్లు), తెలంగాణ (3.1 కోట్లు), కేరళ (2.29 కోట్లు) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. 0.28 కోట్ల కేసుల అమ్మకాలతో పుదుచ్చేరి 19వ స్థానంలో నిలిచింది. మహారాష్ట్రలో గతేడాది 2.71 కోట్ల విస్కీ కేసులు అమ్మడయ్యాయి. ఉత్తరాది రాష్ట్రాల్లో ఉత్తరప్రదేశ్‌లో అత్యధికంగా 2.50 కోట్ల కేసులతో జాతీయస్థాయిలో ఆరో స్థానంలో నిలిచింది. రాజస్థాన్, దిల్లీ, హర్యానా రాష్ట్రాలు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. గతేడాదితో పోలిస్తే దక్షిణాదిలో ఒకశాతం వినియోగం పెరగగా... యూపీలో 6 శాతం పెరిగింది. జార్ఖండ్, రాజస్థాన్, పుదుచ్చేరిలో 10 శాతానికి పైగా వృద్ధి కనిపించింది. ఏటా రాష్ట్రాలు గణనీయంగా పన్నులు పెంచడంతోపాటు మద్యం విధానాల్లో మార్పులు తెస్తుండటం ద్వారా అమ్మకాలపై ప్రభావం పడుతోందని సీఐఏబీసీ డైరెక్టర్ జనరల్ అనంత్ ఎస్ అయ్యర్ పేర్కొన్నారు.

చత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్

(మొదటిపేజీ తరువాయి)

వంటసామగ్రి స్వాధీనం చేసుకున్నారు. కాగా సర్వన్‌పై రూ.10 లక్షల రివార్డు, రాజేష్‌పై రూ.ఐదు లక్షలు, బసంతిపై రూ.లక్ష రివార్డు కలదని వివరించారు. బస్తర్ రేంజ్ డీఐజీ సుందర్ రాజ్, పి.కాంకేర్, రేంజ్ డీఐజీ విపుల్ మోహన్ బాల, బీఎస్ఎఫ్ సెక్టర్ కన్నారావు, కాంకేర్ అదనపు ఎస్పీ నిఖిల్ రాకేష్ సంయుక్త ప్రణాళికతో చేపట్టిన ఎదురుకాల్పులు విజయవంతమైనట్లు తెలిపారు. డీఐజీ మాట్లాడుతూ లొంగిపోయే మావోయిస్టులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని అన్నారు. దీనికోసం 'లోను వర్రాటు' (ఇంటికి రండి) అనే పథకాన్ని ప్రవేశపెట్టిందని చెప్పారు.

నితీశ్ ప్రభుత్వ హామీల అమలు అసాధ్యం: తేజస్వి

పట్నా: ఎన్నికలకు ముందు నితీశ్‌కుమార్ ప్రభుత్వం బూటకపు హామీలనివ్వడం ద్వారా ప్రజల్ని మభ్యపెట్టేందుకు యత్నిస్తోందని ఆర్జేడీ నాయకుడు తేజస్వీయాదవ్ అన్నారు. బీహార్‌లో ఎన్డీఏ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటే... ప్రభుత్వ ఖజానాకు రూ.7 లక్షల కోట్లు ఖర్చవుతుందని చెబుతూ... ఇది జరిగే పని కాదన్నారు. గత కొన్ని రోజులుగా ప్రభుత్వం చేసిన ప్రకటనలన్నీ తాను గతంలో చేసిన వాగ్దానాల అనుకరణలేనని ఆయన తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించిన తర్వాత అధికార ఎన్డీఏను ఓడించడానికి ప్రతిపక్షాలకు బ్యాకప్ ప్లాన్ ఉందని ఆయన పునరుద్ఘాటించారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రజలకు తాము ఏం చేస్తామో వెల్లడిస్తామని తెలిపారు. ప్రధాని మోదీ, సీఎం నితీశ్‌కుమార్ ఇప్పుడు ఇప్పుడు మిత్రులు కావచ్చు కానీ ప్రధానమంత్రి అవినీతి గురించి మాట్లాడటానికి చాలా ఇష్టపడతారన్నారు. ఆయన బహిర్గతం చేయడానికి ప్రయత్నిస్తున్న అవినీతి కుంభకోణాలకు సంబంధించి ఆయన ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుందో మేము తెలుసుకోవాలనుకుంటున్నామని ఎద్దేవా చేశారు.

గ్రూప్-2 ఫలితాల విడుదల

(మొదటిపేజీ తరువాయి)

దాదాపు 13,315 మందిని కమిషన్ అనర్హులుగా ప్రకటించింది. మిగిలిన 2,36,649 మంది అభ్యర్థుల జనరల్ ర్యాంక్ లిస్ట్ (మార్కులతో సహా)ను ఈ ఏడాది మార్చి 11న విడుదల చేసింది. ఇప్పటికే అభ్యర్థుల ధృవపత్రాల పరిశీలన పూర్తిచేసింది. మొత్తం 18 రకాల పోస్టులకు సంబంధించి టీజీపీఎస్సీ గ్రూప్ 2 తుది ఫలితాలను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది.

సంపూర్ణ సౌర విద్యుత్ గ్రామం 'కొండారెడ్డిపల్లి'

(మొదటిపేజీ తరువాయి)

ఉండగా... కొండారెడ్డిపల్లిలో మంత్రులు దామోదర్ రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి పర్యటించారు. స్థానిక శాసన సభ్యులు డా.వంశీ కృష్ణతో కలసి పలు శంకుస్థాపనలు, అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేశారు. జాతీయ రహదారి నుంచి కొండారెడ్డిపల్లి వరకు రోడ్డు , మిల్క్ చిల్లింగ్ యూనిట్‌తో పాటు జీపీ భవనంలో సోలార్ యూనిట్ ను ప్రారంభించారు. ఆలయ ప్రాంగణంలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ట్యాప్ కనెక్షన్లు, పిల్లల పార్క్, ఓపెన్ జిమ్ ప్రారంభించి పోల్కంపల్లిలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు.

మతోన్మాద శక్తులను ఓడించడమే భగత్‌సింగ్‌కు నిజమైన నివాళి

విశాలాంధ్ర - నేరేడుచర్ల : షహీద్ భగత్ సింగ్ నేటి యువతకు ఆదర్శ ప్రాయుడని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనంజయ నాయుడు పిలుపునిచ్చారు. షహీద్ భగత్‌సింగ్ 118వ జయంతిని పురస్కరించుకుని ఏఐవైఎఫ్ నేరేడుచర్ల మండల సమితి ఆధ్వర్యంలో నేరేడుచర్ల ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య పోరాటంలో భగత్‌సింగ్ నిర్వహించిన పాత్ర యావత్తు దేశం విస్మరించరానిదని, 12 ఏళ్ళ అతి చిన్న వయసులోనే స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని 23 ఏళ్ళ యువప్రాయంలోనే దేశం కోసం ప్రాణాలర్పించి ఎందరో యువతకు స్ఫూర్తిగా నిలిచి దేశ భక్తిని రగిలించిన సమరయోధుడు, విప్లవ మూర్తి భగత్‌సింగ్ అని వారు కొనియాడారు. మతోన్మాద రాజకీయాలను సమూలంగా ఓడించడమే భగత్‌సింగ్‌కు నేటితరం అందించగలిగే నిజమైన నివాళి అని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను మండల సిపిఐ కార్యదర్శి కత్తి శ్రీనివాసరెడ్డి సిపిఎం పట్టణ కార్యదర్శి కొదమగుండ్ల నగేష్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఇంజమూరు మల్లయ్య బీసీ హక్కుల సాధన సమితి సూర్యాపేట జిల్లా సహాయ కార్యదర్శి కొమ్రరాజు వెంకట్ అనంత ప్రకాష్ ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్షుడు పరికె భరత్, గూడ వినయ్ పాల్గొన్నారు.

బతుకమ్మ, దసరా రావణ వధ ఘనంగా నిర్వహించాలి

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్/తొర్రూరు: బతుకమ్మ, దసరా రావణ వధను ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. సద్దుల బతుకమ్మ సందర్భంగా ఆదివారం డివిజన్ కేంద్రంలోని పెద్ద చెరువు వద్ద ఏర్పాట్లను ఎమ్మెల్యే పరిశీలించారు. బతుకమ్మ ఆడే చెరువు పరిసరాలతో పాటు నిమజ్జన ప్రాంతాల వద్ద లైటింగ్, పారిశుధ్య పనులు, తాగునీటి వసతి, మైదానాలను చదును చేయడం వంటి పనులు పరిశీలించారు. ఆదివారం యతి రాజారావు పార్కులో నిర్వహించే రావణ వద కార్యక్రమ ఏర్పాట్లను సైతం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తరతరాల తెలంగాణ జనజీవన సంస్కృతికి ప్రతిబింబం బతుకమ్మ పండగని, తెలంగాణ ఆత్మగౌరవ ఉద్యమ చిహ్నం బతుకమ్మ అని తెలిపారు. మహిళలు అత్యంత ఉత్సాహంతో ఆటపాటలతో జరుపుకునే పండుగ బతుకమ్మ తొర్రూరు పట్టణంలో ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. మహిళలు ఆనందంగా పండుగను జరుపుకోవాలని కోరారు. పండుగ ప్రకృతితో మమేకమై పర్యావరణ పరిరక్షణకు ఇచ్చే ప్రాధాన్యతను తెలియజేస్తుందని ఆయన వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, ఏఎంసీ డైరెక్టర్ సొంటి రెడ్డి సంధ్యారాణి భాస్కర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పెదగాని సోమయ్య, చాపల బాపురెడ్డి, గంజి విజయపాల్ రెడ్డి, మంగళపల్లి రామచంద్రయ్య, గుండాల నర్సయ్య, చిత్తలూరి శ్రీనివాస్ గౌడ్, ధరావత్ సోమన్న, తూనం శ్రావణ్ కుమార్, రాజేష్ నాయక్, భూసాని రాము, గంజి ప్రసాద్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, ముద్దసాని సురేష్, అలువాల సోమయ్య, బసనబోయిన రాజేష్ యాదవ్, ప్రవీణ్ గౌడ్, మహేష్ యాదవ్, వెంకట్ రెడ్డి, నాగిరెడ్డి, కృపాకర్ రాజు, చంటి, నడిగడ్డ మధు పాల్గొన్నారు.

ఏఐటీయుసిపై అనవసర విమర్శలు మానుకోవాలి

విశాలాంధ్ర ప్రతినిధి- పెద్దపల్లి, సింగరేణి: సింగరేణిలో గుర్తింపు సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటీయుసి) 2025 సెప్టెంబర్ 25న డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ సమక్షంలో యాజమాన్యంతో చేసుకున్న ఒప్పందంపై అవగాహన లేకుండా, బాధ్యతారాహిత్యంగా అనవసర విమర్శలు చేసిన హెచ్‌ఎంఎస్ నాయకుడు రియాజ్ ఇకనైనా మానుకోవాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఉప ప్రధాన కార్యదర్శులు వై.వి.రావు, మడ్డి ఎల్లయ్యలు అన్నారు. ఆదివారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గని ప్రమాదంలో మరణించిన కార్మికుల వారసులకు సూటబుల్ జాబు విషయంలో గతంలో ఉన్న అర్హతలకు అదనంగా డిగ్రీ, పీజీ చేసిన వారికి కూడా వర్తింపజేయాలని యాజమాన్యంతో ఒప్పందం చేసుకుంటే దాన్ని విమర్శించడం తెలివితక్కువ తనమని, దీనిపై బహిరంగ విచారణకు రమ్మంటే రియాజ్ రాలేదని విమర్శించారు. ఏఐటియుసి నాయకులు కె.రాజారత్నం, జూపాక రాంచందర్, ఆరెల్లి పోషం, జీగురు రవిందర్, మందల రాంచంద్రారెడ్డి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గౌతం గోవర్ధన్, నాయకులు మాదన మహేష్, రంగు శ్రీను బోగ సతీష్ బాబు, ఆకునూరి శంకరయ్య పాల్గొన్నారు.

ఘనంగా సినీ నటుడు వేణు మాధవ్ జయంతి

విశాలాంధ్ర - కోదాడ : కోదాడలో "తెర" సాంస్కృతిక కళామండలి ఆధ్వర్యంలో సినీ హాస్యనటులు, నంది అవార్డు గ్రహీత వేణుమాధవ్ జయంతి వేడుకలను ఆదివారం స్థానిక "తెర" కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. "తెర" సాంస్కృతిక కళామండలి వ్యవస్థాపక అధ్యక్షులు వేముల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తన చేష్టల ద్వారా, హావభావాల చేత హాస్యాన్ని పలికిస్తూ విద్యార్థి దశ నుండే అనేక ప్రదర్శనలు ఇచ్చి అందరినీ రంజింపజేశారని, రంగస్థలంపై, తన మిమిక్రీ కళ చేత రాష్ట్రవ్యాప్తంగా కొన్ని వేల ప్రదర్శనలు ఇచ్చి కళాప్రియుల చేత శభాష్ అనిపించుకున్నారన్నారు. "తెర" సాంస్కృతిక కళామండలి సలహాదారులు పార సీతయ్య మాట్లాడుతూ వేణుమాధవ్ కోదాడలో అందరివాడుగా కలిసి ఉండే వారని, సినిమా రంగంలో ఎంత బిజీగా ఉన్నప్పటికీ కోదాడని మరచిపోలేదని, రాష్ట్రంలో వరదలు వచ్చినప్పుడు కోదాడలో వరద బాధితుల సహాయార్థం విరాళాలు సేకరించి ఆనాటి ముఖ్యమంత్రి రోశయ్యకు అందించారన్నారు. షేక్ మీరా, షేక్ పీర్ సాహెబ్, పాలూరి సత్యనారాయణ, కంచుకొమ్ముల శంకర్, గార్లపాటి వీరారెడ్డి, గుండెల సూర్యనారాయణ యాదవ్, షేక్ యాకూబ్, ఓరుగంటి శ్రీనివాసరెడ్డి, బుడిగం నరేష్, పెద్దినేని రామారావు, కోలా శ్రీనివాసరావు, దర్శకులు తిరూప్, మచ్చ ఉపేందర్, కందిబండ ఉపేందర్ రావు, ప్రభాకర్‌రావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ ఏర్పాటుతో యువతకు ఉన్నత విద్యావకాశాలు

సమ్మక్క సారలమ్మ సెంట్రల్ ట్రైబల్ విశ్వవిద్యాలయం గోడ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి సీతక్క

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో: యూనివర్సిటీ ఏర్పాటు ద్వారా స్థానిక యువతకు ఉన్నత విద్యా అవకాశాలు అందుతాయని, విద్యా రంగంలో కొత్త అధ్యాయం సమ్మక్క సారలమ్మ సెంట్రల్ యూనివర్సిటీ సృష్టిస్తుందని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో జాతీయ రహదారి ప్రక్కనే ఉన్న సాయిబాబా టెంపుల్ రోడ్ వద్ద సమ్మక్క సారలమ్మ సెంట్రల్ ట్రైబల్ విశ్వ విద్యాలయం కోసం 24 కోట్ల నిధులతో 8.4 కిలోమీటర్ల సమ్మేళనం గోడ నిర్మాణ పనులను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, మహబూబాబాద్, ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, జి.నాగేష్, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.ఎల్. శ్రీనివాస్‌లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ సమ్మక్క -సారలమ్మ ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటుతో ములుగు జిల్లాకు ప్రత్యేక గౌరవ లభిస్తుందని, గిరిజన విద్యార్థుల ప్రతిభను వెలికితీయడానికి ఇది బలమైన వేదిక అవుతుందని తెలిపారు. ప్రభుత్వం ఎల్లప్పుడూ గిరిజన సంక్షేమం పట్ల కట్టుబడి ఉందని యూనివర్సిటీ అభివృద్ధికి అవసరమైన నిధులు, మౌలిక వసతులను సమకూర్చుతామని పేర్కొన్నారు. యూనివర్సిటీ ఏర్పాటు ద్వారా స్థానిక యువతకు ఉన్నత విద్యా అవకాశాలు అందుతాయని, విద్యా రంగంలో కొత్త అధ్యాయం సమ్మక్క సారలమ్మ సెంట్రల్ యూనివర్సిటీ సృష్టిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థుల కోసం ఆధునిక లైబ్రరీలు, ల్యాబరేటరీలు, హాస్టల్స్, తరగతి గదులు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. స్థానిక విద్యార్థులు ఉన్నత విద్య కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటు కాబోతున్న సమ్మక్క-సారలమ్మ ట్రైబల్ యూనివర్సిటీలో 80 శాతం స్థానిక విద్యార్థులకు ప్రవేశ అవకాశాలు కల్పించడం జరుగుతుందని యూనివర్సిటీ ఏర్పాటు ద్వారా ప్రాంతీయ ప్రతిభను వెలికి తీయడానికి ముఖ్యమైన వేదికగా మారుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు జి నాగేష్ మాట్లాడుతూ 24 కోట్ల రూపాయలతో ప్రహరీ గోడ నిర్మాణానికి భూమి పూజ చేయడం జరిగిందని, కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాంతంలోని గిరిజనుల విద్యాభివృద్ధి కోసం వారి సంస్కృతి సాంప్రదాయాలను ప్రపంచానికి తెలియజేసేలా, ఆర్థిక అభివృద్ధిలో కూడా యూనివర్సిటీ ముఖ్యపాత్ర పోషిస్తుందని అన్నారు. త్వరలోనే క్యాంపస్ నిర్మాణం విద్యార్థులకు మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఆధ్వర్యంలో పూర్తిస్థాయిలో యూనివర్సిటీ నిర్మాణం పూర్తవుతుందని తెలిపారు. తెలంగాణ ప్రాంతానికి సెంట్రల్ గిరిజన యూనివర్సిటీని మంజూరు చేసినందుకు దేశ ప్రధాని, స్థానిక కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డిలకు ధన్యవాదాలు తెలియజేశారు. యూనివర్సిటీ వేగవంతంగా ఏర్పాటు చేసే విషయంలో స్థానిక పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ తో కలిసి ముందుకు వెళ్తామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమ్మక్క సారలమ్మ సెంట్రల్ యూనివర్సిటీలో రాబోయే ఐదు సంవత్సరాలలో 3000 నుంచి 5000 మంది విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించనున్నారని అన్నారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, మాజీ పార్లమెంట్ సభ్యులు సీతారామ్ నాయక్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

విశాలాంధ్ర - కారేపల్లి : అన్ని వర్గాల అభివృద్ధి సంక్షేమం కోసమే రాష్ట్రంలోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందని వైరా శాసనసభ్యులు మాలోతు రామదాసు నాయక్ అన్నారు. ఆదివారం కారేపల్లి మండలంలో వివిధ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల స్వంతింటి కల ఇందిరమ్మ ఇంటితో సాకారం చేస్తున్నారన్నారు.గత ప్రభుత్వ హాయాంలో 10 ఏండ్లు ఎదురు చూచిన అర్హులైన వారికి డబల్ బెడ్‌రూమ్ ఇళ్లు అందక ఇబ్బందులు పడ్డారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇండ్లులేని పేదలను గుర్తించి వారికి విడుతల వారిగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయటమే కాక బిల్లులు ఎప్పటికప్పుడు విడుదల చేస్తుందన్నారు. ఆకాలవర్షాలతో నష్టపోయిన రైతుల పంటలను సర్వే చేయించి వారికి పరిహారం ఇవ్వటానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం నాసిరకమైన బతుకమ్మ చీరలను పంపిణీ చేసిందని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అడపడుచులు ఆనందించేలా నాణ్యమైన చీరలను అందిస్తుందన్నారు. సింగరేణి మండలంలో బీటీ రోడ్ల పనులకు వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ శంకుస్థాపన చేశారు. భాగ్యనగర్‌తండా నుండి పోలంపల్లి వరకు 80 లక్షలతో చేపట్టనున్న బీటీ రోడ్డు, భజ్యాతండా గిద్దవారిగూడెం వరకు రూ1.70 లక్షలతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. సొసైటీ అధ్యక్షులు దుగ్గినేని శ్రీనివాసరావు, ఎంపీడీవో పీ.శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు పగడాల మంజుల, తలారి చంద్రప్రకాశ్, బానోత్ రాంమూర్తి, బానోత్ దేవ్లానాయక్, ఇమ్మడి తిరుపతిరావు, మేదరి వీరప్రతాఫ్, దారావత్ భద్రునాయక్, గడ్డం వెంకటేశ్వర్లు, పెద్దబోయిన ఉమాశంకర్, ఆలోత్ ఈశ్వరీనందరాజ్, బానోత్ రూప్ల,అజ్మీర ఈర్యా, కిలారి అప్పారావు, గుగులోతు హర్ష నాయక్, దారావత్ హేమలత బాలాజీ, అడ్డగోడ ఐలయ్య పాల్గొన్నారు.

నవ తరానికి స్ఫూర్తి ప్రదాత భగత్ సింగ్

విశాలాంధ్ర - ఖమ్మం : భారత స్వతంత్ర సంగ్రామంలో బ్రిటీష్ పాలకలను గడగడలాడించి భారత యువతకు విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలిచిన విప్లవ వీరుడు సర్దార్ భగత్‌సింగ్ అని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం డాక్టర్ మెడికల్ అకాడమీలో భగత్‌సింగ్ 118వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ స్వాతంత్ర ఆకాంక్షను నిలువెల్లా నింపుకొని ఉద్యమం తరంగంగా ఆంగ్లేయులపై ఎగసిపడి యువతను స్వాతంత్ర ఉద్యమంలో భాగస్వామ్యులు చేసిన వీరుడు భగత్‌సింగ్ అని అన్నారు. పన్నెండేళ్ళకే భారత జాతి విముక్తి కోసం ఉద్యమం, 14 ఏళ్లకే భారత స్వతంత్ర సంగ్రామంలోకి అడుగులేసి 23 ఏళ్లకే ఉరితాళ్లు ముద్దాడిన వేగుచుక్క అన్నారు. ధైర్యానికి దేశ భక్తికి ప్రతీకగా వీరత్వానికి మారుపేరుగా, నవతరానికి భగత్సింగ్ ఒక స్ఫూర్తిగా నిలిచాడని ఆయన పేర్కొన్నారు. సమాజ మార్పు కోసం ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శివ జిల్లా నాయకులు గోపి పవన్ నరేందర్ స్వాతి ప్రవళిక శిల్ప శిరీష. భవాని మాధవి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలపై బిఆర్ఎస్ ఫోకస్

విశాలాంధ్ర - తుంగతుర్తి : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో తిరుమలగిరి పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ తన నివాసంలో తుంగతుర్తి నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ మండల ముఖ్య నాయకులతో మాట్లాడినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఒక్క కార్యకర్త కష్టపడి పనిచేయాలని, గ్రామ స్థాయి నుండి ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలతో మమేకం కావాలని నాయకులకు సూచించారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ బలాన్ని మరింత పెంచేందుకు సమష్టిగా పనిచేసి, బీఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ అహర్నిశలు కృషి చేయాలని అన్నారు.

ఎస్ఐపై చర్యలకు ఆదేశం

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : నల్గొండ జిల్లా, దామరచర్ల మండలం, కొత్త తాండాకు చెందిన సాయి సిద్దుపై ఎస్సై శ్రీకాంత్ రెడ్డి అకారణంగా కులం పేరుతో దూషించి, కొట్టారన్న ఆరోపణలపై రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 9న యూరియా కోసం ధర్నా చేసిన సందర్భంలో ఎస్సై విచారణ పేరుతో సాయి సిద్దును పిలిపించి దుర్వినియోగం చేశారని కుటుంబం ఫిర్యాదు చేసింది. బాధితుడి ఇంటికి ఆదివారం వెళ్లి పరిస్థితిని పరిశీలించిన కమిషన్ చైర్మన్, ఎస్పీకి ఎస్సై శ్రీకాంత్ రెడ్డిని సస్పెండ్ చేయాలని ఆదేశించారు. వారు మాట్లాడుతూ ప్రజలను కాపాడాల్సిన పోలీసు అధికారులు ఇలా ప్రవర్తించడం తగదని, ఎవరైనా తప్పు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, కొట్టే అధికారం ఎవరికీ లేదని చెప్పారు. కులం పేరుతో తిట్టడం, థర్డ్ డిగ్రీ ప్రయోగించడం దారుణమని అన్నారు. సాయి సిద్ధు కుటుంబానికి ప్రభుత్వం వైద్య ఖర్చులు భరించాలని, ఒకరికి ఉద్యోగం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కూడా సూచించారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రితో కూడా మాట్లాడతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కమిషన్ సభ్యులు, జిల్లా అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

ర్యాబిస్ వ్యాధి ప్రాణాంతకం

విశాలాంధ్ర - పినపాక : కుక్క కరిచినా లేదా గొల్లతో గాట్లు పడ్డా ర్యాబిస్ వ్యాధి సోకే అవకాశాలు ఎక్కువ ఉన్నాయని ఇది ప్రాణాంతకమౌతుందని డాక్టర్ మధు, దుర్గా భవాని అన్నారు. ఈ వ్యాధి సోకిన వారు తక్షణమే వ్యాక్సిన్ వేయించుకోవాలని కోరారు. ఆదివారం పినపాక మండలంలోని ఇ.బయ్యారం క్రాస్‌రోడ్‌లో ప్రపంచ ర్యాబిష్ వ్యాధి దినోత్సవం సందర్భంగా వారు వైద్య సిబ్బందితో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. కుక్కలతో మనుషులకు ఎలాంటి ఘాట్లు పడ్డ సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి వ్యాక్సిన్ చేయించుకోవాలని కోరారు. లేకుంటే వ్యాధి సోకి ప్రాణాలు పోతాయని వైద్యులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్పీహెచ్ సుష్మా, రామరాజు, పవన్, ఆశా వర్కర్లు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దుబ్బగూడెంకు వెలుగుల పండుగ

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు మండలంలోని దుబ్బగూడెం గ్రామానికి మాజీ సర్పంచ్ ధారావత్ సరిత బాలాజీ నాయక్ బతుకమ్మ దసరా పండుగకు 85 ఎలక్ట్రికల్ దీపాలను దుబ్బగూడెం గ్రామానికి అందించి ఆ గ్రామంలో వెలుగుల పండుగ తెచ్చారు. పండుగ వాతావరణంలో ఆడపడుచులు, గ్రామస్తులు, చిన్నారులు, వృద్ధులు బతుకమ్మ పండుగ రోజున విద్యుత్ కాంతులతో ఘనంగా పండుగ వాతావరణం జరుపుకోవాలని మాజీ సర్పంచ్ ధారావత్ సరిత బాలాజీ నాయక్ ముందుకు వచ్చి ఆ గ్రామానికి దాతగా నిలిచారు. బతుకమ్మ దసరా పండుగకు అనేకం సమకూర్చారు. బతుకమ్మ పండుగను ఇంత ఘనంగా నిర్వహించడానికి సహకరించిన మాజీ సర్పంచ్ సరిత బాలాజీ నాయక్ కు గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తేజావత్ రవి, బానోతు రవి, నూనవత్ బిచ్చ, దారావత్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో గేదె మృతి

విశాలాంధ్ర - కారేపల్లి : విద్యుద్ఘాతంతో గేదె మృతి చెందిన ఘటన కారేపల్లి మండల పరిధిలోని విశ్వనాధపల్లిలో చోటు చేసుకుంది. విశ్వనాధపల్లికి చెందిన దొంతు దాసు తన పాడి గేదెను ఆదివారం మేతకు గ్రామ సమీపంలోని సుబాబుల్ తోటకు తీసుకెళ్లాడు. సుబాబుల్ తోటలో వ్యవసాయ బావులకు వెళ్లే విద్యుత్ లైన్ వైరు తెగి నేలపై పడి ఉంది. మేతకు వెళ్ళిన గేదె ఆ విద్యుత్ వైరు తాకి అక్కడికక్కడే మృతి చెందింది. గమనించిన రైతు దాసు వెంటనే గ్రామస్తులకు తెల్పటంతో ఆ లైన్ విద్యుత్‌ని నిలిపివేశారు. దీనికి సంబంధించి బాధిత రైతు విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చారు.

ఎక్సైజ్ ఎస్ఐగా సిరికొండ వాసి సతీష్

విశాలాంధ్ర - మోతె : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గ్రూప్ వన్ ఫలితాలలో ఎంపిడీఓ ఆదివారం వెలువడించిన గ్రూప్ టు ఫలితాల్లో ఎక్సేంజ్ ఎస్సైగా ఎంపికైన సిరికొండ గ్రామానికి చెందిన గుణగంటి సతీష్ సోమవారం వెల్లడించిన ఫలితాల్లో ఎక్సేంజ్ ఎస్ఐగా ఎంపిక అయినట్లు తెలిపారు. మొదటిగా గ్రూప్ 4లో ఉద్యోగం సాధించి ప్రస్తుతం సూర్యాపేట జిల్లా మున్సిపల్ ఆఫీసులో విధులు నిర్వహిస్తున్నారు అనంతరం గ్రూప్ టు క్వాలిఫై ప్రస్తుతం వెలువచ్చిన గ్రూప్ 2లో ఎక్సైజ్ ఎస్సైగా సెలెక్ట్ కావడం జరిగినది. నాకు సహకరించిన నా తల్లిదండ్రులు అన్నదమ్ములు నా తోటి మిత్రులుతో పాటు కుటుంబ సభ్యులకు స్నేహితులకు సహకారంతో ఉంటూ సమాజసేవకు కృషి చేస్తానని అన్నారు.

ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాల్సిందే

భద్రాచలం ధర్మయుద్ధం సభలో ఆదివాసీ వక్తలు

విశాలాంధ్ర - భద్రాచలం : 5వ షెడ్యూల్ భూభాగంలో నివసించే ఆదివాసీల కోసం రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఆదివాసి 9 తెగల ఐక్య కార్యచరణ కమిటీ సంఘాల రాష్ట్ర నేతలు డిమాండ్ చేశారు. ఆదివాసి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం భద్రాచలంలో ధర్మయుద్ధం బహిరంగ సభ పెద్ద ఎత్తున నిర్వహించారు. ఏజెన్సీ జిల్లా ఆయన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నలుమూలల నుంచి ఆదివాసీలు భారీ ఎత్తున ఈ సభకు తరలివచ్చారు. ఇందులో ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర అటవీ శాఖ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పోదెం వీరయ్య, మాజీ ఎమ్మెల్యే, ఆదిలాబాద్ జిల్లాకు చెందిన మాజీ ఎంపీ ఆదివాసి సంఘాల నాయకుడు సోయం బాబురావు, టిఆర్ఎస్ పార్టీ మాజీ డిప్యూటీ స్పీకర్, మాజీ ఎమ్మెల్యే రేగ కాంతారావు, మాజీ ట్రైకార్ సంస్థ చైర్మన్ తాటి వెంకటేశ్వర్లు, కొండ రెడ్ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మురళి రమేష్, ఆదివాసి సంక్షేమ సంఘం మహిళ రాష్ట్ర నాయకురాలు కుంజా రమాదేవి తదితర ముఖ్య నాయకులు పాల్గొని ఆదివాసీల హక్కుల కోసం విస్తృతంగా మాట్లాడారు. భారత రాజ్యాంగం 5వ షెడ్యూలు భూభాగంలో ఆదిమ జాతులు అయిన ఆదివాసీలకే రిజర్వేషన్లు కల్పించారని వక్తలు వెల్లడించారు. ఆదిమ ఎస్టీలకు మాత్రమే రిజర్వేషన్లను దక్కాలని రాజ్యాంగంలో స్పష్టంగా ఉన్నప్పటికీ తమ ఫలాలలో లంబాడీలు పెద్ద మొత్తంలో దక్కించుకుంటున్నారని ఆరోపిం చారు. 1976లో డిఎస్టి (ఒకసారి డినోటిఫై ట్రైబ్) గా గుర్తించబడ్డ లంబాడీలు విద్య, ఉపాధి, రాజకీయ రిజర్వేషన్లలో అధిక శాతం దక్కించుకుంటూ ఎస్టీలుగా చలామణి అవుతున్నారని ఆరోపించారు. తమ ఆదివాసి జాతుల రిజర్వేషన్లను మొత్తంగా అన్ని రంగాల్లో లంబాడి, సుగాలి, బంజారా సామాజిక వర్గ తెగలు చాలా వేగవంతంగా ఆక్రమిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసిల్లో ఉన్నత విద్యావంతులైన యువకులు, యువతులు తీవ్రమైన ఉపాధి ఉద్యోగ అవకాశాలు కోల్పోయి ఆర్థిక దుస్థితిలో తమ కుటుంబాలు గడవక నానా అవస్థలు ఎదుర్కొంటున్నట్లు వక్తలు వెల్లడించారు. ఐదవ షెడ్యూల్ భూభాగంలో రిజర్వేషన్లు పూర్తిస్థాయి హక్కుల కోసం పోరాటాలను ఉధృతం చేయబోతున్నట్లు సభాముఖంగా వక్తలు ప్రకటించారు. ఈ బహిరంగ సభలో ఆదివాసి యువ నాయకులు, న్యాయవాదులు, ఉద్యోగులు పాల్గొని మాట్లాడారు.

కరూర్ రోడ్‌షో లో మరణించిన వారి కుటుంబాలను ఆదుకోవాలి

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : తమిళనాడులోని కరూర్ ప్రాంతంలో టీవీకె పార్టీ చీఫ్, సినీ హీరో విజయ్ ప్రచార సభలో తొక్కిసలాట ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలను డియంకె ప్రభుత్వం ఆదుకోవా లని రాష్ట్ర మైనార్టీ నాయకులు కొత్తగూడెం ఉర్దూగర్ చైర్మన్ నయీమ్ ఖురేషి కోరారు. శనివారం జరిగిన ఈ రోడ్డు షో ఘటనలో చిన్నారులతో పాటు మహిళలు యువకులు మరణించడం చాలా బాధించిందన్నారు. ఆదివారం ఆయన ఒక ప్రకటనలో తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ మరణించిన వారికి సంతాపం తెలిపారు. విజయ్ కరూర్ రోడ్ షో కు నాలుగు గంటలు ఆలస్యంగా రావటంతో అధిక సంఖ్యలో అభిమానులు కదిలి రావడంతో తొక్కిసలాట జరిగిందన్నారు. ఈ ఘటనకు నటుడు విజయ్ పూర్తి బాధ్యత వహించి మృతి చెందిన ఒక్కో కుటుంబానికి రూ. కోటి అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

బధిరుల సమస్యలు పరిష్కరిస్తాం

విశాలాంధ్ర - కొత్తగూడెం : బధిరులు ఎదుర్కొంటున్న సమస్యలు, విద్యా, ఉపాధి ఉద్యోగాలలో న్యాయం జరిగేలా చూస్తామని జిల్లా సంక్షేమ అధికారిని స్వర్ణలత లేనిన హామీ ఇచ్చారు. అర్హులైన అందరికీ సహాయ ఉపకరణాలు అందిస్తామన్నారు. అంతర్జాతీయ సంజ్ఞా భాషా దినోత్సవ వేడుకలు ఐ.డి.ఓ.సి. కలెక్టరేట్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా హాజరైన స్వర్ణలత లేనిన కేక్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ సంకేత భాష పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం ఈ కార్యక్రమాన్ని ప్రతి సంవ త్సరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బధిరుల సమస్యలు ఏమున్నా తన దృష్టికి తీసుకొని వస్తే జిల్లా కలెక్టర్, వికలాంగుల, వయో వృద్ధుల సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు విన్నవించి పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా బధిరుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామలింగారెడ్డి మాట్లాడుతూ బధిరులు ఎక్కడికి వెళ్లినా సంకేత భాష విషయంలో తమ సమస్యను పక్క వారికి చెప్పుకోలేక బాధలు పడుతున్నారన్నారు. అధికారులందరికీ సైగల భాషపై అవగాహన కల్పించాలన్నారు. రవాణా శాఖ ద్వారా బధిరులకు డ్రైవింగ్ లైసెన్స్ మంజూరు చేపించాలని, కాంట్రాక్ట్, అవుట్సోర్సింగ్ ఉద్యోగాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర సంఘం అధ్యక్షుడు అనిల్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ప్రసాద్ కిషన్, ఖమ్మం జిల్లా ఆఫ్ డెఫ్ అధ్యక్షు డు వీరస్వామి, సెక్రటరీ మహేష్ కుమార్, ఇంతియాజ్ ఖాదర్, లక్ష్మీ ప్రసన్న ప్రియ, అనువాదకులు అంకిత, కార్యాలయ సిబ్బంది నరేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆదర్శంగా యువతరం ఉద్యమించాలి

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : యువకిశోరం షాహిద్ భగత్ సింగ్ ఆశయాల సాధన కోసం నేటి తనం యువకులు హక్కుల కోసం ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని జిల్లాలో జిల్లా వ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లో జరిగిన భగత్‌సింగ్ 118 జయంతి ఉత్సవాల్లో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. భగత్ సింగ్ జయంతి, వర్ధంతి ఉత్సవలను అధికారికంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమాల్లో భగత్‌సింగ్ జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో పొందపర్చాలని సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బానిస సంకెళ్ల విముక్తి కోసం 23 ఏళ్ల చిన్న వయసులోనే దేశం కోసం ఉరికొయ్యను ముద్దాడిన ధీరుడు భగత్ సింగ్ అన్నారు. భగత్ సింగ్ పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్ట్ అమలు కోసం పోరాటాలు చెయ్యాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా యువతరం తిరుగుబాటు చేయాలని పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఫహీమ్ దాదా, సహాయ కార్యదర్శి ఖయ్యూం, ఉపాధ్యక్షులు బరిగేల భూపేష్, రసూల్ పాషా, సల్మాన్, మణికంత, జావీద్, ఏఐఎస్ఎఫ్ నాయకులు గుండాల సృజన్, వినయ్, సంజయ్, రాజ్ కమల్, హర్మాన్, కళ్యాణ్, మహేష్, వరుణ్, నవీన్ పాల్గొన్నారు.

విజయవంతంగా మహా అన్నదానం

విశాలాంధ్ర - నేరేడుచర్ల : దేవీ నవరాత్రులలో భాగంగా నేరేడుచర్ల పట్టణంలోని రాంపురం వేంచేసియున్న కనకదుర్గ మాత ఆదివారం మహాచండీ అవతారంలో భక్తులను దర్శనమిచ్చారు. అనంతరం జరిగిన మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని స్థానిక ఎస్సై ఎ.రవీందర్ ప్రారంభించారు. అన్నదానంలో సుమారు 1500 మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కోట్లగడ్డ యూత్ కమిటీ సభ్యులు కొమరాజు శ్రీను, సరికొప్పుల నాగేశ్వరరావు, కొణతం నాగిరెడ్డి, రంగారెడ్డి, రాగిరెడ్డి వెంకటరెడ్డి, నూకల వెంకటరెడ్డి, కట్ట వెంకటరెడ్డి, కట్టా సత్యనారాయణ రెడ్డి, కట్ట చిన్న వెంకటరెడ్డి, షర్టు శంకర్, సైదులు, సుధీర్ రెడ్డి, కళింగ రెడ్డి, చిలక రాజు రవి, నాగయ్య, వంశీ, పాషా, కే సైదులు, గణేష్, షర్టు చందు, నరేందర్ మధు పాల్గొన్నారు.

సాహితి

మనిషితనపు అక్షరాలయ్యే కవిత్వం

డాక్టర్ కొత్వాలు అమరేంద్ర
సెల్: 9177732414

చీకటంత జీవితంలో వెన్నెలంత మనిషితనం... శిశిరమంత బతుకు మోడులో వసంతమంత మనిషితనం మనిషి జీవనానికి నగిషీలు చెక్కుతూ నిరంతర సూర్యోదయాలకు తెర తీస్తుంటుంది. మనిషితనం మనిషి పత్రానికి సౌందర్యాన్ని అద్దే ఒక చల్లని మంచు బిందువు... మనిషితనం మనిషి హృదయ ఉదయ తంత్రులపై మమతరాగాల్ని మీటే ఒక వెచ్చని సూర్యకిరణం. పూలరేకుల్లోంచి గుప్పుమనే పరిమళం ప్రపంచాన్ని మైమరపించినట్టు మనిషిలోంచి విప్పారే మనిషితనం హృదయసీమల తీరాల్ని ఆర్ద్రత అలలతో తడిచేస్తుంటుంది. మనిషితనం వున్నప్పుడే మనసులు ఆర్ద్రంగా మాట్లాడుకుంటాయి. పరస్పరం ఆత్మీయ సుగంధాల్ని వెదజల్లుకుంటాయి. ఎన్నెన్నో జీవన రాగాల్ని పలికిస్తుంటాయి. అవును... మనిషితనానికి మించిన మహత్తు ఏముంటుంది? జగత్తులో మనిషి పేరును సార్థకం చేస్తుంది. మనిషితనం తొలకరిలో మనం నాటుకునే ఆశయాల బీజాలు భవితవ్యపు మొలకలై, వృక్షాలై మనల్ని మురిపిస్తుంటాయి. మనిషితనం దీపమై వెలిగిపోతే అహం చీకట్లు తొలగిపోయి జీవితం మానవతాకిరణాలను తొడుక్కుంటుంది. జీవితం కాన్వాసుపై మనిషితనంకుంచె అద్భుత చిత్తరువులను సృష్టిస్తుంది. అది చిరుగాలిలా మబ్బుమదిని కరిగిస్తూ కరుణను కుండపోతగా కురిపిస్తుంటుంది.

ఇప్పుడు మనిషి తన మనిషితనాన్ని డిజిటల్ యంత్రాల్లో తాకట్టు పెట్టేస్తున్నాడు. భ్రమల ప్రవాహంలోకి జీవితాన్ని నెట్టేస్తున్నాడు. ప్రపంచ భ్రమలకు లోనౌతూ తన స్వరూపాన్ని కోల్పోతున్న మనిషితనాన్ని 'మంచుకొండలా చల్లగా వుండాల్సిన మనిషితనం/ఎందుకనో లావాలా జ్వలిస్తుంది/నేనెందుకనో గడ్డకట్టుకుపోతున్నాను' అని కవిత్వీకరిస్తుంది వర్తమాన కవయిత్రి బిట్ల అంజనాదేవి. అందుకే మాయమైపోతున్న మనిషితనం కోసం అక్షరాలతో తపస్సు చేస్తుంది కవిత్వం. మనిషి మనిషిలో మనిషితనాన్ని తట్టిలేపడానికి మనిషితనం తానే అయిపోవాలని ఉవ్విళ్లూరుతుంది.

'మొన్నగాక మొన్నటిరాత్రి/తెలతెలవారుతుండగా/తలుపుతట్టి
నా మనసువాకిలి తెరిచి/తూరుపుగాలిని నా గుండెల్లోకి

ఒంపించిందొక అత్మీయ వాక్యం
నాలో నిద్రిస్తున్న కలలను మేల్కొలిపి/నాలో గూడుకట్టుకున్న
సందేహాలను కూల్చేసి/నన్నొక సజీవ జలపాతంగా చేసింది
ఆకాశమంత కనికరపు ఆయుధాన్ని/నా దేహక్షేత్రం మీద నిలబెట్టి
కాలంతోపాటు పరుగెత్తే నమ్మకాన్ని/నన్ను సచేతనం చేసింది
చిక్కుముడుల నదుల్లో/నన్ను బందీచేసిన/చీకటి దారాలను నమిలేసి
నా బతుక్కొక భరోసా వాక్యమైంది
పచ్చని బతుకుచెట్టు కింద నన్ను గూర్చోబెట్టి
ప్రేమ, దయ, వాత్సల్యం పంచి
జీవన స్పర్శనది/అనుభవాల తడిని నాతో పంచుకుంది
పెదవులపై చెరగని చిరునవ్వులు పూయించి
చెమటపూల పరిమళాల విలువలు తెలిపింది
జీవితంలో ఎడతెగని యుద్ధం చేస్తూ
అనేక శాఖలుగా విడిపోయిన నన్ను
ఒక్కటి చేసి/దిద్దితీర్చి/నాతో తడితడిగా కరచాలనం చేసింది
నా కళ్లలో ఉబికే/కన్నీటి సముద్రాల్ని పూడ్చేసి
అభయాన్నిచ్చి జీవిత మూలాలను తెలియజెప్పి
కొత్త స్నేహపు జలాలతో/తన్మయ స్నానం చేయించింది
స్వచ్ఛమైన బీజాలను నాలోనాటి/ఆకుపచ్చ కాంతులు వెదజల్లుతూ
మళ్లీ రేపు కలుద్దామని చెప్పి/ జీవితపు పల్లవులు పాడుకుంటూ
అత్యంత నిర్మలంగా వెళ్లిన జ్ఞానవాక్యం/ఇంతవరకూ తిరిగిరాలేదు...
ఇప్పుడెక్కడుందో!/పెద్దనోట్లగాలికి చెల్లాచెదురైన
పెళ్లి పందిళ్లను పునర్నిర్మిస్తుందో
ఏ పెళ్లింటిలో వంట పనులకు సాయం చేస్తుందో!' (జ్ఞానవాక్యం)

అంటూ ఒక అద్భుతవాక్యం ద్వారా మనిషితనం మనిషిలో కలిగించే వివిధ పరిణామాల్ని, అతనిని తీర్చిదిద్దే విధానాన్నీ కవిత్వం చేస్తాడు వర్తమానకవి కొమ్మవరపు విల్సన్ రావు. మనిషి మనసులోకి తూర్పు గాలిలా ప్రవేశించే పవనం మనసును జీవం తొణికిసలాడే ప్రవాహంగా మార్చడాన్నీ, వాత్సల్యం, నమ్మకాలతో మనసును నింపి దానిని చైతన్యవంతం చేయడాన్నీ, కఠినత్వపు ముడులను తెంచుతూ, కష్టాల ప్రవాహం నుంచి విముక్తి కలిగిస్తూ అది మనిషితనమై, బతుకు ధైర్యమై నిలవడాన్నీ ఇక్కడ అక్షరబద్ధం చేసింది కవిత్వం. ప్రేమ, దయ కలబోసిన ఆత్మీయ పచ్చదనాల నీడలో తడిగాతడిగా అనుభూతించే అనుభవాల్నీ, శ్రమజీవన సౌందర్యంలో ఆనందపు పరిమళాల్నీ మనిషికి అందిస్తుంది మనిషితనం. నిరంతర జీవన సమరంలో రోజురోజుకూ ముక్కలైపోతున్నా ఆ ముక్కల్ని మళ్లీ ఒక్కటి చేసి హృదయతంత్రులపై ఐక్యతారాగాల్ని వినిపిస్తుంది. అది అభయదాతయై కన్నీటి అలలతో వుప్పొంగే హృదయాలను జీవిత మూలాల్లోకి తీసుకెళ్లి సరికొత్త స్నేహ ప్రవాహంతో ఒలలాడిస్తుంది. ప్రపంచాన్ని సమ్మోహనపరిచే పచ్చదనాల కాంతులు వెదజల్లే ఆలోచనల బీజాలను మనిషిలో నాటే మహత్తర గుణం దానిది. అలాంటి మనిషి జీవనసమరంలో అప్రమత్తత కోల్పోయినప్పుడు అలాంటి అసలైన మంచితనం మాయమై మరో రకంగా రూపాంతరం చెంది మనిషి మనుగడలో భాగంగా అతని దిన చర్యలోనూ భాగమైపోతుంది. అది బాహ్యప్రపంచ ఆర్థిక వ్యవహారాల్లో మనిషిని మరో పార్శ్వానికి తీసుకెళ్లడం, ఆ పార్శ్వంలో మనిషి దాని వ్యామోహంలో పడి ఆకలిదప్పుల్ని కూడా మరవడం, అసలైన మనిషితనం కోసం మళ్లీ వెతుకులాటలో పడడం ఇక్కడ కవిత్వమైంది.

'మహాసముద్రాలూ, మహాపర్వతాల్లా కొందరంతే
కాలంగడిచేకొద్దీ, పాతబడేకొద్దీ
విలువలు పెంచుకుంటూ వుంటారు/కొన్ని దేశాలు కూడా అంతే
సెల్ ఫోన్లు, ఫేస్ బుక్కులు, ఫోర్ జీలు
ఎన్నెన్ని మార్పులు వచ్చినా...
ఎంతగా సమ్మోహనపరిచినా వాళ్లంతే
యంత్రాలతో కాక మనుషులతోనే బతకాలంటారు
యంత్రాలు, సాంకేతికాలు కాక... మనుషులే ముఖ్యం అంటారు...
ఇప్పుడు మనిషిని గుర్తించడం చాలాసులభం
సమూహంలో వున్నా, సంచారిగా వున్నా
ఏకాంతంగా వున్నా, ఒక పుస్తకంతోనో, కాసిన్ని పూలతోనో
లేదా నలుగురు మనుషులతోనో..
లేదా పిల్లలతో కలిసి నవ్వేవాడినో, ఏడ్చేవాడినో మనిషని అంటారు...
మనుషులు నిరంతరం నిర్భీతిగా, నిర్మలంగా
మాట్లాడుకోవడాన్నే జీవితం అంటారు.
మాటలు వస్తువులు, సరుకులు కావు/మాట్లాడుకోవడం అంటే
సంపాదనలు, ఆదాయాలు లెక్కలేసుకోవడంకాదు
మాట్లాడుతూ వుండడం అంటే
ఒకరితో ఒకరు లేదా ఒకరి కోసం ఒకరు
స్నేహంగానో, నామమాత్ర పరిచయంగానో
ప్రేమగానో, నమ్మకంగానో, విశ్వాసంతోనో,
భూమిపొరల్లో దాగిన చెమ్మలానో బతకాలనుకోవడం....
ఏ మనిషైనా, ఏకాలంలో అయినా
సజీవ మానవత్వమే, మనిషితనమే ముఖ్యం
మనిషి లోపలి శిశువును కాపాడుకోవడమే జీవితం.
పువ్వులు, పిట్టల స్నేహాల్లా, నదుల జాతరల్లా
ప్రతిరోజూ స్పృహ, స్ఫూర్తి, సృజనతో బతకడమే ముఖ్యం
చిగురించే మనుషులే/దేశ నిర్మాతలు
కొత్త పాటలు, కొత్తకొత్త పాఠాలు నేర్చుకోవాల్సిందే...
ఒక నిర్మలత్వమో, మానవీయతో లేకుండా
ఆదరించి ప్రేమించే మనిషి లేకుండా
లోకంలో ఏ ఒక్కడూ యేపొద్దూ బతకలేడని
మనిషి చరిత్ర చెబుతోంది
ఇప్పుడు దేశాన్ని నిర్మించుకోవడం అంటే
నిఖార్సైన మానవుడ్ని నిర్మించుకోవడమే' (పురాతన మానవుడు)

అంటూ ప్రపంచీకరణ పెనుభూతం ఎన్నెన్ని విఘాతాలు సృష్టిస్తున్నా ఇంకా ఇంకా మనిషితనపు మాధుర్యాన్ని కాపుగాసే పురాతన మనుషుల మనో సౌందర్యాన్ని ఆవిష్కరిస్తుంది వర్తమానకవి పలమనేరు బాలాజీ కలం. విలువల్ని చాటుతూ బెదరని, చెదరని ఆ మనుషుల్ని మహాసముద్రాలుగా, మహాపర్వతాలుగా అభివర్ణిస్తుంది కవిత్వం. మనిషిని సమ్మోహనపరిచే అసలైన ఆర్ద్రానుభూతుల్ని వివరిస్తుంది. అక్షరాల్ని అవలోకిస్తూ, పూల పరిమళాల్ని ఆఘ్రాణిస్తూ పసిపిల్లల కేరింతలతో హృదయాల్ని అనుసంధానం చేస్తూ నిర్భయంగా, నిశ్చలంగా మాట్లాడుకునే మనిషితనాన్ని అక్షరీకరిస్తుంది. ఆర్థిక వ్యవహారాల చిక్కుముడులలో పెనవేసుకోకుండా, మార్కెట్ మాయాజాలంలో పడకుండా ఆర్ద్రత ఇంద్రజాలంలో మాటల్ని నింపుకోవడం, నమ్మకాల, విశ్వాసాల కొలమానాలతో బతుకు త్రాసును కొలుచుకుంటూ భూమి పొరల తడిలాంటి మమకారంతో జీవించడం మనిషితనం అంటుంది. సర్వ కాలావస్థల్లోనూ మానవత్వమే మనిషిని కాపాడే ఔషధమంటుంది.

మనిషి లోపలి శిశువు లాంటి సున్నితమైన, అపురూపమైన మనిషితనాన్ని ఎలా కాపాడుకోవాలో చెబుతుంది. పూలసరాగాల, పిట్టల కిలకిలారావాల స్నేహ సరిగమలను హృదయ తంత్రుల నిండా నింపుకోవడంలో మనిషితనాన్ని దర్శిస్తుంది. ఆశయాల చిగుళ్లతో అంకురించే మనిషితనం దేశపు చీకటి పొరల్రోలే ఏలిక వెలుగవుతుందని, ఒక ప్రశాంత మానవీయ స్పర్శ మనిషికీ మనిషికీ మధ్య మనిషితనపు వంతెనై బతుకులు విరాజిల్లుతాయని, మనిషిలో నిలువెల్లా ప్రవహించే మనిషితనం ఈ దేశపు అస్తిత్వపు వెల్లువవుతుందని కవిత్వం విడమరచి చెబుతుంది.

'మనిషి లోలోపల చుట్టుకునే పలవరింత/గాయమైన చోటే పూచేపువ్వు' అంటూ మనిషితనం మహత్యాన్ని వివరిస్తాడు వర్తమానకవి పాణి.'మానవత్వం మర్చినోళ్లకాడ/ పీనుగ కంపు తప్ప ప్రాణం వాసన గొడ్డం లేదు' అంటూ ఆవాల శారద మనిషితనం లేని మనిషిని జీవంలేని శవంతో పోలుస్తూ మనిషితనాన్ని అసలైన ప్రాణం వాసనగా అభివర్ణిస్తుంది. అందుకే మానవ జగత్తు మనుగడకు మనిషితనం అవుతుంది మూలాధారం. అదే మనిషితనపు కవిత్వసారం.

వీధి మానుషి

ఉదయం
కిటికీలోంచి కిరణ కరచాలనం
చేసిన సూర్యుడు

సాయంత్రం
మళ్లీ కిటికీ దగ్గరికి వచ్చి
పీల గొంతుతో పలకరిస్తున్నాడు

ఉదయం
బంగారు లేత కాంతి వర్ణంలో
మెరిసిపోతూ కుండీలోని మొక్క
అప్పుడే కొమ్మకు పూచిన తాజా పువ్వులా

సాయంత్రం
అలసిపోయి స్కూల్ నుంచి వచ్చిన
మా మనుమరాలి ముఖంలా
నేల చూపులు చూస్తూ సోలిపోతుంది

రాత్రి

చిక్కని చీకట్లో
చుక్కలు వచ్చి చెక్కిలిగింతలు పెడతాయి

సగం ముక్క కోసిన చంద్రుడు
రాత్రి ఎదురు కాల్పుల్లో గాయానికి
చల్లని వెన్నెల కట్టు కట్టిపోతుంది

కిటికీలోంచి దృశ్యాదృశ్యాలు చూస్తూ నేను
వీధి అంతా నా లోలోన కలవరపెడుతుంది

జూకంటి జగన్నాథం, 94410 78095

గాయాల ఓరిమి...

భరింపు పొరలు చుట్టేశాక
కొన్ని కన్నీళ్లు
ఎన్నెన్నో గాయాలు
బాహ్యానికి కనబడవు
అనుభవపు శిలలు
గుండెను రక్కేస్తుంటే
కొవ్వొత్తిలా కరిగి
తనువు దహనమవుతుంటే
శూన్య శిఖరం అంతెత్తున ఎదిగి
చూపుల దిక్కుల నిండా
చీకటిని పరిచేసింది
హృదయం
ఎంతో పదిలమని
పగిలితే అతికింపులతో

పాతరూపు తిరిగి రానేరాదని
గాయానికి ప్రేరకమైన
కారణానికేం తెలుసు...?
ఆత్మానుభూతుల్ని
అనుబంధ స్వరూపాల్ని
తనలోకి ఒంపుకొని
పరితపించే తనువుపై
విఘాతాల విలయ చారికలు

అనుక్షణం దైన్యపు దయనీయతలు
పల్లేరు ముళ్లపై
పాదమేయక తప్పని స్థితిలో
చివరకు మిగిలేది
ప్రపంచానికి పంచేది
గాయాల ఓరిమే...!

డా. తిరునగరి శ్రీనివాస్,
9441464764

ఆధునిక తరాన్ని స్పర్శిస్తూ... వర్షించే చందలూరి కవిత్వం!

ఫిజిక్స్ అరుణ్ కుమార్
93947 49536

గ్రంథ సమీక్ష

"సుమారుగా ప్రతిరోజు ఏదో సమస్యను, సందర్భాన్ని ప్రేమిస్తూ నా అక్షరం నన్ను ఖాళీగా ఉంచదు. నా గుండె గూటిలో రాత్రింబవళ్లు ఏదో చప్పుడు చేస్తూనే ఉంటుంది. నా మునివేళ్ళు కవాతు చేస్తూనే ఉంటాయి. ఏ పనిలో ఉన్నా ప్రతిక్షణం ఏదో ఓ భావం కవితాకృతి పొందాలనే చూస్తుంది. ఓ తప్పకంలా మారిన ఆలోచన వ్యసనమై పదునైన వాక్యం కోసం వెంటపడుతూనే ఉంటుందంటూ 'ఇంట్రో...' ఆరంభంలోనే తన జీవిత కవిత్వ గాథతలో పాఠకుల్ని ముంచేస్తారు చందలూరి నారాయణరావు. 30 ఏళ్ల సాహిత్య ప్రయాణం ఇలాంటిదే మరి. అందుకేనేమో ఆయన అక్షరాలు మనకు సాహితీ పత్రికల్లో కనిపిస్తూ మనలోని కవిత్వాన్ని కవిత్వీకరించేలా చేస్తుంటాయి.

కాలం చేస్తున్న ఆధునిక సాంకేతిక సంతకాల కవితా గగనంలో నవతరపు రాతలను గమనిస్తూనే ఉంటారు రచయిత. అందుకే చిక్కదనంతో బాటు,చిన్నచిన్న పదాలతోనే విభిన్నతకు జీవం పోస్తుంటారు.

'ప్రపంచమొక పద్మవ్యూహం కవిత్వమొక తీరని దాహం' అన్న మహాకవి శ్రీశ్రీ అక్షరాగ్ని శిఖరాలకు చందలూరి 'ఏకాంత స్పర్శ' కవిత్వం ఓ నిదర్శనం. ఏ రంగు, రుచి, వాసన లేకుండా పెంచుకున్న ఆయన అక్షరం ఆయన మనసు విలువను నిక్కచ్చిగా నిజాలతో తూచి మనల్ని చదివించి మనతో వినిపించాలనేదే రచయిత తాపత్రయం.

కాలం చర్మం ఒలిచి
కాగితంపై తరాలని తవ్వి
కుప్పలుగా పోసి
గాజు కళ్ల చేసిన సంతకంలో...
చిరునామాతో పనిలేని
అవసరంతో నిమిత్తం లేని
రోజు రాయబడే ఉత్తరమే అమ్మంటూ,
పాఠకలోకానికి అమ్మ ప్రేమను చూపిస్తున్నారు.

అమ్మకు అక్షరాభిషేకం చేస్తున్నారు. కాలం ఎన్నో ప్రశ్నలను సంధిస్తూ శిక్షలను ప్రేమించే విధంగా చేస్తుందంటూ, జవాబులు ఒప్పుకోకుండా తానూ జవాబు చెప్పకుండా కాలం తప్పించుకొని తిరుగుతుందంటారు ఇంకో కవితలో..!

గతంలోకి ఓ దారి పొడుగునా వెళుతూ వెళుతూ ఆనాటి జ్ఞాపకాలను నెమరేసుకుంటూ..

నేటి ప్రపంచంలో అప్పటి మనుషులు లేరు
అప్పటి గొంతుకలు వినిపించడం లేదు
అసలు అప్పటి రూపమే లేదంటూ

'ఖాళీ స్థలంలో' వేల జ్ఞాపకాల కొలనులో తలుపులు,గోడలు,కప్పు, ఆకారాలను వెతుకుతుంటారు. రోజూ కురిసే చీకటిలో కాసేపు తన పడక వీధిలో పరిగెత్తే ఆలోచనల అక్షరాలను తడిపి 'నిద్రపూవు' ను కానుకగా ఇస్తారు.

నిద్ర ఓ ఆనంద నౌకగా, ఓ అఖండ తేజంగా, తాజాదనపు అదృష్టంగా అభివర్ణిస్తారు.

నీవు నీ నుండి విడిపోయినా సరే
నీతో కలిసి చేసే ప్రయాణమే ఏకాంతమంటూ,

మనిషెత్తు తపనను పారించి పదునెక్కిన మనసుతో బతుకును జీవితంగా ఆవిష్కరిస్తారు. ఆమెను చేరాలన్న ఓ నిజంలో తెలియని ఊహా ప్రపంచంలో ఊపిరి ఉంటుందో లేదో కూడా తెలియకుండా 'ఆమె' ఆలోచన



సంద్రంలోనే అన్వేషిస్తుంటారు.

నారాయణరావు గుండెల నిండా శ్రీ శ్రీ రూపం దాగుంది. పదునెక్కిన కవిత్వం రాస్తున్నప్పుడు ఆయన గుండె శబ్దాలు లబ్ డబ్ బదులు 'శ్రీశ్రీ' అనే కొట్టుకుంటాయి. అందుకే గుండెలో రక్తాన్ని ఊగించే ఆవేశంతో...

శ్రీశ్రీ కవితే/తెలుగు వెలుగులల్లిన అగ్రస్థానం.
ఆ కవిదే తెలుగు వారిలో
సాగుతున్న మహాప్రస్థాన మంటారు.
దేశం దేహంపై/పదవి పెదవి గాట్లతో
రాజకీయం నగ్నంగా
సిగ్గును తాకట్టు పెట్టి
అధికారం సాధించుకున్నదని ఆందోళన పడుతుంటారు.
లోకంలో ఎక్కడా దొరకని పరిజ్ఞానం
ఏ చదువు చెప్పని విజ్ఞానం
నాయనమ్మ చెప్పే కబుర్ల
గుబుర్లో దాగి ఉందంటూ,
తాతయ్య చేతి కర్ర చెప్పే
కథలను కవిత్వంగా అందించారు.

నాకూ ఓ కవిగా... వ్యక్తిగతంగా జీవన తత్వాన్ని బతుకు సూత్రాన్ని కవిత్వంగా చెప్పడం చాలా ఇష్టం. అలాంటి తాత్విక బోధనలు చాలానే ఉన్నాయి ఈ పుస్తకంలో...!

ఇంతేనా? అని ప్రశ్నిస్తూనే... ఇంతగా చదివిన ఇన్నాళ్లకు గానీ జీవితానికి తెలియలేదు లోకమనే పుస్తకాన్ని చదివి పరీక్ష రాయాలని...

విధి ఫలితాల్లో ఓటమిని చదువుకుంటూ మధ్య మధ్యలో గెలుపు బరువుగా మోయడం ఉంటుందని చమత్కరిస్తారు. మన మనసాకాశంలో వెన్నెల చీకట్లను తరిమేసి ఊహలతో కలను పుట్టించి తీరకుండా తీపిని చేదుగా చేస్తుంటారు. మనిషినే దేవుడికి బహుమతిని చేస్తారు.

రేపటి స్మశానానికి
బతుకుల్ని పునాదులు చేసి
కన్నీటిని రంగులుగా పులిమే
విషాదమే నేటి రాజకీయమంటారు.

కమిలిన విలువలతో గుటకలు వేసే నేటి సంతోషపు చిరునామాను చూపించారు. పుట్టుకతోనే పాడె మోస్తూ భూమికి బరువైన కన్నీటి బొట్టు అతడంటూ రైతు జీవన చిత్రాన్ని ఆవిష్కరిస్తూ, ఎప్పటికైనా లోకం అతని కళ్లను తలచుకొని భారీ మూల్యానికి సిద్ధం కాక తప్పదంటూ హెచ్చరిస్తారు.

ప్రతి మనిషి జీవితంలో బాల్యం విలువను తెలియజేస్తూ అద్భుతమైన కవిత రాశారు చందలూరి.

నోటి నిండా తీయని పలుకుల్ని
కళ్లనిండా మెరుపుల కాంతుల్ని
ముఖంలో ఆనందపు గెంతుల్ని
చురుకుదనం పంచే చైతన్యాన్ని
చెబుతూనే ప్రతి మనిషి మొదట కుబేరుడే అంటారు.

మనం కాసేపు మాట్లాడుకుందామంటూ మొదటిసారి పలకరించారు. మనిషి గుర్తుల్ని బతికించుకుందామంటూ రెండోసారి మనలోని మానవీయకోణాన్ని మేల్కొలిపి బతుకు పాఠాన్ని చెప్పారు. ఇప్పుడు ఏకాంత స్పర్శతో మళ్లీ మన మెదడులోకి మన గుండెలోకి మనకు తెలియకుండానే చేరిపోతున్నారు. చందలూరి కవిత్వంలో మనిషితనాన్ని ఆకర్షించే లక్షణం ఉంది. మానవతను ప్రబోధించే విప్లవ గుణం ఉంది. బడుగు బలహీన వర్గాల గొంతుకై ప్రశ్నించే తపన ఉంది. ఇలా ఇంతసేపు చెప్పుకుంటూ వెళ్లినా...ఆయన అక్షరాల్లో మనందరికీ దొరకని ఓ మ్యాజిక్ ఉంది ఓ లాజిక్ ఉంది. ఇక ఆలస్యం చేయకుండా ఆయన ఏకాంత స్పర్శతో కరచాలనం చేస్తూ, ఇంకా ఎన్నో పుస్తకాల రూపంలో వారి అక్షరాలను మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తూ అభినందనలు తెలుపుదాం.

హృదయ విదారకం

కరూర్ తొక్కిసలాట ఘటనలో 40కి చేరిన మృతులు

10 మంది మైనర్లు, రెండేళ్ల చిన్నారి

67 మందికి గాయాలు: తమిళనాడు ఆరోగ్య కార్యదర్శి

చెన్నై/కరూర్: తమిళనాడులోని కరూర్‌లో తమిళత వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు, నటుడు విజయ్ ర్యాలీలో శనివారం జరిగిన తొక్కిసలాట మృతుల సంఖ్య 40కి పెరిగింది. ఆదివారం తమిళనాడు ఆరోగ్య కార్యదర్శి పి.సెంథిల్

కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో ఒక వ్యక్తి గాయాలతో మరణించిన తర్వాత మృతుల సంఖ్య 40కి పెరిగిందన్నారు. 39 మంది మరణించారని, 67 మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. ప్రభుత్వాస్పత్రి వద్ద రోగులను సందర్శించిన తర్వాత ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'ఈ దురదృష్టకర సంఘటనలో 39 మరణాలు సంభవించాయి. 17 మంది మహిళలు, 13 మంది పురుషులు, నలుగురు బాలురు, ఐదుగురు బాలికలు ఉన్నారు. 30 మృతదేహాలకు పోస్ట్‌మార్టం నిర్వహించాం. మృతదేహాలను వారి కుటుంబాలకు అప్పగించడం జరిగింది' అని తెలిపారు. 26 మందికి ఆస్పత్రిలో చికిత్స అందించి డిశ్చార్జ్ చేశారని ఆయన చెప్పారు. ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్న 67 మందిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందన్నారు. మిగిలిన వారి ఆరోగ్యం నిలకడగా ఉందని, రోగులలో ఒకరిని తదుపరి చికిత్స కోసం మధురై ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఆయన వివరించారు.

ఒకే గ్రామానికి చెందిన ఐదుగురి మృతి

శనివారం వేలుసామిపురంలో టీవీకే అధ్యక్షుడు, నటుడు విజయ్ ర్యాలీ సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో కరూర్‌లోని ఎమూర్ పుత్తూరు గ్రామం ఐదుగురు నివాసితులను కోల్పోయింది. సమావేశానికి హాజరు కావడానికి దాదాపు 50 మంది గ్రామస్తులు కలిసి వెళ్లారు. మృతుల్లో వివిధ కుటుంబాలకు చెందిన సభ్యులు ఉన్నారు. చిన్న వ్యాపారం నడుపుతున్న శక్తివేల్ ర్యాలీకి హాజరుకాలేదు. కానీ ఈ విషాదంలో తన భార్య, కుమార్తె ఇద్దరినీ కోల్పోయాడు. గృహిణి అయిన అతని భార్య ఎస్.ప్రియదర్శిని (35), వారి కుమార్తె 9వ తరగతి విద్యార్థి ఎస్.ధరణిక (14) నటుడిని చూడటానికి వెళ్లినప్పుడు జనసమ్మర్దంలో చిక్కుకుని మరణించారు. అలాగే, ఈమూర్ పుత్తూరు నివాసితులు కూడా ముగ్గురు మరణించారు. ర్యాలీకి తన కుటుంబాన్ని తీసుకెళ్లిన వ్యవసాయ కూలీ పన్నీర్‌సెల్వం, జనసమూహంలో విడిపోయిన తర్వాత తన 10 ఏళ్ల కుమారుడు పి.పృథిక్‌ను కోల్పోయాడు. వేర్వేరు కుటుంబాలకు చెందిన వ్యవసాయ కూలీలు కె.అరుక్కాని (60), ఎస్.చంద్ర (40) కూడా బాధితుల్లో ఉన్నారు. విజయ్ ర్యాలీలో జరిగిన తొక్కిసలాటలో బాధితులైన 39 మందిలో రెండేళ్ల చిన్నారితో సహా కనీసం 10 మంది మైనర్లు ఉన్నారు. వారిలో చాలామంది మహిళలు, బాధితుల్లో ఎక్కువ మంది 20, 30 ఏళ్ల లోపు వారేనని ఆంగ్ల వార్తా సంస్థ ఒకటి పేర్కొంది. ఒక తండ్రి తన బిడ్డను చేతుల్లో పట్టుకుని ఆసుపత్రిలో సహాయం కోసం వేడుకుంటున్న హృదయ విదారక దృశ్యాలు, వైద్యులు మరణించినట్లు ప్రకటించిన తర్వాత తన బిడ్డను విడిచిపెట్టడానికి నిరాకరించిన తల్లి దృశ్యాలు సోషల్ మీడియాలో ప్రసారం అవుతున్నాయి. నిన్న జరిగిన తొక్కిసలాటలో టీవీకే రంగులతో తలపై చుట్టుకున్న రెండేళ్ల దురు విష్ణు తన తల్లిదండ్రులతో కలిసి కరూర్ ర్యాలీలో ఉన్నాడు. తమిళనాడు, దేశాన్ని కుదిపేసిన విషాదంలో ఆ పసిబిడ్డ అతి పిన్న వయస్కుడు.

విద్యుత్ కోత లేదు: విద్యుత్ బోర్డు అధికారి

కరూర్‌లో విజయ్ ప్రసంగిస్తున్న సమయంలో విద్యుత్ కోత లేదని తమిళనాడు విద్యుత్ బోర్డు అధికారి ఒకరు తెలిపారు. 'నిరంతర విద్యుత్ సరఫరా అందించబడింది' అని ఆయన అన్నారు. 'విజయ్ రాకముందే ఇంటి పైకప్పులు, చెట్లపై ఉన్న ప్రజలకు ప్రమాదం జరగకుండా ఉండేందుకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. కానీ దానిని వెంటనే పునరుద్ధరించారు' అని ఆయన తెలిపారు.

పరిహారం ప్రకటించిన మోదీ, స్టాలిన్

తొక్కిసలాట ఘటనలో మరణించిన వారి కుటుంబాలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పీఎంఎన్ఆర్ఎఫ్ నుంచి రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియాను ప్రకటించారు. గాయపడిన వారికి రూ.50 వేలు ఇవ్వడం జరుగుతుందని ఆయన సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' పోస్ట్‌లో ప్రకటించారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ తొక్కిసలాటలో మరణించిన వారి కుటుంబాలకు రూ.10 లక్షలు, గాయపడిన వారికి లక్ష రూపాయల చొప్పున పరిహారం ప్రకటించారు.

దర్యాప్తు కమిషన్ ఏర్పాటు: స్టాలిన్

తొక్కిసలాటకు దారితీసిన పరిస్థితులపై దర్యాప్తు చేయడానికి రిటైర్డ్ జడ్జి అరుణ జగదీశన్ నేతృత్వంలో కమిషన్‌ను తమిళనాడు ప్రభుత్వం ప్రకటించినట్లు సీఎం స్టాలిన్ తెలిపారు. కరూర్ తొక్కిసలాట ఘటనపై విచారణ కమిషన్ దర్యాప్తు ప్రారంభించినట్లు ఉదయనిధి స్టాలిన్ తెలిపారు. ప్యానెల్ సమర్పించిన నివేదిక ఆధారంగా ముఖ్యమంత్రి ఎం కె స్టాలిన్ తగిన చర్యలు తీసుకుంటారని ఆయన అన్నారు. తన విదేశీ పర్యటనను ముగించుకున్న ఉదయనిధి, మృతులకు నివాళులర్పించి, ఇక్కడి ఆసుపత్రిలో గాయపడిన వారిని పరామర్శించారు. ఆరోగ్య మంత్రి మా సుబ్రమణియన్ సహా మంత్రివర్గ సహచరులు ఆయనతో పాటు ఉన్నారు.

ఉదయనిధి స్టాలిన్ విలేకరులతో మాట్లాడుతూ గాయపడిన వారికి చికిత్స చేయడానికి పొరుగు జిల్లాల నుండి 345 మందికి పైగా వైద్యులు, నర్సులను నియమించినట్లు చెప్పారు. విషాదం పట్ల విచారం వ్యక్తం చేస్తూ, ప్రభుత్వం బాధితులకు పూర్తి మద్దతు ఇస్తుందని ఆయన అన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కాగా, టీవీకే ర్యాలీ తొక్కిసలాట ఘటనలో 40 మంది ప్రాణాలు కోల్పోవడంతో విజయ్ ఇంటి బయట డీఎంకే విద్యార్థి సంఘాలు నిరసనలు చేపట్టాయి.

విజయ్ రూ.20 లక్షల పరిహారం

తన పార్టీ ర్యాలీలో జరిగిన తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు టీవీకే అధ్యక్షుడు విజయ్ ఆదివారం రూ.20 లక్షల చొప్పున ఆర్థిక సహాయం ప్రకటించారు. గాయపడిన వారికి రూ.2 లక్షలు అందిస్తామని ఆయన చెప్పారు. 30 మందికి పైగా ప్రాణాలు కోల్పోయి, అనేక మంది గాయపడిన ఈ సంఘటన పట్ల తాను తీవ్ర విచారం వ్యక్తం చేశానని నటుడు-రాజకీయ నాయకుడు ఆదివారం సోషల్ మీడియా పోస్ట్‌లో పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు తన సంతాపాన్ని తెలియజేస్తూ... 'మీరు అనుభవించిన నష్టానికి ఇది పెద్ద మొత్తం కాదు. మీ నష్టం భర్తీ చేయలేనిదని నాకు తెలుసు. అయితే ఈ సమయంలో మీ పక్కన నిలబడి మీ దుఃఖాన్ని పంచుకోవడం నా కర్తవ్యం' అని అన్నారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని తాను ప్రార్థిస్తానని, ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న వారికి తన పార్టీ సిబ్బంది అన్ని విధాలుగా సహాయం అందిస్తారని ఆయన హామీ ఇచ్చారు. కరూర్‌లో జరిగిన సంఘటన ఊహకు అందనిది అని, తాను అనుభవిస్తున్న బాధను వర్ణించలేకపోతున్నానని విజయ్ అన్నారు. 'నా కళ్లు, మనస్సు దుఃఖంతో నిండిపోయి ఉన్నాయి. ర్యాలీలో నేను కలిసిన వ్యక్తుల ముఖాలు అప్పటి నుంచి నా మనస్సులో మెదులుతున్నాయి' అని తెలిపారు.

అత్యంత బాధాకరం

తొక్కిసలాటపై కమల్, రజనీ, చిరు

చెన్నై: తమిళనాడు కరూర్‌లో సినీ నటుడు విజయ్ రాజకీయ ప్రచార ర్యాలీలో జరిగిన తొక్కిసలాటపై సినీ నటులు రజనీకాంత్, కమల్‌హాసన్ స్పందించారు. 'కరూర్‌లో ఇంతమంది చనిపోయారని తెలిశాక నా గుండె వణికిపోయింది. అక్కడి నుండి వస్తున్న వార్తలు తెలుసుకుంటుంటే షాక్ అవుతున్నాను. అవన్నీ నాలో దుఃఖాన్ని కలిగిస్తున్నాయి. తొక్కిసలాటలో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయిన అమాయక ప్రజలకు సానుభూతి చెప్పేందుకు కూడా మాటలు రావడం లేదు. గాయాలతో చికిత్స పొందుతున్న వారికి సరైన సహాయం అందేలా ప్రభుత్వమే చూడాలి. మరణించిన వారి కుటుంబ సభ్యులను తమిళనాడు ప్రభుత్వం ఆదుకోవాలి' అని రాజ్యసభ సభ్యులు, నటుడు కమల్ హాసన్ కోరారు. రజనీకాంత్ స్పందిస్తూ 'కరూర్ సంఘటనలో చాలామంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ వార్త నా హృదయాన్ని కలచివేసింది. నాకు తీవ్ర దుఃఖం కలిగిస్తోంది. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి.

గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నాను. ఇలాంటి సమయంలో భగవంతుడు అండగా నిలివాలని కోరుతున్నాను' అని పేర్కొన్నారు. సినీనటుడు మెగాస్టార్ చిరంజీవి స్పందిస్తూ 'ర్యాలీలో జరిగిన విషాదకరమైన తొక్కిసలాట నన్ను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఎవరూ భర్తీ చేయలేని నష్టాన్ని అనుభవిస్తున్న ఆ కుటుంబాలకు నా హృదయపూర్వక సానుభూతి. ఈ క్లిష్ట సమయంలో వారికి బలం చేకూరాలని కోరుకుంటున్నాను. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను' అని తెలిపారు.

కఠిన నిబంధనలు అవసరం

కరూర్ తొక్కిసలాటపై శశి థరూర్

తిరువనంతపురం: తమిళనాడులోని కరూర్‌లో జరిగిన తొక్కిసలాటపై కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ విచారం వ్యక్తం చేశారు. కేరళలోని తిరువనంతపురంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ 'ఇది చాలా విషాదకర పరిస్థితి. మన దేశంలో జనసమూహ నిర్వహణలో ఏదో లోపం ఉంది. ఏటా ఇలాంటి ఏదో ఒక ఘటన జరుగుతున్నట్లు అనిపిస్తోంది. ఇదే సమయంలో బెంగళూరు ఘటన గుర్తుకువస్తోంది. ఈ తొక్కిసలాటల్లో పిల్లలు కూడా చనిపోతున్నారని విన్నప్పుడు హృదయం ద్రవించిపోతోంది' అని థరూర్ ఆవేదన వ్యక్తం చేశారు. తమిళనాడులోని కరూర్‌లో నటుడు, రాజకీయ నేత విజయ్ సారథ్యంలో జరిగిన ర్యాలీలో భారీ రద్దీ కారణంగా తొక్కిసలాట జరిగి... 40 మంది మృత్యువాపడ్డారు. ఈ ఘటనపై ప్రధాని మొదలుకొని పలువురు సంతాపం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై స్పందించిన ఎంపీ శశి థరూర్ 'భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా భారీ సమావేశాల విషయంలో కఠిన నియమాలను, భద్రతా ప్రొటోకాల్ రూపొందించాలి. సాధారణ ప్రజానీకాన్ని రక్షించేందుకు జాతీయస్థాయిలో క్రమబద్ధమైన విధాన రూపకల్పనకు ఏమి చేయగలమో అని ఆలోచించాలి. జనం అటు సినిమా నటుడైనా, ఇటు రాజకీయ నేత అయినా వారి మాటలు వినడానికి ఉత్సాహంగా బహిరంగ సభలకు హాజరవుతుంటారు. ఇటువంటి సందర్భాల్లో కొన్ని నియమాలు, ప్రమాణాలు, ప్రొటోకాల్ అమలులో ఉండాలి. అదే సమయంలో తొక్కిసలాటలో అయినవారిని కోల్పోయిన దుఃఖంలో ఉన్నవారిని ఓదార్చాలి. ఏదిఏమైనప్పటికీ ఎట్టి పరిస్థితుల్లోనూ జనసమూహాన్ని నియంత్రించేందుకు కఠిన విధానాలు తీసుకురావాలి. ఇందుకు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు అంగీకరించాలని కోరుతున్నానని శశిథరూర్ పేర్కొన్నారు.

ఖాదీ వస్త్రాలే ధరించండి

మన్‌కీ బాత్‌లో మోదీ పిలుపు

న్యూఢిల్లీ: 'వికసిత్ భారత్' లక్ష్య సాధనకు దేశ ప్రజలు స్వయం సమృద్ధి బాటలో నడవడం తప్పనిసరని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పుకొచ్చారు. ఇందుకోసం స్వదేశీ తయారీ ఉత్పత్తులే విక్రయించాలని దేశ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మన్‌కీ బాత్ 126వ కార్యక్రమంలో ఆదివారం మోదీ మాట్లాడుతూ అక్టోబర్ 2న గాంధీ జయంతిని పురస్కరించుకొని ప్రజలంతా ఖాదీ వస్త్రాలు ధరించాలని మోదీ కోరారు. స్వాతంత్ర్య పోరాట సమయంలో స్వదేశీ ఉత్పత్తులపై మహాత్మా గాంధీ ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించారన్నారు. కాలక్రమంలో ఖాదీకి ప్రజాదరణ క్షీణించినప్పటికీ... 11 ఏళ్లుగా మళ్లీ ఖాదీ ఉత్పత్తి పెరిగిందని అన్నారు. ప్రపంచ ఆర్థిక రంగం అస్థిరతను, అనిశ్చితిని ఎదుర్కొంటున్న తరుణంలో మిగతా దేశాల మాదిరిగానే మనం కూడా సొంత ఆర్థిక ప్రయోజనాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, స్వదేశీ ఉత్పత్తుల వాడకానికి పెద్దపీట వేయాలని మోదీ పిలుపునిచ్చారు. రాజకీయ పార్టీలు కూడా విభేదాలు పక్కనబెట్టి... దీనిపై దేశవ్యాప్త విప్లవానికి నడుం బిగించాలని, కేవలం భారతీయులు తయారుచేసిన వస్తువులనే కొనుగోలు చేయాలన్నారు.

భారత నావికాదళానికి చెందిన ఇద్దరు మహిళా అధికారులు, లెఫ్టినెంట్ కమాండర్ దిల్నా, లెఫ్టినెంట్ కమాండర్ రూప ధైర్య సాహసాలను ప్రధాని ప్రశంసించారు. సముద్ర గర్భంలో వారు చూపుతున్న తెగువను కొనియాడారు. భారత పుత్రికలు కఠిన పరిస్థితులను సైతం సమర్థంగా ఎదుర్కొంటూ ముందుకు సాగుతున్నారన్నారు. మన్‌కీ బాత్‌లో భాగంగా వారిరువురితో ఫోన్‌లో సంభాషించారు. స్వాతంత్ర్య సమర యోధుడు భగత్ సింగ్, భారతరత్న, ప్రముఖ గాయని లతా మంగేష్కర్ జయంతి సందర్భంగా మోదీ వారికి శ్రద్ధాంజలి ఘటించారు. దేశ స్వాతంత్ర్యం కోసం భగత్ సింగ్ ఉరికంబం ఎక్కారని, దానికి ముందు ఆయన ఆంగ్లేయులకు లేఖ రాశారని అన్నారు. ఇందులో తమను ఉరి కంబాలకు బదులు తూటాలతో చంపాలని భగత్‌సింగ్ కోరినట్లు తెలిపారు. ఆ లేఖ ఆయన సాహసానికి నిదర్శనమని కొనియాడారు. లతా మంగేష్కర్ పాడిన దేశభక్తి గీతాలు ప్రజలపై తీవ్ర ప్రభావం చూపాయన్నారు. భారతీయ సంస్కృతి, సంగీతంపై ఆసక్తి ఉన్న ఎవరైనా ఆమె పాటలు విని మంత్రముగ్ధులైపోతారని కొనియాడారు.

నిస్వార్థ సేవ ఆర్ఎస్ఎస్ బలం

నిస్వార్థ సేవా స్ఫూర్తి, క్రమశిక్షణ సంఘ్ నిజమైన బలాలు అని మోదీ అన్నారు. ఆర్ఎస్ఎస్ 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. యునెస్కో సాంస్కృతిక వారసత్వ జాబితాలో 'ఛత్ మహాపర్వ్'ను చేర్చడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని మోదీ అన్నారు. ఆర్ఎస్ఎస్‌ను మోదీ అభినందిస్తూ... 'ఇప్పటి నుంచి కొన్ని రోజుల్లో మేము విజయదశమి జరుపుకోబోతున్నాము. ఈసారి విజయదశమి మరొక కారణంతో మరింత ప్రత్యేకమైనది. ఈ రోజున ఆర్ఎస్ఎస్ స్థాపించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటుంది' అని తెలిపారు. శతాబ్దాల నాటి ప్రయాణం అద్భుతమైనది మాత్రమే కాదు.

స్ఫూర్తిదాయకమని ప్రధాన మంత్రి అన్నారు. 'వంద సంవత్సరాల క్రితం ఆర్ఎస్ఎస్ స్థాపించబడినప్పుడు మన దేశం బానిసత్వ సంకెళ్లలో బంధించబడింది. శతాబ్దాల నాటి ఈ బానిసత్వం మన ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవంపై లోతైన గాయాన్ని కలిగించింది' అని ఆయన అన్నారు.

చొరబాటు కుట్ర భగ్నం

ఇద్దరు ఉగ్రవాదుల హతం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో నియంత్రణ రేఖ వెంబడి ఉగ్రవాదుల చొరబాటు యత్నాన్ని భద్రతా బలగాలు ఆదివారం భగ్నం చేశాయి. పాకిస్థాన్ ఆక్రమిత భాగం నుంచి భారత భూభాగంలోకి అడుగుపెట్టేందుకు ఉగ్రవాదులు ప్రయత్నించడంతో అప్రమత్తంగా ఉన్న భద్రతా బలగాలు కాల్పులు ప్రారంభించాయి. ఇరువైపులా హోరాహోరీ కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదులను బలగాలు హతమార్చాయి. మిలిటెంట్లు తప్పించుకుపోకుండా బలగాలు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. సరిహద్దు వెంబడి తప్పించుకునేందుకు అవకాశమున్న అన్ని మార్గాలను మూసివేయడానికి అదనపు బలగాలను మోహరించారు. అతి సున్నితమైన చొరబాట్ల జోన్‌గా కెరాన్ సెక్టార్‌కు పేరుంది. శీతాకాలానికి ముందు రెండు నెలలూ ఉగ్రవాదులు ఈ జోన్ నుంచి చొరబాటుకు పాల్పడుతుంటారు. దీంతో సీమాంతర ఉగ్రవాదాన్ని నిరోధించేందుకు భద్రతా బలగాలు నిఘా ముమ్మరం చేశాయి.

పశు వ్యాక్సిన్ల తయారీపై భారత్ దృష్టి

న్యూఢిల్లీ: వ్యాక్సిన్ ఉత్పత్తిలో భారతదేశం ప్రపంచదేశాలలో అగ్రగామి. కానీ ఇది మానవ వ్యాక్సిన్లకు మాత్రమే వర్తిస్తుంది. పశువైద్య వ్యాక్సిన్ల విషయానికి వస్తే... భారత్ ఇతర దేశాల వైపు చూడాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో వ్యాక్సిన్ల రంగంలోని ప్రముఖ కంపెనీలు వెటర్నరీ వ్యాక్సిన్స్ ఇండియా మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (వీవీఐఎంఏ)ను ఏర్పాటు చేశాయి. ప్రస్తుతం భారతదేశంలో ఎనిమిది ప్రైవేట్ పశువైద్య వ్యాక్సిన్ తయారీదారులు, అనేక ప్రభుత్వ యాజమాన్యంలోని పశువైద్య వ్యాక్సిన్ తయారీ ప్లాంట్లు ఉన్నాయి. కోళ్లు, పశువులు, గొర్రెలు, మేకలు, పందులు, పెంపుడు జంతువులను ప్రభావితం చేసే వ్యాధులను అరికట్టడం కోసం భారత్‌లో పశువైద్య వ్యాక్సిన్లు తయారు చేస్తున్నారు. ఈ మార్కెట్‌ను మరింత విస్తరించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. సెప్టెంబర్ 25న ఢిల్లీలో వీవీఐఎంఏ వ్యవస్థాపక సభ్యులు, పశు సంవర్ధక, పాడిపరిశ్రమ శాఖ మధ్య సమావేశం జరిగింది. కేంద్ర పశుసంవర్ధక, పాడిపరిశ్రమ సహాయ మంత్రి ప్రొఫెసర్ ఎస్పీ సింగ్ బఘేల్, విభాగ కార్యదర్శి నరేష్ పాల్ గంగ్వార్, పశుసంవర్ధక కమిషనర్ డాక్టర్ ప్రవీణ్ మాలిక్, అదనపు కార్యదర్శి వర్ష జోషి వీవీఐఎంఏ నిబద్ధతను వ్యక్తం చేశారు. ఈ సంస్థ జంతు వ్యాక్సిన్ తయారీదారుల సమష్టి స్వరంగా పనిచేస్తుంది. సమర్థవంతమైన టీకా వ్యూహాల ద్వారా జంతువుల ఆరోగ్యాన్ని ప్రోత్సహించడంలో వీవీఐఎంఏ కీలక పాత్ర పోషిస్తుంది. ఇది జంతువులలో వ్యాధుల ప్రమాదాన్ని, జంతువులు, మానవుల మధ్య వ్యాధి వ్యాప్తి ప్రమాదాన్ని తగ్గిస్తుంది, గ్రామీణ భారతదేశంలో పశు పోషణలో పాల్గొన్న వ్యక్తుల ఆదాయాలను మెరుగుపరుస్తుంది. దీని సభ్యులను ఇటీవల నియమించారు. వీటిలో బయోవెట్ ప్రైవేట్ లిమిటెడ్, బ్రిలియంట్ బయో ఫార్మా, గ్లోబియన్ ఇండియా, హెస్టర్ బయోసైన్సెస్ లిమిటెడ్, ఇండియన్ ఇమ్యునోలాజికల్స్ లిమిటెడ్, ఇండోవాక్స్ ప్రైవేట్ లిమిటెడ్, వెంకటేశ్వర్ హేచరీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఉన్నాయి.

బీసీసీఐ నూతన అధ్యక్షుడిగా మిథున్ మన్హాస్

ముంబై: 'భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు' నూతన అధ్యక్షుడిగా మిథున్ మన్హాస్ (40) నియమితులయ్యారు. ముంబైలోని బీసీసీఐ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన వార్షిక సర్వసభ్య సమావేశంలో మన్హాస్‌ను బీసీసీఐ అధ్యక్షుడిగా, రాజీవ్ శుక్లాను ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. దేవజిత్ సైకియా గౌరవ కార్యదర్శిగా, ప్రభుతేజ్ సింగ్ భాటియా జాయింట్ సెక్రెటరీగా, కోశాధికారిగా ఎ. రఘురామ్ భట్‌లను నియమించారు. ఇటీవల 70వ ఏట అడుగుపెట్టిన రోజర్ బిన్నీ బీసీసీఐ అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో మిథున్ మన్హాస్ బీసీసీఐ నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకుంటారు. ఈ నియామకంతో జమ్మూకశ్మీర్‌లో పుట్టి బీసీసీఐ అధ్యక్షుడిగా ఎంపికైన తొలి వ్యక్తిగా మిథున్ మన్హాస్ గుర్తింపు పొందారు. కాగా ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో అపార అనుభవం ఉన్న మిథున్ మన్హాస్... అంతర్జాతీయ క్రికెట్‌లో భారత్ తరపున ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు.

బాలికపై ఆరు నెలలుగా అత్యాచారం... నిందితుడి అరెస్ట్

లక్నో: బాలికను కిడ్నాప్ చేసి ఆరు నెలలుగా అత్యాచారం చేస్తున్న నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి బాలికను రక్షించిన ఘటన ఉత్తరప్రదేశ్‌లోని భదోహి జిల్లాలో జరిగింది. మోధ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామానికి చెందిన బాలిక (16) మార్చి 22న అదృశ్యమైంది. ఆమె తల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేశారు. మూడు రోజులపాటు అన్ని చోట్ల వెతికారు. కాగా, ఆశిష్ కుమార్ సరోజ్ (21) ఆ యువతిని మభ్యపెట్టి లోబర్చుకుని కిడ్నాప్ చేసినట్లు దర్యాప్తులో పోలీసులు తెలుసుకున్నారు. ఆరు నెలల తర్వాత అంటే ఈ నెల 26న ప్రయాగ్‌రాజ్ జిల్లాలోని సంగం రైల్వే స్టేషన్ సమీపంలో ఆ బాలికను రక్షించారు. ఆశిష్ కుమార్ తనను నిర్బంధించి పలుమార్లు అత్యాచారానికి పాల్పడినట్లు ఆమె ఆరోపించింది. దీంతో నిందితుడ్ని పోలీసులు అరెస్ట్ చేశారు. మరోవైపు బాధిత బాలికను వైద్య పరీక్షల కోసం పంపినట్లు పోలీస్ అధికారి తెలిపారు. కోర్టులో ఆమె వాంగ్మూలాన్ని రికార్డ్ చేసినట్లు చెప్పారు. నిందితుడు ఆశిష్ కుమార్‌పై పోక్సో చట్టంతోపాటు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు వివరించారు. రిమాండ్ కోసం అతడిని జైలుకు తరలించినట్లు వెల్లడించారు.

లైంగిక వేధింపుల కేసు... ఢిల్లీ బాబా అరెస్ట్

న్యూఢిల్లీ: లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న శ్రీ శారద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మేనేజ్‌మెంట్ అండ్ రీసెర్చ్ మేనేజర్ స్వామి చైతన్యానంద సరస్వతి అలియాస్ పార్థసారథిని పోలీసులు అరెస్టు చేశారు. చైతన్యానందను ఆగ్రాలో పోలీసులు అరెస్టు చేశారు. ఆయనను పోలీసులు ఢిల్లీ కోర్టులో హాజరు పరిచారు. విచారణ నిమిత్తం ఐదు రోజులు తమకు అప్పగించాలని మేజిస్ట్రేట్‌ను పోలీసులు వేడుకున్నారు. కర్నాటకలోని శృంగేరీ పీఠం అధ్వర్యంలో ఢిల్లీలోని వసంత్ కుంజ్‌లో ఎస్ఆర్ఐఎస్ఐఐఎం నడుస్తున్నది. దానికి మేనేజర్‌గా పనిచేస్తున్న స్వామి చైతన్యానంద తమను లైంగికంగా వేధిస్తున్నాడని విద్యార్థినులు ఆరోపించారు. బలహీనవర్గాల కేటగిరీలో పీజీ మేనేజ్‌మెంట్ డిప్లొమా కోర్సులు చదువుతున్న విద్యార్థినులు ఈ నెల 24న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆశ్రమంలోని 32 మంది విద్యార్థినులను పోలీసులు విచారించారు. వీరిలో 17 మంది చైతన్యానందపై లైంగిక వేధింపులు ఆరోపణలు చేశారు. ద్వేషపూరిత భాష వాడుతున్నారని, శృంగారభరిత టెక్స్ట్ మెసేజ్‌లు చేస్తున్నారని, భౌతికంగా తాకేందుకు ప్రయత్నిస్తున్నారని తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. డైరెక్టర్‌కు లొంగిపోవాలని ఆశ్రమంలోని మహిళా సిబ్బంది, అడ్మినిస్ట్రేటివ్ సిబ్బంది కూడా ఒత్తిడి చేస్తున్నట్లు విద్యార్థినులు తెలిపారు. దీంతో బీఎన్ఎస్ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. అప్పటి నుంచి ఆయన పరారీలో ఉన్నారు. ఈ క్రమంలో ఆగ్రాలో ఆయనను అదుపులోకి తీసుకున్నారు.

బీహార్ ఎన్నికలకు 470 మంది పరిశీలకులు

ఎన్నికల సంఘం

న్యూఢిల్లీ: బీహార్‌లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు, ఏడు అసెంబ్లీ స్థానాల ఉపఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం 470 మంది అధికారులను పరిశీలకులుగా నియమించనుంది. అందులో 320 మంది ఐఏఎస్ అధికారులు, 60 మంది ఐపీఎస్ అధికారులు, 90 మంది ఇతర సేవలకు చెందినవారు ఉన్నారని ఎన్నికల సంఘం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఎన్నికల పర్యవేక్షణ సంస్థకు కళ్లు, చెవులుగా పని చేయడానికి సాధారణ, పోలీసు, వ్యయ పరిశీలకులు ఎన్నికల సమయంలో నియమించబడతారు. అక్టోబరు 3న న్యూఢిల్లీలో ఈ పరిశీలకుల సమావేశం జరుగుతుంది. ఎన్నికల సన్నద్ధతను అంచనా వేయడానికి కేంద్ర ఎన్నికల సంఘం వచ్చే వారం బీహార్‌ను సందర్శించనుంది. 243 మంది సభ్యుల బీహార్ అసెంబ్లీ పదవీకాలం నవంబరు 22తో ముగుస్తుంది. నవంబరులో ఎన్నికలు జరిగే అవకాశం ఉంది.

దాడి కేసులో కాంగ్రెస్ నేత కుమారుడిపై కేసు

భోపాల్: మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో కాంగ్రెస్ నేత కుమారుడు ఇద్దరు వ్యక్తులపై దాడి చేసి వారిని బెదిరించాడు. నగరంలోని సగం మంది తన పేరు వింటే భయపడతారని వారితో అన్నాడు. బాధిత వ్యక్తుల ఫిర్యాదుతో కాంగ్రెస్ నేత కుమారుడిపై కేసు నమోదైంది. ఈ నెల మూడో తేదీన అనికేత్ బైరాగి తన బావమరిది నీరజ్‌తో కలిసి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, అసెంబ్లీ మాజీ స్పీకర్ ఎన్‌పీ ప్రజాపతి కుమారుడు నీర్ ప్రజాపతి ఇంటికి వెళ్లి కలిశాడు. ఆయన మేనల్లుడు అమిత్ ప్రజాపతి, నీరజ్ మధ్య జరిగిన వివాదాన్ని ప్రస్తావించాడు.

కాగా, వివాదాన్ని పరిష్కరించడానికి బదులు అనికేత్, నీరజ్‌ను నీర్ ప్రజాపతి దుర్భాషలాడాడు. వారిద్దరిని కొట్టాడు. 'భోపాల్‌లో సగం మంది తన పేరుకు భయపడతారు' అని బెదిరించాడు. కాంగ్రెస్ నేత ఎన్పీ ప్రజాపతి కూడా కుమారుడి దాడిలో జోక్యం చేసుకునేందుకు ప్రయత్నించాడు.

మరోవైపు రికార్డ్ చేసిన ఈ వీడియో క్లిప్ ఈ నెల 10న సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ నేపథ్యంలో అనికేత్, నీరజ్ కలిసి కొత్వాలి పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. కాంగ్రెస్ నేత ఎన్పీ ప్రజాపతి కుమారుడు నీర్ ప్రజాపతి తమను దుర్భాషలాడటంతో పాటు కొట్టి బెదిరించినట్లు ఫిర్యాదు చేశారు. దీంతో నీర్ ప్రజాపతితో పాటు అతడి బంధువులైన అమిత్ ప్రజాపతి, వినోద్ ప్రజాపతిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీస్ అధికారి తెలిపారు.

విశాలాంధ్ర హైదరాబాద్

దసరా నవరాత్రి మండపాల్లో ఎమ్మెల్యే మర్రి పూజలు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : శాసన సభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి శరణ్ నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా మల్కాజిగిరిలో గాంధీ పార్కులో మల్కాజిగిరి మాజీ కార్పొరేటర్ నిరుగొండ జగదీష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలు దసరా ఉత్సవాలను ఆనందదాయకంగా నిర్వహించుకోవాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం బాలసరస్వతి నగర్, ఓల్డ్ మల్కాజిగిరి మహంకాళి ఆలయం, విష్ణుపురి కాలనీ, నేరేడ్‌మెట్ ఎల్.బి.నగర్ కమ్యూనిటీ హాల్, వినాయక్‌నగర్ మూడు గుళ్ళు, ఓల్డ్ నేరేడ్ మెట్ న్యూ విద్యా నగర్, కేశవ్‌నగర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన మండపాల్లో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మంజుల, జేఏసి వెంకన్న, రాము యాదవ్, చిన్న యాదవ్, సుధాకర్, జనార్దన్, రజని గౌడ్, కిరణ్, శ్రీకాంత్, నవీన్, జ్ఞానేశ్వర్, రవీందర్, ప్రభాకర్ గౌడ్, శ్రవణ్ యాదవ్, రాజేష్ గౌడ్, వంశీ, వాసు, సంపత్, పలువురు బిఆర్ఎస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు కార్పోరేటర్ ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : దేవీ నవరాత్రులను పురస్కరించుకొని గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని సాయి నగర్, వీణపాణి నగర్, వాణి నగర్ తదితర ప్రాంతాలలో ఏర్పాటు చేసిన అమ్మవారిని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పలు ప్రాంతాలలో మండపాల వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బి.ఆర్.ఎస్ నాయకులు మేకల రాముయాదవ్‌తో పాటు బైరు అనిల్, నర్సింగ్ రావు, పార్టీ నేతలు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దుర్గామాతకు కార్పోరేటర్ రాజ్యలక్ష్మి పూజలు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : వినాయక్ నగర్ డివిజన్ శ్రీసాయినగర్‌లో మహిళామణులు దేవి విగ్రహ మండపాన్ని కార్పొరేటర్ రాజ్యలక్ష్మి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రజలందరూ సుఖ శాంతులతో కలసి మెలసి ఉండాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

సీఆర్ ఫౌండేషన్‌లో బతుకమ్మ సంబరాలు

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: దసరా ఉత్సవాల సందర్భంగా చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ హోమ్ ఫర్ ఏజ్డ్ (వృద్ధాశ్రమం)లో బతుకమ్మ సంబరాలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో వివిధ సాఫ్ట్‌వేర్ సంస్థల్లో పని చేస్తున్న పలువురు యువతి యువకులు ది వాలంటీర్స్ ఆర్గనైజేషన్ (వీటీవీఓ) సంస్థ ఆధ్వర్యంలో పాల్గొని వృద్ధాశ్రమంలోని పెద్దలను ఉత్సాహ పరిచారు. సిఆర్ ఫౌండేషన్ ట్రెజరర్, వృద్ధాశ్రమ డైరెక్టర్ వి.చెన్నకేశవరావు, వీటీవీఓ ప్రతినిధులు సునీల్ కుమార్ రెడ్డి, ప్రవల్లిక, రాజేష్, బాజీ, పుష్ప, దిలీప్, హర్షిత తదితరులకు కృతజ్ఞతాభివందనాలు తెలియచేసారు. వృద్ధాశ్రమ కమిటీ సభ్యులు తమ్మారెడ్డి తానియా, డాక్టర్ ఎం గోపీచంద్, ఎస్ రాజేంద్రరావు, స్వాతంత్ర్య సమరయోధులు రాంరెడ్డి, హెూం మేనేజర్ శ్రీనివాస్, వృద్ధాశ్రమ వాసులు, సిబ్బంది, సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు

విశాలాంధ్ర - మేడిపల్లి: భారత జాతీయ మహిళా సమైక్య మేడ్చల్ జిల్లా కార్యదర్శి జై. లక్ష్మీ ఆధ్వర్యంలో మేడిపల్లి భగత్ సింగ్ కాలనీలో బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కార్యదర్శి జ్యోతి, మాధవి, ఏ.ఐ.ఎస్.ఎఫ్. జిల్లా కార్యదర్శి ఎండి అన్వర్, ఏ.ఐ.వై.ఎఫ్. మండల కార్యదర్శి నాగరాజ్, మహిళా సమైక్య నాయకులు మహేశ్వరి, మహాలక్ష్మి, అండాలు, నర్సమ్మ, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

2026 ఫిబ్రవరి నాటికి హైదరాబాద్ - విజయవాడ

ఎనిమిది లైన్ల రహదారి పనులు ప్రారంభం

భారత్ ఫ్యూచర్ సిటీ నుండి అమరావతి గ్రీన్ ఫీల్డ్ హైవే పనులు కూడా త్వరలో ప్రారంభం

హైదరాబాద్ నుండి విజయవాడ రెండు గంటల్లో చేరుకునేలా అధునాతన టెక్నాలజీతో యాక్సిడెంట్ ఫ్రీ రహదారి నిర్మాణం : మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్ - విజయవాడ (ఎన్‌హెచ్ 65) జాతీయ రహదారి 8 లైన్ల విస్తరణకు టెండర్ ప్రక్రియ పూర్తి చేసుకొని 2026 ఫిబ్రవరిలో పనులు ప్రారంభం కానున్నాయని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ నుండి విజయవాడ జాతీయ రహదారి నిత్యం రద్దీగా ఉండడమే కాకుండా యాక్సిడెంట్స్ ఎక్కువ జరుగుతున్న రహదారుల్లో ఒకటని మంత్రి అన్నారు. ఇప్పటికే 17 బ్లాక్ స్పాట్స్ గుర్తించి ఫ్లై ఓవర్లు నిర్మిస్తున్నామని చెప్పారు. ఇటీవల ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసినప్పుడు ఈ అంశాన్ని గుర్తు చేశానని చెప్పారు. తెలుగు రాష్ట్రాల ప్రజలకు యాక్సిడెంట్ ఫ్రీ రహదారిని అందుబాటులోకి తేనున్నామని, అధునాతన టెక్నాలజీతో, పూర్తి నాణ్యతతో హైదరాబాద్ నుండి విజయవాడకు రోడ్ నిర్మించబోతున్నట్లు మంత్రి ప్రకటించారు. ఈ 8 వరుసల రహదారి పనులు పూర్తి ఐతే హైదరాబాద్ నుండి విజయవాడకు కేవలం 2 గంటల్లో చేరుకోవచ్చని మంత్రి పేర్కొన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీ నుండి ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి 230 కి.మీ గ్రీన్‌ఫీల్డ్ హైవే పట్ల కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పూర్తి సానుకూలంగా ఉన్నట్లు మంత్రి వెల్లడించారు. డిపిఆర్ ఎస్టిమేట్స్ త్వరలో పూర్తి కానున్నాయని, గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి వేగంగా అడుగులు ముందుకు పడుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. ఈ గ్రీన్ ఫీల్డ్ హైవే కారిడార్ తెలుగు రాష్ట్రాల అభివృద్ధిలో గేమ్ చేంజర్‌గా నిలవబోతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆస్ట్రేలియాలో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ క్వీన్స్ ల్యాండ్ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ సంప్రదాయాలు, సంస్కృతి ఉట్టిపడేలా ఆస్ట్రేలియా దేశంలో బతుకమ్మ సంబరాలు వైభవోపేతంగా జరిగాయి. తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ క్వీన్స్ ల్యాండ్ ఆధ్వర్యంలో బ్రిస్ బేన్ నగరంలో జరిగిన ఈ వేడుకలకు కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, తెలంగాణ అసెంబ్లీ మీడియా అడ్వయిజరీ కమిటీ చైర్మన్ ఐరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అక్కడ నివసిస్తున్న తెలంగాణ వాసులే కాకుండా ఇతర ప్రవాస భారతీయులు వేడుకలకు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ సప్తసముద్రాలు దాటి ఇతర దేశానికి వచ్చి నివసిస్తున్నా కూడా తెలంగాణ సంప్రదాయాలను పాటిస్తుండడం సంతోషంగా ఉందని తెలిపారు. బతుకమ్మ ఖ్యాతి ఖండాంతరాలు దాటడం తెలంగాణ సంస్కృతికి ఎంతో గర్వకారణమన్నారు. బతుకమ్మ, బోనాలతో పాటు ఇతర తెలంగాణ పండగలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని వివరించారు. తెలంగాణ సంస్కృతిని పరిరక్షించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక చర్యలు తీసుకుంటున్నారని, బతుకమ్మ వంటి పండగల కోసం ప్రత్యేకంగా నిధులు విడుదల చేశారని పేర్కొన్నారు. చైర్మన్ ఐరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రాచీన సంస్కృతికి తెలంగాణ నిలయమని, అందులో నుంచి పుట్టుకొచ్చిన బతుకమ్మ వంటి వేడుకలకు ప్రపంచంలోనే తెలంగాణకు ప్రత్యేకమని తెలిపారు. అలాంటి ప్రత్యేక గుర్తుపు కలిగిన బతుకమ్మ వేడుకలను ఆస్ట్రేలియా వంటి దేశంలో ఘనంగా నిర్వహించడం ఆనందంగా ఉందని తెలిపారు. పంచంలోని ప్రతీ ప్రాంతానికి తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు పరిచయం కావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సంబరాల్లో తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ క్వీన్స్ ల్యాండ్ అధ్యక్షుడు నరేందర్ కుమార్ చొల్లూరి, ఉపాధ్యక్షుడు మాధవ రెడ్డి గుర్రం, కార్యదర్శి దయాకర్ బచ్చు, అసోసియేషన్ ప్రతినిధులు ఉమేశ్ వంగపల్లి, సంతోష్‌రావు ఏకే, విజయ నల్ల, శ్రీకళా రూపిరెడ్డి, ప్రియాంక కర్క, విజయ్ కోరబోయిన, ప్రేమలత వాసాల, విరించి రెడ్డి ఎక్కంటి, హరిత తన్నీరు, తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాత బిందేశ్వరి ప్రసాద్ మండల్ : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - హైదరాబాద్ : బిందేశ్వరి ప్రసాద్ మండల్ స్ఫూర్తి ప్రదాత అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్ నగర్ నగరపాలక సంస్థ పరిధిలోని పద్మావతి కాలనీ గ్రీన్ బెల్ట్‌లో ఏర్పాటు చేసిన బిపి మండల్ విగ్రహాన్ని ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వెనకబడిన, దళిత వర్గాల కోసం షోషిత్ దళ్ అనే పార్టీని స్థాపించి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేశారని ఆయన గుర్తు చేశారు. సమాజంలో బిసిలు ఎదుర్కొంటున్న వివక్షను ప్రశ్నించి ముఖ్యమంత్రి పీఠాన్ని సైతం వదులుకున్న వెనుకబడిన వర్గాల పక్షపాతి బిపి మండల్ అని ఆయన చెప్పారు. లోక్‌సభ సభ్యుడిగా జనతా ప్రభుత్వంలో 1978లో రెండవ జాతీయ బిసి కమిషన్ సభ్యుడిగా, బిసిల స్థితిగతులపైన విస్తృత అధ్యయనం చేసి, 1980 డిసెంబర్‌లో నివేదిక సమర్పించారన్నారు. ఓబిసి రిజర్వేషన్లు 27 శాతం సాధించారని, ఈ రిజర్వేషన్ అమలు వలన బిసి బిడ్డలు విద్య, ఉద్యోగ అవకాశాలు పొందుతున్నారు అని ఆయన చెప్పారు. బిపి మండల్ స్ఫూర్తితో తెలంగాణలో సిఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో బిసిల అభివృద్ధికి సంక్షేమానికి విశేషంగా కృషి చేస్తున్నామని, బిసిలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కృతనిశ్చయంతో ఉన్నమని ఆయన స్పష్టం చేశారు. నాణ్యమైన విద్యతో పాటు బిసిల ఆత్మగౌరవం ఇనుమడింపచేసేలా అనేక సంక్షేమ పథకాలు తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తున్నామని ఆయన తెలిపారు. భవిష్యత్తులో బిసి వర్గాలు లాభపడాలని రాష్ట్రంలో ప్రకటించిన రిజర్వేషన్‌లలో రాజకీయ జోక్యం ఎక్కడా లేదు అని ఆయన చెప్పారు. ఆయన విగ్రహం పెట్టుకోవడమే కాకుండా వారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, టి పిసిసి ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్‌రెడ్డి, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు ఎస్ పి వెంకటేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, జిల్లా గొర్రెల కాపరుల సంఘం చైర్మన్ శాంతన్న యాదవ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, డిసిసి కార్యదర్శి టంకర కృష్ణయ్య యాదవ్, గోపాల్ యాదవ్, ఐఎన్టీయుసి రాములు యాదవ్, పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వహక అధ్యక్షులు అజ్మత్ అలి, నాయకులు మైత్రి యాదయ్య, శ్రీనివాస్ యాదవ్, జేసిఆర్, జాతీయ యాదవ సభ కార్యదర్శి ఆర్ లక్ష్మణ్ యాదవ్, యాదవ సభ ప్రతినిధులు యాదవ్, బాలు యాదవ్, వెంకట్ నర్సయ్య యాదవ్, రవిచంద్రనాథ్ యాదవ్, శ్యాంసుందర్ యాదవ్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

భగత్ సింగ్ నేటి యువతకు ఆదర్శప్రాయుడు

విశాలాంధ్ర - హైదరాబాద్ : షహీద్ భగత్ సింగ్ నేటి యువతకు ఆదర్శప్రాయుడని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర పిలుపునిచ్చారు. షహీద్ భగత్ సింగ్ 118వ జయంతిని పురస్కరించుకుని ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్ వద్ద ఏర్పాటు చేసిన భారీ భగత్‌సింగ్ కటౌట్‌కు పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య పోరాటంలో భగత్ సింగ్ నిర్వహించిన పాత్ర యావత్తు దేశం విస్మరించరానిదని, 12ఏళ్ళ అతి చిన్న వయసులోనే స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని 23 ఏళ్ళ యువప్రాయంలోనే దేశం కోసం ప్రాణాలర్పించి ఎందరో యువతకు స్ఫూర్తిగా నిలిచి దేశభక్తిని రగిలించిన సమరయోధుడు, విప్లవ మూర్తి భగత్‌సింగ్ అని వారు కొనియాడారు. 1907 సెప్టెంబర్ 28న జన్మించిన భగత్ సింగ్ 23 ఏళ్ళ చిరు ప్రాయంలోనే 1931 మార్చ్ 23న తన సహచరులు రాజ్ గురు, సుఖ్‌దేవ్‌లతో కలిపి ఉరితీయబడ్డారని, భారత స్వాతంత్ర్య ఉద్యమంలో పోరాడిన అత్యంత ప్రభావ శీల విప్లవకారులలో భగత్ సింగ్ అగ్రగణ్యుడని, ఈ కారణంగానే షహీద్‌గా దేశ ప్రజలు కొనియాడారని వారు గుర్తు చేశారు. మతోన్మాద రాజకీయాలను సమూలంగా ఓడించడమే భగత్‌సింగ్‌కు నేటితరం అందించగలిగే నిజమైన నివాళి అని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సల్మాన్ బేగ్, హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్, ఉపాధ్యక్షులు హేమంత్, శబుద్దేన్, మహేష్, అనీల్ కుమార్, విజయ్, రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

నదులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదీ



విశాలాంధ్ర - బషీర్‌బాగ్: అంతర్జాతీయ నదుల దినోత్సవం సందర్భంగా ఫోరం ఫర్ ఏ బెటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో కొత్త తెలంగాణ చరిత్ర బృందం, దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ గవర్నమెంట్ సిటీ కాలేజీతో పాటుగా ఏడుపాయల దగ్గర మంజీరా నదిని బృంద సభ్యులు వీక్షించి నదితో నడక కార్యక్రమన్ని ఫోరమ్ ఫర్ హైదరాబాద్ అధ్యక్షులు ప్రో.మణికొండ వేద కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రో.మణికొండ వేదకుమార్ మాట్లాడుతూ నదులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిదీ అని, నదులు నాగరికతకు మూలమని కాలుష్యానికి దూరంగా నదులను స్వచ్ఛంగా కాపాడుకొని తర్వాత తరాలకు నదులను అందించాలన్నారు. గొప్ప సంకల్పంతో అంతర్జాతీయ స్థాయిలో దాదాపు 100 దేశాల్లో జరుపుతున్న ఈ నదుల దినోత్సవాన్ని ఈ సంవత్సరానికి మెదక్ జిల్లాలోని ఏడుపాయల వద్ద మంజీరా నది సమక్షంలో జరుపుకుంటున్నామని తెలిపారు. మంజీర నది తీరంలోని కొండల వరుసలు రాక్ ఫార్మేషన్లు గురించి తెలిపారు. మంజీర నది మీద కట్టిన మొదటి ప్రాజెక్ట్ వన దుర్గాప్రాజెక్ట్ అని ఈ ప్రాజెక్ట్ వల్ల ఎంతో మంది రైతులకు వ్యవసాయానికి నీరు అందుతుందని తెలిపారు. గ్రూప్ 1 ఆఫీసర్ కరిపే రాజు మాట్లాడుతూ అంతర్జాతీయ నదుల దినోత్సవం సందర్భంగా మంజీర నది వీక్షణ కార్యక్రమం చేపట్టిన ఫోరం ఫర్ ఏ బెటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మణికొండ వేదకుమార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫోరం సభ్యుడు వేణుగోపాల్, ఎం.వెంకటేశ్వర్లు, అంబటి వెంకన్న, ఫోరమ్ ఫర్ ఏ బెటర్ హైదరాబాద్ వైస్ ప్రెసిడెంట్ ఎంహెచ్ రావు, డా.రమా, డా.పద్మ, సుతారావు, వెంకటనారాయణ, నరేందర్ కేటీసీటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని సన్మానించిన కొత్త కుర్మ సత్తయ్య

విశాలాంధ్ర - తుర్కయంజల్: ఫ్యూచర్ సిటీలో నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని టీజీ క్యాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్త కుర్మ సత్తయ్య కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ మంత్రి శ్రీధర్ బాబు, గిరిజన మరియు మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చండీ హోమంలో పాల్గొన్న గాంధీ

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: చందానగర్ డివిజన్ పరిధిలోని పీజేఆర్ ఎన్‌క్లేవ్ రోడ్డులో గల అయ్యప్పస్వామి దేవాలయంలో జరిగిన చండీ హెూమం, అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో కార్పొరేటర్లు జగదీశ్వర్ గౌడ్, నార్నె శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు రఘునాథ్‌రెడ్డితో కలిసి పాల్గొన్న పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ప్రత్యేక పూజలు చేసి స్వాములకు అన్న ప్రసాదాలు వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవి శరన్నవరాత్రి వేడుకలను ప్రజలందరూ భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవలని, అమ్మవారి ఆశీస్సులతో శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, శాంతి సౌభాగ్యలతో జీవించాలని తఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఓ వెంకటేష్, కాజా, పాత్రికేయ మిత్రులు మల్లేష్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కు సీఎం చంద్రబాబు పరామర్శ

ప్రధాని పర్యటన, ఆటో డ్రైవర్ల సేవలో, జీఎస్టీ ఉత్సవ్‌పై భేటీలో చర్చ

విశాలాంధ్ర - హైదరాబాద్ : తీవ్ర జ్వరంతో బాధపడుతోన్న ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరామర్శించారు. హైదరాబాద్‌లోని పవన్ కళ్యాణ్ నివాసానికి సీఎం చంద్రబాబు ఆదివారం వెళ్లారు. ఆరోగ్య పరిస్థితిని గురించి పవన్ కళ్యాణ్‌ను అడిగి తెలుసుకున్నారు. జ్వరం నుంచి ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అక్టోబర్ 4న ఆటో డ్రైవర్ల సేవలో పథకం ప్రారంభించనున్న నేపథ్యంలో ఆ అంశంపై డిప్యూటీ సీఎంతో చర్చించారు. ఆటో డ్రైవర్ల కోసం చేపట్టే ఈ పథకం కూడా మన్ననలు పొందుతుందనే విశ్వాసం ఉన్నట్లు పవన్ తెలిపారు. జీఎస్టీ 2.0 సంస్కరణలలో భాగంగా రాష్ట్రంలో చేపట్టనున్న జీఎస్టీ ఉత్సవ్ కార్యక్రమం నిర్వహణపైనా చర్చించారు. వచ్చే నెల 16న ప్రధాని మోదీ శ్రీశైలం రానున్న సందర్భంగా రోడ్ షో నిర్వహణ విజయంతం చేసే అంశంపై ఇరువురు నేతలు మాట్లాడుకున్నారు. వీటితో పాటు డీఎస్సీ అంశం కూడా ఇద్దరు నేతల మధ్య చర్చకు వచ్చింది. మెగా డీఎస్సీని విజయవంతంగా నిర్వహించి ఒకేసారి 15,941 మందికి ఉపాధ్యాయ ఉద్యోగాలు ఇవ్వడాన్ని పవన్ కళ్యాణ్ ప్రస్తావించారు. ఉద్యోగాలకు ఎంపికైనవారికి నియామక పత్రాలు అందించే కార్యక్రమాన్ని నిర్వహించి యువతలో మనోధైర్యాన్ని, స్ఫూర్తిని నింపారని ముఖ్యమంత్రి చంద్రబాబుతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు.

42 శాతం రిజర్వేషన్లలో బిసి-ఎ

విశాలాంధ్ర - బషీర్ బాగ్: బిసిలకు స్థానిక సంస్థల కోసం రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన 42 శాతం రిజర్వేషన్లలో బిసి ఎ కూలాలకు జనాభా ప్రాతిపదిన వాటా కల్పించాలని తెలంగాణ బిసి ఎ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం. భాగయ్య డిమాండ్ చేశారు. ఆదివారం బషీర్బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రొఫెసర్ ఎం. భాగయ్య, రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ నరహరిలు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్స రాలు గడుస్తున్నప్పటికి వెనుకబడిన కులాల్లో కేవలం 5 కులాలు మాత్రమే రిజర్వేషన్లు పొందుతున్నాయని, కాని బిసి ఎ లోని 73 కులాలకు రిజర్వేషన్లలో అన్యాయం జరుగుతుందన్నారు. ముఖ్యంగా విద్యా, ఉద్యోగ రంగాలలో తీవ్రంగా అన్యాయం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణన జాబితాను బహిర్గతం చేసి వారి, వారి కులాల వారిగా రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా బిసి ఎ లోని కొంత మంది నాయకులు వారి, వారి స్వయం ప్రతివత్తితోనే చట్టసభలకు వెళ్ళారని, మిగిలిన కులాలకు ఏలాంటి రాజకీయ ప్రయోజనం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 73 బిసి ఎ కులాలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. బిసి ఎ జాబితాలోకి ఇతర స్థానిక, స్థానికేతర కులాలను చేర్చరాదని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సమితి నాయకులు గడవ శ్రీహరి, రామానందస్వామి, కంటె రాంచందర్, అంబటి సుధాకర్ పాల్గొన్నారు.

దుర్గామాతకు నగేష్ ముదిరాజ్ ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : బాపూజీ నగర్ లో ఆకుల అరుణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గా మాత మండపాని సందర్శించి ప్రత్యేక పూజలు చేసి అమ్మ వారి పల్లకి సేవలో పాల్గొన్నా బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు నగేశ్ ముదిరాజ్. ఈ సందర్భంగా నాగేష్ ముదిరాజ్ మాట్లాడుతూ నవరాత్రి దుర్గ మాత పూజలు ధైర్య సాహసలకి శ్రీ శక్తికి నిదర్శనమని అన్నారు.

అన్నిదానాల కన్నా అన్నదానం మిన్న

విశాలాంధ్ర - దుండిగల్: అన్నిదానాల కన్నా అన్నదానం మిన్న అని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి 127 డివిజన్ రంగారెడ్డి నగర్‌లోని దుర్గామాత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యతిథిగా పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దుర్గాప్రసాద్, భాస్కరావు, చలపతి, వాసంశెట్టి, వెంకటేశ్వరరావు, వాసంశెట్టి నాగార్జున, రాంబాబు, బాలాజీ, డివిజన్ కాంగ్రెస్ నాయకులు మోటే శ్రీనివాస్ యాదవ్, బాలరాజ్, జ్ఞానేశ్వర్ రెడ్డి, రాకేష్ రామగిరి,బస్తి నాయకులు తదితరులు పాల్గొనడం జరిగింది.

ఆర్ఎస్ఎస్ విజయదశమి ఉత్సవం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) విజయదశమి ఉత్సవం లింగంపల్లి నగరలోని గుల్మోహర్ బస్తీలో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో డా. కెఎస్ఎన్ నిఖిలేశ్ ముఖ్య అతిథిగా, హెచ్.మోహన్ కుమార్ ముఖ్య వక్తగా పాల్గొన్నారు. శక్తిని ఆరాధిస్తూ ఆయుధ పూజ చేయటం జరిగింది. భరతమాతను ఆరాధిస్తూ ఏకాత్మతా స్తోత్రం అందరూ కలిసి పఠించటం జరిగింది. ప్రేరణాదాయకమైన అమృతవచనం, శత వసంతాలు జరుపుకున్న సంఘ గీతాన్ని ఆలపించటం జరిగింది. ఈ సందర్భంగా వారు అధర్మంపై ధర్మం విజయం విజయదశమి. 1925వ సంవత్సరం విజయదశమి రోజు ప్రారంభించబడ్డ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ అనేక అవరోధాలను అధిగమించి, ఎన్నో విజయాలను సాధించి ఈ 2025 వ సంవత్సరం విజయదశమికి 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. దేశ విభజన సమయంలో పాకిస్తాన్‌లోని హిందువులు భారతదేశానికి చేరుకోవటంలో సహాయం చెయ్యటం, దేశ సంస్కృతికి చిహ్నమైన రామజన్మభూమి ఆలయ నిర్మాణం, కన్యాకుమారిలో వివేకానంద స్మారక నిర్మాణం, ప్రకృతి విపత్తులైన దివిసీమ ఉప్పెన, కరోనా సమయాలలో ప్రజలకు అండగా ఉండటం, వ్యక్తి నిర్మాణం ద్వారా ప్రజలలో దేశభక్తిని పెంచటం వంటివి ఆర్ఎస్ఎస్ విజయాలలో కొన్ని. ప్రజలు విలువలతో కూడిన జీవనాన్ని సాగించాలని పంచ పరివర్తన్ పేరుతో పౌర విధులు, కుటుంబ ప్రబోధన, సామాజిక సమరసత, స్వదేశీ పర్యావరణ పరిరక్షణ అనే అంశాలను పాటించాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ నిర్దేశించింది." అన్నారు.

మృతి చెందిన జర్నలిస్టు కుటుంబాలకు నేడు చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : జర్నలిస్టుల సంక్షేమ నిధి నుండి 18 మంది జర్నలిస్టు కుటుంబాలకు, అనారోగ్యం, ప్రమాదాలకు గురైన ఏడుగురు జర్నలిస్టులకు సోమవారం, 29 సెప్టెంబర్‌చెక్కుల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలంగాణ మీడియా అకాడమి కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వరరావు తెలిపారు. "జర్నలిస్టుల సంక్షేమం - ప్రజా ప్రభుత్వ ప్రాధాన్యం" పేరిట రాష్ట్ర ప్రభుత్వం చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు, పని చేయలేని, నిస్సహాయ స్థితిలో ఉన్న జర్నలిస్టులకు, జర్నలిస్టుల సంక్షేమ నిధి నుండి వచ్చిన వడ్డీతో మీడియా అకాడమీ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమి ఆడిటోరియంలో సోమవారం, 29 సెప్టెంబర్, 2025 నాడు ఉదయం 10.30 గంటలకు చెక్కుల పంపిణి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని చెక్కుల పంపిణీ చేస్తారన్నారు. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాస్‌రెడ్డి కార్యక్రమానికి అధ్యక్షత వహిస్తారని తెలిపారు. సమాచార శాఖ ప్రత్యేక కమిషనర్ సి.హెచ్.ప్రియాంక గౌరవ అతిథిగా పాల్గొంటున్నారని ఆయన తెలియజేశారు. అంతేగాక జర్నలిస్టు నాయకులు, తదితరులు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు.

దివ్యాంగులకి ఉచిత పరికరాలు అందించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : ఆదివారం ఎల్లారెడ్డి గూడ డివిజన్లోని నాగార్జున కమిటీ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో దివ్యాంగులకి సుమారు రెండు కోట్ల ఉచిత పరికరాలు అందించారు. 36 బ్యాటరీ మూడు చక్రాల బండ్లు, అంధత్వం ఉన్నవారికి ప్రధానమంత్రి మోదీ ప్రత్యేకంగా తయారు చేయించిన సెల్ ఫోన్ లను, వినికిడి లోపం ఉన్న వారికి పరికరాలు ఇలా దివ్యాంగులకి ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ అక్టోబర్ 2 గాంధీ జయంతి వరకు దేశంలో వివిధ ప్రాంతంలో దివ్యాంగులకి, మహిళలకి, నిరుపేదలకి సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందని అన్నారు. ఓ సందర్భంగా మీడియా అడిగిన ప్రశ్నలకి సమాధానం ఇస్తూ రాబోయే జూబ్లీహిల్స్ బై ఎలక్షన్, విషయమై బిజెపి అన్ని పార్టీలకు ముందే ఇంటింటి ప్రచారం మొదలుపెట్టిందని, కాంగ్రెస్, బిఆర్ఎస్ లాగా దుందుడుకువైఖరించకుండా నేరుగా ప్రజలతో సంప్రదిస్తూ, ప్రచారం సాగిస్తుందని అలాగే అభ్యర్థి విషయంలో ఎలాంటి నిర్ణయం అయిన, నోటిఫికేషన్ వచ్చేక ప్రకటిస్తామని అన్నారు. బిఆర్ఎస్, కాంగ్రెస్ ఓటు రాజకీయాలు చేస్తున్నాయి, కానీ బిజెపి స్వచ్ఛమైన పరిపాలన చేస్తున్న సంగతి ప్రజలకు తెలుసు, కావున ఇప్పుడు వచ్చే బై పూలు అలాగే భవిష్యత్తులో జరగబోయే ఎన్నికలకు బిజెపి అనునిత్యం సన్నద్ధంగా ఉందని ఇంకా విజయం కూడా బిజెపికి వస్తుందని ఆశాభవం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలీమ్కో డిస్ట్రిబ్యూషన్ ఎయిడ్స్ అండ్ సప్లై డిజి సంజయ్ సింగ్ దివ్యాంగులకి వారి సంస్థాన్ నుంచి ఉచిత పరికరాలను అందించారు. హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్, జుట్టూరి కీర్తి రెడ్డి, ప్రేమ్ కుమార్, రావుల చందర్, బంగారు ప్రశాంత్, గంగరాజు, బీజేపీ సెట్ ట్రెజరర్ రహమత్, ప్రశాంత్, మోహన్ రెడ్డి, అనంతలక్ష్మి, తుంగలపల్లి లక్ష్మణ, వెంకటేష్, కాట్రాజ్, బండపల్లి చంద్రమోహన్, గాంధీ, పల్లె నర్సింగ్ రావు పాల్గొన్నారు.

దివ్యాంగులకు వీల్ చైర్లు అందజేత

విశాలాంధ్ర - జవహర్ నగర్ : జవహర్ నగర్ ఈస్ట్ బిజెపి అధ్యక్షులు కర్లపూడి జోగారావు ఆధ్వర్యంలో భారత దేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా ఆదివారం అంబేద్కర్ నగర్ చౌరస్తాలో దివ్యాంగులకు వీల్ చైర్లు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి జిల్లా అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా విచ్చేసి దివ్యాంగులకు వీల్ చైర్లు అందజేశారు. అనంతరం దివ్యాంగులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ వైకల్యం శరీరానికి మాత్రమే కాని వారి మనసు కాదు అని దివ్యాంగుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని వారు అన్నారు. దివ్యాంగులను సన్మానించడం జరిగింది. ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు మహేందర్ యాదవ్, జవహర్ నగర్ బిజెపి అధ్యక్షులు కమల్, రాష్ట్ర నాయకులు మైపాల్ రెడ్డి, సీనియర్ నాయకుడు చంద్రమౌళి, రంగుల శంకర్, తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సమితి ప్రధాన కార్యదర్శిమొనార్ దుర్గాప్రసాద్, లక్ష్మీనారాయణ, పుణ్యరాజు, సన్నీ,రామ్ నాయక్, జ్ఞానేశ్వర్ గౌడ్, గిరి కత్తుల వెంకన్న, డాక్టర్ యాదగిరి, అనిల్ గుప్తా, విష్ణువర్ధన్ రెడ్డి, మహేందర్ శ్రీధర్, రాజు నేత, కనకరాజు, రాజు నాయక్, దివ్యాంగుల ఉపాధ్యక్షుడు నేతి శ్రీధర్ జవహర్ నగర్ దివ్యాంగులు రమేష్, సమ్మయ్య, నరసింహ, దప్పు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర-దుండిగల్: అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలను హన్మంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేట్ బిఆర్ఎస్ 19 వార్డ్ ప్రెసిడెంట్ సోమరాజు, బీజేపీ పార్టీ నుండి సుమారు 100 మంది కార్యకర్తలు ఆదివారం ఎస్సీ సెల్ కన్వీనర్ సాల్మన్ రాజు, బాలరాజ్, కమలమ్మ, వెంకటష్, రాజు ఆధ్వర్యంలో బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి సమక్షంలో పార్టీ కండువా కప్పుకొని పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కొలను హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యమని, ఆదేవిధంగా ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారెంటీలను ప్రభుత్వం అమలు చేస్తూ వస్తుందని తెలిపారు. ప్రతి తెల్ల కార్డుదారునికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని గుర్తు చేశారు.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రేషన్ కార్డుల పంపిణీ, ఏ ప్రభుత్వం చేయని పనిని ప్రజా ప్రభుత్వం పేద ప్రజలకు అందించడం జరుగుతుందన్నారు. కాలనీ సంక్షేమ అభివృద్ధిలో తాను ఎల్లప్పుడు ముందు ఉంటానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బహదూర్ పల్లి మాజీ సర్పంచ్ మైసీగారి శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్ధనోల్ల సంజీవ రెడ్డి, 126 డివిజన్ అధ్యక్షులు గణేష్, తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవి పాసుపత హోమంలో కొలను శ్రీనివాస్‌రెడ్డి

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: శ్రీ కనకదుర్గమ్మ తల్లి చల్లని ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొలను శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం విజయదశమి మహోత్సవంలో భాగంగా 7వ రోజు కౌశికి దేవి అమ్మవారు అనుగ్రహిస్తుంది.అమ్మవారిని దర్శించుకున్నట్లయితే ఆరోగ్యము గురించి రోగ రుగ్మతలు ఈతి బాధలు నివారణ అంకుటీత ప్రజ్ఞ కలుగును నవగ్రహ దోషములు తొలుగును.కోరిన కోరికలు తీర్చి అన్నిటా జయమును కలగజేయును కోర్చు, నవగ్రహ దోషంలో తొలుగును కావున ఆలయ ధర్మకర్త కొలన్ శ్రీనివాస్ రెడ్డి,లీడర్ కొలన్ నరసింహారెడ్డి ధర్మపత్ని పద్మమ్మ ప్రజలుకు మంచి ఆరోగ్యం రోగ నిరోధక శక్తి నవగ్రహ దోషాలు తొలగిపోవాలని కోరుతూ నిజాంపేట్‌లో వెలసినటువంటి శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం నందు అద్భుతమైనటువంటి శ్రీ కౌశకి దేవి పాసుపతం హెూమంలో పాల్గొని అమ్మవారిని ఆరాదించారు. అనంతరం ప్రసాదాలతో మంగళ తోరణాలతో మంగళ వాయిద్యాలతో అమ్మవారి యొక్క విజయదశమి అంగరంగ వైభవంగా జరుగుచున్నవి.ఈ కార్యక్రమంలో కొలన్ భద్ర రెడ్డి, బొర్రా అశోక్, కదియాల ఇందిరా, జగన్ యాదవ్, ఏనుగుల మధుసూదన్ రెడ్డి, కొలన్ లక్ష్మారెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి నిజాంపేట్ గ్రామ పెద్దలు గ్రామస్తులు భక్తులు భారీగా పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలో సింగిరెడ్డి పద్మారెడ్డి

విశాలాంధ్ర - మేడిపల్లి: బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 9వ డివిజన్లో శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నిర్వహించిన మహా చండీ హెూమం, వివేకానందనగర్ కాలనీ, మరియు పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి బుద్ధ నగర్ లో అమ్మవార్లను బోడుప్పల్ మాజీ మేయర్ అజయ్ యాదవ్ గారితో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలో పాల్గొన్న బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మా రెడ్డి. ఈ సందర్భంగా పద్మా రెడ్డి మాట్లాడుతూ ఈ పూజలో పాల్గొనడం సంతోషంగా ఉందని శరన్నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారని ప్రజలందరికీ ముందుగా దసరా శుభా కాంక్షలు తెలిపారు. తదనంతరం జరిగిన అన్నప్రసాద వితరణలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ కొత్త చందర్ గౌడ్, బింగి జంగయ్య యాదవ్, బ్రహ్మన్న గౌడ్ పాల్గొన్నారు.

యువత దేశాభివృద్ధికై సేవలందించాలి

విశాలాంధ్ర-దుండిగల్: యువత విదేశాల్లో విద్యనభ్యసించినా మన దేశాభివృద్ధికై సేవలందించాలని బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ పేర్కొన్నారు. ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపాలిటీ పరిధి ఫెయిర్ మౌంట్ స్క్వేర్ నందు పటోళ్ల భరత్ రెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన "యూని ప్లానెట్" ఓవర్సీస్ ఎడ్యుకేషన్‌ను బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, ఎంపీ ఈటెల రాజేందర్, ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి, ఆంధ్రప్రదేశ్ వైసీపీ నాయకులు బైరెడ్డి సందీప్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద మాట్లాడుతూ విదేశీ విద్యపై రోజురోజుకు పెరుగుతున్న డిమాండ్ ను దృష్టిలో ఉంచుకొని విద్యా - ఉపాధి వైపుగా యువత దృష్టిసరిస్తున్నారని, మన దేశ యువత ఎక్కడ విద్యనభ్యసించినా మన దేశాభివృద్ధికై, యువతకు ఉపాధివైపుగా సేవలందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూని ప్లానెట్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ నిర్వాహకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'వెటర్నరీ వ్యాక్సిన్ ఇండియా తయారీదారుల సంఘం' ఏర్పాటు

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: భారత దేశ జంతు ఆరోగ్య రంగానికి ఒక ముఖ్యమైన పరిణామంలో, వెటర్నరీ వ్యాక్సిన్ తయారీదారులు వెటర్నరీ వ్యాక్సిన్ ఇండియా తయారీదారుల సంఘం ఏర్పాటును ప్రకటించడానికి కలిసి వచ్చారు. వీవీఐఎంఏ అనేది ప్రభుత్వేతర, లాభాపేక్షలేని సంస్థ, ఇది భారతదేశ పశువైద్య వ్యాక్సిన్ తయారీదారుల సమిష్టి గొంతుకగా పనిచేస్తుంది. వెటర్నరీ వ్యాక్సిన్‌లలో ఆవిష్కరణ, నాణ్యమైన తయారీ మరియు ప్రపంచ పోటీతత్వం కోసం ఒక ఎనేబుల్ ఎకోసిస్టమ్‌ను రూపొందించడానికి ఈ సంఘం విధాన నిర్ణేతలు, నియంత్రకాలు మరియు వాటాదారులతో చురుకుగా సహకరి స్తుంది. ఇది భారతదేశాన్ని జంతు వ్యాక్సిన్‌ల పరిశోధన, అభివృద్ధి, ఉత్పత్తికి ప్రపంచ కేంద్రంగా ఉంచడాన్ని ఊహించింది. వన్ హెల్త్ భావనను ముందుకు తీసుకెళ్లడానికి కట్టుబడి ఉన్న వీవీఐఎంఏ, సమర్థవంతమైన రోగనిరోధక వ్యూహాల ద్వారా జంతు ఆరోగ్యాన్ని ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. తద్వారా జంతువులలో వ్యాధుల ప్రమాదాన్ని, జంతువులు, మానవుల మధ్య వ్యాధి వ్యాప్తి ప్రమాదాన్ని తగ్గిస్తుంది అలాగే గ్రామీణ భారతదేశంలో పశుపోషణలో పాల్గొన్న వారి ఆదాయాలను మెరుగుపరచడంలో కీలకపాత్ర పోషిస్తుంది. హెస్టర్ బయోసైన్సెస్ లిమిటెడ్ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్, వీవీఐఎంఏ అధ్యక్షుడు రాజీవ్ గాంధీ, సభ్యుడు డాక్టర్ సంజయ్ గవ్కరే మాట్లాడుతూ, "భారతదేశ పశు వైద్య వ్యాక్సిన్ తయారీదారుల సమిష్టి స్వరంగా, వీవీఐఎంఏ వన్ హెల్త్ విధానం ద్వారా జంతువుల ఆరోగ్యాన్ని విప్లవాత్మకంగా మార్చడానికి మానవ శ్రేయస్సును కాపాడటానికి సిద్ధంగా ఉంది. ఆవిష్కరణలను పెంపొందించడం, నాణ్యతను నిర్ధారించడం ప్రపంచ పోటీతత్వాన్ని పెంచడం ద్వారా, వీవీఐఎంఏ భారతదేశాన్ని పశువైద్య వ్యాక్సిన్‌లకు ప్రపంచ కేంద్రంగా ఉంచుతుందన్నారు.

బీపీ మండల్ జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి

విశాలాంధ్ర - బషీర్‌బాగ్ : బీపీ మండల్ జీవిత చరిత్రను పాఠ్యాంశ పుస్తకాలలో చేర్చాలని బీసీ జన చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ అన్నారు. బీసీ రిజర్వేషన్ల పితామహుడు బీపీ మండల్ విగ్రహాన్ని ఎమ్మెల్యే యెన్నం శ్రీనువాస్ రెడ్డి, బీసీ సంఘాల నాయకులు, యాదవ సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీసీ జన చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల పితామహుడు బీపీ మండల్‌కు భారతరత్న ఇవ్వాలన్నారు. బీపీ మండల్ జయంతి, వర్ధంతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలన్నారు. మండల్ ఉద్యమం ద్వారానే బీసీల బ్రతుకుల్లో వెలుగులు వచ్చాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా మండల్ పోరాటం చేయాలన్నారు. బీసీలు మండల్ ఉద్యమ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని రాజకీయంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో మూడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, బీసీ నాయకులు విజయ్‌కుమార్, లక్ష్మీ నారాయణ యాదవ్, బీసీ జన చైతన్య వేదిక యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బోయినీ మహేష్ యాదవ్, శివ శంకర్ యాదవ్, పచ్చిపాల సుబ్బయ్య, సాయిలు యాదవ్, శ్రీనివాస్ యాదవ్, శేఖర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ కుంట చెరువు కట్ట
అభివృద్ధి పనులను పరిశీలించిన హెచ్ఎండిఏ అధికారులు

విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 17 డివిజన్, 5వ డివిజన్‌లకు మధ్య అనుసంధానంగా ఉన్న పోచమ్మకుంట కట్టపై హెచ్ఎండిఏ నిధులతో సిసి రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా హెచ్ఎండిఏ అధికారులు, మున్సిపల్ అధికారులతో కలిసి రోడ్డు పనులను పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ మేడిపల్లి నుండి పర్వతాపూర్ వెళ్లే ప్రజలకు ముఖ్యంగా 17వ డివిజన్, 5వ డివిజన్ వాసులకు అత్యంత సౌకర్యవంతంగా ఉండేందుకు పోచమ్మ కుంట కట్టను అభివృద్ధి చేసి హెచ్ఎండిఏ నిధులతో నూతన సిసి రోడ్డు పనులు దాదాపు పూర్తయ్యాయని హర్షం వ్యక్తం చేస్తూ, రోడ్డు అభివృద్ధిలో ప్రత్యేకంగా సహకరించిన హెచ్ఎండిఏ అధికారులు అప్పారావు ఈఈ, వేణుగోపాల్ డిఈ, రమేష్ ఏఈ, కాంట్రాక్టర్ సూపర్వైజర్ బాలకృష్ణ, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులైన ఏఈ, ఈడీ, కమిషనర్ అలాగే ఇరిగేషన్ అధికారులైన ఏఈ, ఈడీ, ఈఈ. తదితరులకు తుంగతుర్తి రవి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ హెచ్ఎండిఏ ఈ ఈ అప్పారావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం అభివృద్ధి పనులను పర్యవేక్షించిన హెచ్ఎండిఏ ఈ ఈ అప్పారావు మాట్లాడుతూ పోచమ్మ కుంట చెరువు కట్ట అభివృద్ధిలో భాగంగా వేస్తున్న సిసి రోడ్డు పనులు దాదాపు పూర్తయ్యాయని, అదేవిధంగా పీర్జాగూడ కార్పొరేషన్ పరిధిలోని పెండింగ్లో ఉన్న పనులను కూడా త్వరగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

ఘనంగా భగత్‌సింగ్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర - కాప్రా : షహీద్ భగత్ సింగ్ నేటి యువతకు ఆదర్శప్రాయుడని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, సల్మాన్ బేగ్, టి.సత్య ప్రసాద్ పిలుపునిచ్చారు. షహీద్ భగత్ సింగ్ 118వ జయంతిని పురస్కరించుకుని ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఈసీఐఎల్‌లోని నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్ వద్ద ఏర్పాటు చేసిన భారీ భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సల్మాన్ బేక్ టీ.సత్యప్రసాద్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య పోరాటంలో భగత్‌సింగ్ నిర్వహించిన పాత్ర యావత్తు దేశం విస్మరించరానిదని, 12 ఏళ్ళ అతి చిన్న వయసులోనే స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని 23 ఏళ్ళ యువప్రాయంలోనే దేశం కోసం ప్రాణాలర్పించి ఎందరో యువతకు స్ఫూర్తిగా నిలిచి దేశ భక్తిని రగిలించిన సమరయోధుడు, విప్లవ మూర్తి భగత్ సింగ్ అని వారు కొనియాడారు. మతోన్మాద రాజకీయాలను సమూలంగా ఓడించడమే భగత్‌సింగ్‌కు నేటితరం అందించగలిగే నిజమైన నివాళి అని వారు పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించే షహిద్ భగత్ సింగ్ 118వ జయంతి ఉత్సవాల్లో పాల్గొనాలని మేడ్చల్ జిల్లా కార్యదర్శి టిటి .సత్య ప్రసాద్‌లి యువతి, యువకులకి పిలుపునిచ్చారు. భగత్ సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలని కేంద్ర- రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు, భగత్ సింగ్ స్ఫూర్తితో డ్రగ్స్, గంజాయి, మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడుదమని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు రాజ్ కుమార్, మోసిన్, సతీష్ కుమార్ ఉప్పల్ నియోజకవర్గం నాయకులు విజయ్, ఇస్మాయిల్, ఉపాధ్యక్షులు హరికృష్ణ, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన విప్లవ వీరుడు భగత్ సింగ్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలాభిందెల శ్రీనివాస్ పేర్కొన్నారు.ఆదివారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ప్రగతినగర్ నెమలి సర్కిల్ నందు భగత్ సింగ్ 118వ జయంతి సందర్భంగా సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలాభిందెల శ్రీనివాస్ ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా పాలాభిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ భగత్ సింగ్ జ్వలించే నిప్పు కణికని, బ్రిటిష్ సామ్రాజ్యవాదుల పాలిట సింహ స్వప్నమని గుర్తుచేశారు. అసమానతల పై ఎగిసిపడ్డ విప్లవ పతాకమని,ఆనాడు ఇంక్విలాబ్ జిందాబాద్ అని నినాదిస్తూ దేశ స్వాతంత్ర్యం కోసం తెల్ల దొరలపై భగత్ సింగ్ చేసిన తిరుగుబాటు యావత్ దేశాన్ని అక్కర్శించిందని తెలిపారు. నేటి యువత భగత్ సింగ్ ఆశయా సాధనకు పాటుపడకుండా అయన మార్గంలో నడవ కుండా మతోన్మాదనికి, మత్తుపదార్థాలకు బానిసలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కావున ప్రతి ఒక్కరు భగత్ సింగ్ ఆశయా సాధనకు పాటుపడాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు యాదయ్య, దాస్తగిరి పాల్గొన్నారు.

విశాలాంధ్ర - తుర్కయంజల్: షహీద్ భగత్‌సింగ్ నేటి యువతకు ఆదర్శప్రాయుడని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా కార్యదర్శి పి శివకుమార్ గౌడ్ అన్నారు. షహీద్ భగత్ సింగ్ 118వ జయంతిని పురస్కరించుకుని ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో తుర్కయంజాల్ అంబేద్కర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన భారీ భగత్ సింగ్ విగ్రహపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య పోరాటంలో భగత్ సింగ్ నిర్వహించిన పాత్ర యావత్తు దేశం విస్మరించరానిదని, 12 ఏళ్ళ అతి చిన్న వయసులోనే స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని 23 ఏళ్ళ యువప్రాయంలోనే దేశం కోసం ప్రాణాలర్పించి ఎందరో యువతకు స్ఫూర్తిగా నిలిచి దేశ భక్తిని రగిలించిన సమరయోధుడు, విప్లవ మూర్తి భగత్ సింగ్ అని వారు కొనియాడారు. 1907 సెప్టెంబర్ 28న జన్మించిన భగత్ సింగ్ 23 ఏళ్ళ చిరు ప్రాయంలోనే 1931 మార్చ్ 23న తన సహచరులు రాజ్ గురు, సుఖ్‌దేవ్‌లతో కలిపి ఉరితీయబడ్డారని, భారత స్వాతంత్ర్య ఉద్యమంలో పోరాడిన అత్యంత ప్రభావశీల విప్లవకారులలో భగత్‌సింగ్ అగ్రగణ్యుడని, ఈ కారణంగానే షహీద్ గా దేశ ప్రజలు కొనియాడారని వారు గుర్తు చేశారు. మతోన్మాద రాజకీయాలను సమూలంగా ఓడించడమే భగత్‌సింగ్‌కు నేటితరం అందించగలిగే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ తుర్క యంజాల మున్సిపాలిటీ కార్యదర్శి అనంతుల కాటంరాజు గౌడ్, బీఎస్పీ నాయకులు కుమార్, ఏఐవైఎఫ్ నాయకులు గండికోట శివ, సాయి భగత్, చరణ్, శివ, లక్కీ నాయక్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - మేడిపల్లి : ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఆదివారం భగత్ సింగ్, 118వ జయంతి సందర్భంగా ఉప్పల్ డిపో ఏఐఎస్ఎఫ్ కార్యాలయం ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండి అన్వర్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం భగత్ సింగ్ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు హరీష్ నాయకులు, అరవింద్, శ్రీహరి, సాయి, కృపాకర్, ధీరజ్, నవీన్, గణేష్, నితిన్, తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ, అణచివేతపై ఉద్యమాలు అవసరం

ప్రజాసంఘాల సదస్సులో వక్తలు

విశాలాంధ్ర-విశాఖ: దేశంలో మనువాద కార్పొరేట్ దోపిడీ, అణచివేతలకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు అవసరమని వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్ అభిప్రాయపడ్డారు. మహాత్మ జ్యోతిబాపూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ 152వ ఆవిర్భావ దినం, భగత్ సింగ్ 118వ జయంతి సందర్భంగా మనువాద కార్పొరేట్ ఫాసిజం మూలాలు - ప్రజా ఉద్యమాల కర్తవ్యాలపై ప్రజాసంఘాల వేదిక అధ్వర్యాన ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సదస్సు జరిగింది. చరిత్రలో మనువాద దోపిడీ, అణిచివేత వ్యతిరేక సామాజిక ఉద్యమాలు - దళిత, బహుజన, మహిళ, మైనారిటీ పోరాటాల పాత్ర అంశంపై వేణుగోపాల్ మాట్లాడుతూ... మనువాదానికి వ్యతిరేకంగా జరిగే పోరాటాలన్నిటినీ ముందుకు తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. వీటిపైనే క్రీస్తు పూర్వం 5, 6 శతాబ్దాల్లో గౌతమ బుద్ధుడు మనువాదజాలంపై ఉద్యమించాడన్నారు. తర్వాత మహావీరుడు, దానికి ముందు చారువాకలు, లోకాయుక్తులు ఉద్యమించారన్నారు. కులాలకతీతంగా మనుషులందరూ సమానమే అని ఆ ఉద్యమకారులు బోధించారన్నారు. హిందూమతంలోని వివక్షను వ్యతిరేకిస్తూ... అంబేద్కర్ బౌద్ధంలోకి వెళ్లారని తెలిపారు. 1947 తర్వాత అనేక మంది కాన్షీరామ్ వంటివారు కుల వివక్షను వ్యతిరేకిస్తూ పార్టీ పెట్టారని గుర్తు చేశారు. 2500 ఏళ్ల చారిత్రక పోరాటాలలో లోపాలు ఉన్నాయని, కులాన్ని వ్యతిరేకిస్తూ మతాన్ని సమర్థించడం వంటివి జరిగాయన్నారు. భారతీయ మానసిక స్థితిలో అసమానత సహజమే అనే భావన మనువాదం కల్పించిందన్నారు. దీనిపైన సుదీర్ఘ పోరాటాలు, ఉద్యమాలు చేయాల్సి ఉందని వేణుగోపాల్ పిలుపునిచ్చారు. అంతిమంగా మనువాదాన్ని కూల్చివేసి స్వేచ్ఛ, సమానత్వం సాధించుకోవాలన్నారు. భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షులు టీ శ్రీరామ్మూర్తి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జగన్ అధ్యక్షతన మొదటి సెషన్ జరిగింది.

కార్పొరేట్ల కోసమే ఆదివాసీ గ్రామాల ధ్వంసం: జేవీఎస్ మూర్తి

మార్క్సిస్టు అధ్యయన కేంద్రం కన్వీనర్ జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ... ఆనాడు పూలే సత్య శోధక్ సమాజ్ ని స్థాపించి కుల వ్యవస్థపై పోరాడారన్నారు. ఆయన సతీమణి సావిత్రిబాయి పూలే మహిళలు చదువుకునేలా చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం నిస్సిగ్గుగా ఆదివాసీ ప్రాంతాలను ఖాళీ చేయించి కార్పొరేట్లకు కట్టబెడుతోందని తెలిపారు. మణిపూర్ భూముల్లో విలువైన ఖనిజాలు ఉన్నాయని కుకీలపై దాడులు చేయిస్తూ అక్కడ సంపదను అదానీకి అప్పగించే కుట్ర జరుగుతోందని మండిపడ్డారు. ఆదివాసీల గ్రామాలను ధ్వంసం చేస్తున్నారన్నారు. ఇటీవల ఓ ఆదివాసి గ్రామాన్ని ఖాళీ చేయించి అప్పగించడానికి ప్రయత్నించగా జడ్జి ఏ విధంగా అదానీకి ఇస్తారని మందలించిన విషయాన్ని జేవీ గుర్తు చేశారు. లద్దాఖ్‌లో రాష్ట్ర హోదా కోసం శాంతియుతంగా ఉద్యమం చేస్తున్న పర్యావరణవేత్త వాంగ్‌చుక్ ను అన్యాయంగా నేషనల్ సెక్యూరిటీ యాక్ట్ కింద అరెస్టు చేశారన్నారు. వాస్తవ సమాచారం ప్రధాన మీడియా ఛానెల్స్, వార్తా పత్రికల్లో రాకుండా పాలకులు అడ్డుకట్ట వేస్తున్నారన్నారు. ఆదివాసీల ఉద్యమాలను పోరాటాలను ప్రపంచానికి తెలియకుండా చేస్తున్నారని తెలిపారు. ఆదివాసీల కోసం ఏర్పాటు చేసిన చట్టాలను కూడా కార్పొరేట్ల కోసం మార్చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సదస్సులో పీఓడబ్ల్యు రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.లక్ష్మి, ఐఎఫ్‌టీయూ నాయకులు పి.ప్రసాద్, ఎం. వెంకటేశ్వర్లు, పౌర ప్రజా సంఘాల వేదిక కన్వీనర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కు చంద్రబాబు పరామర్శ

- వైరల్ జ్వరం... ఆరోగ్యంపై ఆరా
- డీఎస్సీ ఉద్యోగాల భర్తీ ప్రస్తావన
- 16న ప్రధాని పర్యటన విజయవంతంపై చర్చ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను చంద్రబాబు నాయుడు పరామర్శించారు. హైదరాబాద్‌లోని పవన్ నివాసానికి సీఎం ఆదివారం వెళ్లారు. కొద్ది రోజులుగా వైరల్ జ్వరంతో బాధపడుతున్న పవన్ కల్యాణ్ ఆరోగ్యంపై ఆరా తీశారు. ప్రస్తుతం జ్వరం తీవ్రత లేదని, దగ్గు ఎడతెరిపి లేకుండా వస్తోందని పవన్ తెలిపారు. పరీక్షలు చేసి క్రానిక్ బ్రాంకైటిస్ మూలంగా దగ్గు ఎక్కువగా వస్తోందని, ఫలితంగానే గొంతు దగ్గర నొప్పి కూడా ఉందని వైద్యులు చెప్పినట్లు వివరించారు. పవన్ త్వరగా కోలుకోవాలని సీఎం ఆకాంక్షించారు. ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. మెగా డీఎస్సీని విజయవంతంగా నిర్వహించి ఒకేసారి 15,941 మందికి ఉపాధ్యాయ ఉద్యోగాలు ఇవ్వడాన్ని పవన్ ప్రస్తావించారు. ఉద్యోగాలకు ఎంపికైనవారికి నియామకపత్రాలు అందించే కార్యక్రమాన్ని నిర్వహించి యువతలో మనోధైర్యాన్ని, స్ఫూర్తిని నింపారని తెలిపారు. అక్టోబరు 4న ఆటో డ్రైవర్ల సేవలో...' కార్యక్రమంపై చర్చించారు. స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని విజయవంతంగా అమలు చేయగలిగామని, తద్వారా మహిళలకు ఆర్థికపరమైన వెసులుబాటు కలుగుతోందని సీఎం తెలిపారు. ఈ పథకం మూలంగా ఆటో డ్రైవర్లకు ఇబ్బంది కలగకూడదనే ఆలోచనతో ఆటో డ్రైవర్లకు రూ.15 వేల చొప్పున ఆర్థిక భరోసాను కల్పించే దిశగా తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేస్తున్నామని, 4న విజయవాడలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. ఆటో డ్రైవర్ల కోసం ఆలోచించిన, చేపట్టిన ఈ పథకం కచ్చితంగా అందరి మన్ననలు పొందుతుందని ఉప ముఖ్యమంత్రి విశ్వాసం వ్యక్తపరిచారు. అక్టోబరు 16న ప్రధాని నరేంద్ర మోదీ... రాష్ట్రంలోని శ్రీశైలం పర్యటనను విజయవంతం చేయడంపైనా చర్చించుకున్నారు. జీఎస్టీ సంస్కరణలపై అవగాహన కల్పించేందుకు చేపడుతున్న రోడ్ షో నిర్వహణ, అందుకు సంబంధించిన ప్రణాళికలపై ఈ పరామర్శలో ప్రస్తావనకు వచ్చింది.

త్వరలో ఎల్పీజీ పోర్టబులిటీ

న్యూఢిల్లీ: గ్యాస్ వినియోగదారులకు శుభవార్త... నచ్చని మొబైల్ సిమ్‌లు ఇతర నెట్‌వర్క్‌కు పోర్టబుల్ అయినట్లుగానే ఇకపై వంట గ్యాస్ వినియోగదారులు తమ ప్రస్తుత కనెక్షన్‌ను మార్చకుండానే తమ సరఫరాదారుడిని మార్చుకునే వీలు కల్పించేలా ఎల్పీజీ పోర్టబులిటీని అందుబాటులోకి రానుంది. ఈ ప్రతిపాదనపై అభిప్రాయాలు స్వీకరించేందుకు పెట్రోలియం, సహజ వాయువు నియంత్రణ బోర్డు (పీఎన్‌జీఆర్‌బీ)నోటీసు విడుదల చేసింది. మీరు ఎల్పీజీ సప్లయర్‌తో ఇబ్బందులు పడుతున్నట్లయితే...కొత్త విధానం ద్వారా మీ సమస్య పరిష్కారం అవుతుంది. ప్రస్తుత కనెక్షన్‌ను మార్చకుండానే తమ సరఫరాదారుడిని మార్చుకునే వీలు కలుగుతుంది. పీఎన్‌జీఆర్‌బీ నోటీసు ప్రకారం, స్థానిక డిస్ట్రిబ్యూటర్‌కు సాంకేతిక లేదా నిర్వహణ సమస్యలు ఉన్నప్పుడు వినియోగదారులు ప్రత్యామ్నాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా ఎల్పీజీ ఇంట్రాపరబిలిటీ ఫ్రేమ్?వర్క్?ను తీసుకొచ్చే ప్రయత్నం జరుగుతోంది. ఈ విధానం అందుబాటులోకి వస్తే వినియోగదారులకు మరిన్ని ఎంపికలు, మెరుగైన సేవలను అందుబాటులోకి వస్తాయి. సిలిండర్ ధర ఒకేలా ఉన్నప్పుడు వినియోగదారులు తమకు నచ్చిన ఎల్పీజీ కంపెనీ/డీలర్‌ను ఎంపిక చేసుకునే సౌలభ్యం ఉంటుంది. కాగా, ఎల్పీజీ పోర్టబులిటీపై అభిప్రాయాలను పంచుకునేందుకు వినియోగదారులు, వాటాదారులుకు అక్టోబరు మధ్యవరకు పీఎన్‌జీఆర్‌బీ అవకాశం కల్పించింది. ఆ తర్వాత ఎల్పీజీ పోర్టబులిటీ కోసం మార్గదర్శకాలను రూపొందిచనుంది.

నక్సలిజంపై సైద్ధాంతిక పోరు: అమిత్‌షా



న్యూఢిల్లీ: భారత్‌లో నక్సలిజం కేవలం ఆయుధాలతోనే అంతం కాదని హోంమంత్రి అమిత్‌షా అభిప్రాయపడ్డారు. ఇందుకోసం నక్సలిజం వెనుక ఉన్న సిద్ధాంతాలపై పోరాటం చేయాలని చెప్పారు. 'నక్సల్ రహిత భారత్?' పేరిట నిర్వహించిన భారత్ మంథన్-2025 కార్యక్రమంలో అమిత్ షా ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ నేతృత్వంలో 2026 మార్చి 31 నాటికి భారత్‌లో పూర్తిగా నక్సలిజాన్ని అంతం చేస్తామని పునరుద్ఘాటించారు. '2026 మార్చి 31 నాటికి భారత్ నక్సలిజాన్ని పూర్తిగా అంతం చేస్తాం. చాలా మంది సాయుధ కార్యకలాపాలను ముగిస్తే నక్సలైట్ల సమస్య అంతం అవుతుందని అనుకుంటారు. కానీ అలా జరగదు. అసలు మావోయిస్టుల సమస్య ఎందుకు వచ్చింది? దేశంలో ఎందుకు అంతలా అభివృద్ధి చెందింది? దీనికి సిద్ధాంతపరమైన మద్దతు ఎవరు ఇచ్చారు? నక్సలిజం సిద్ధాంతాలను సమాజం అర్థం చేసుకొన్నంత కాలం దీనిని అంతం చేయలేము. మనం నక్సలైట్లను సరెండర్ చేయడం లేదా భద్రతా దళాలు మట్టుపెట్టేలా చేయగలం, కానీ సిద్ధాంత పరంగా వస్తే చాలా ప్రయత్నాలు చేయాలి. ఇందుకోసం పెద్ద ఎత్తున చర్చ జరగాల్సిన అవసరం ఉంది" అన్నారు. మావోయిస్టులను చంపాలనే ఉద్దేశం లేదని షా స్పష్టం చేశారు. దాదాపు 290 మందికిపైగా ఆయుధాలు పట్టిన వారు హతమవగా... ఇంకా 1,090 మంది అరెస్ట్ అయ్యారన్నారు. ఎక్కడైనా అరెస్ట్ చేసే అవకాశం వస్తే తప్పకుండా వారిని అదుపులోకి తీసుకుంటారే చంపడం ప్రభుత్వ ఉద్దేశం కాదన్నారు. అమాయకులైన పౌరులను చంపుతుంటే భద్రతా దళాలకు మరో ఆప్షన్ ఉండదని... బుల్లెట్లకు బుల్లెట్లతోనే సమాధానం చెప్పాల్సి వస్తుందన్నారు.

నవయువ భారతావనికి

యువత నడుం బిగించాలి: ఈశ్వరయ్య

విశాలాంధ్ర-విజయవాడ: భగత్ సింగ్ స్ఫూర్తితో నవయువ భారత నిర్మాణానికి నేటి యువత నడుం బిగించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) మాజీ జాతీయ కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. భారత స్వాతంత్ర్య ఉద్యమ యువ తార భగత్ సింగ్ 118వ జయంతిని ఏఐవైఎఫ్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించారు. విజయవాడ నగర సమితి అధ్వర్యంలో సమాఖ్య నగర అధ్యక్షుడు కంచర్ల భార్గవ్ అధ్యక్షతన స్థానిక విజయ టాకీస్ సెంటర్ తమ్మారెడ్డి భవన్ వద్ద జయంతి కార్యక్రమం జరిగింది. భగత్ సింగ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పేదలకు పండ్లు పంపిణీ చేశారు. అనంతపురంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గండాల సంతోష్ కుమార్ అధ్వర్యంలో భగత్ సింగ్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. కడపలో యువజన విద్యార్థి సంఘాల అధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. నంద్యాలలో అంధులకు పండ్లు, స్వీట్లు పంచిపెట్టారు. విజయవాడ దాసరి భవన్ వద్ద బాలల సంఘం అధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు మొజ్జోడ యుగంధర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు లంకా గోవిందరాజులు, బాలల సంఘం రాష్ట్ర కన్వీనర్ మందగల్ల సాయికుమార్ నాయకత్వం వహించారు. గుజ్జుల ఈశ్వరయ్య, యుగంధర్, గండాల సంతోష్ కుమార్ మాట్లాడుతూ ఆనాటి స్వాతంత్ర్య పోరాటంలో యువతను భాగస్వాములను చేయడంలో భగత్ సింగ్ ఎంతో కీలకంగా వ్యవహరించారన్నారు. యువతలో స్వాతంత్ర్య ఉద్యమకాంక్షని జ్వలింప చేసి ఉద్యమం అంటే మార్పు అని ఎలుగెత్తి చాటిన యువ కిషోరం భగత్‌సింగ్ అని కొనియాడారు. ఏడాదికి కోటి ఉద్యోగాల హామీ నీటి మీద రాతలుగా మిగులుతున్నాయని విమర్శించారు. దేశంలో 30 శాతం ఉన్న యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక నైరాశ్యంలో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. అందరికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయ్ మెంట్ గ్యారెంటీ యాక్ట్ అమలులోకి తీసుకురావాలని ఉద్యమానికి ఏఐవైఎఫ్ ఇప్పటికే నాంది పలికింది అని, భవిష్యత్తులో ఇది తీవ్రరూపందాల్చి పాలకుల మెడలు వంచి యువత తమ హక్కులను కాపాడుకొనే తరుణం దగ్గరలో ఉందని ఈశ్వరయ్య హెచ్చరించారు. ఏఐవైఎఫ్ జాతీయ స్థాయిలో 'స్టాప్ డ్రగ్స్-స్టార్ట్ స్పోర్ట్స్' అనే నినాదంతో అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తుందన్నారు. కర్నూలులో జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసరావు, నంద్యాలలో జి.నాగరాముడు, సత్యసాయి జిల్లాలో రాజు, కడపలో ప్రభాకర్, అన్నమయ్య జిల్లాలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాజశేఖర్, వెంకటేష్, తిరుపతిలో కత్తి రవి, రామకృష్ణ, పల్నాడు జిల్లాలో అధ్యక్ష కార్యదర్శులు సుభాని, సుబ్బారావు, శ్రీకాకుళం జిల్లాలో సంతోష్, కె. శ్రీనివాస్, గుంటూరు జిల్లాలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జంగాల చైతన్య, షేక్ వలి, ఏలూరు లో తొర్లపాటి రాజు నాయకత్వం వహించారు.

భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ యాక్ట్ అమలు చేయాలి: నాసర్ జీ

వాడవాడలా భగత్‌సింగ్‌కు ఏఐవైఎఫ్ ఘననివాళి

విశాలాంధ్ర-గుంటూరు సిటీ : భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ యాక్ట్ అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సర్దార్ భగత్ సింగ్ 118వ జయంతి సందర్భంగా ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ గుంటూరు జిల్లా సమితి అధ్వర్యంలో గుంటూరు కొత్తపేటలోని భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ముఖ్య అతిథిగా హాజరయిన నాసర్ జీ మాట్లాడుతూ బ్రిటీషు సామ్రాజ్యవాదుల దోపిడీ పీడనల నుంచి విముక్తి కోసం సాగిన జాతీయోద్యమంలో కార్మికులు, రైతులు, ఆదివాసీలు, మహిళలు, విద్యార్థులు యువకులు పాల్గొన్నారని, వారిలో భగత్ సింగ్ ఒకరని అన్నారు. విద్యను పేదలకు అందకుండా కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ) చట్టాన్ని రద్దు చేయాలని, భగత్ సింగ్‌కు భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ వలి మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం వారి రాజకీయ స్వలాభం కోసం కులాలు, మతాల మధ్య చిచ్చు పెడుతోందని విమర్శించారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు చైతన్య మాట్లాడుతూ భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితో విద్యార్థులను, యువకులను చైతన్య పరిచి కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యశ్వంత్, నగర కార్యదర్శి ప్రణీత్, సందీప్, మస్తాన్, ఖాసీం వలి, రెహమాన్ అజయ్, సాగర్, వెంకీ, కిరణ్, శశి, మస్తాన్, సాయి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక అసమానతలపై కలమెత్తిన జాషువా

130వ జయంతి సందర్భంగా జల్లి విల్సన్ నివాళి

విశాలాంధ్ర-విజయవాడ: సామాజిక అసమానతలపై కలమెత్తిన నవయుగ కవితా చక్రవర్తి గుర్రం జాషువా చిరస్మరణీయులని సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ కొనియాడారు. జాషువా 130వ జయంతి సందర్భంగా ఆదివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద ఉన్న జాషువా విగ్రహానికి జల్లి విల్సన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలోని కులాల అంతరాలపై తన కవిత్వంతో కరవాలాన్ని ఝుళిపించారని తెలిపారు. 1895 సెప్టెంబరు 28న వినుకొండలో జన్మించిన ఆయన వివక్షతలు లేని సమసమాజాన్ని కాంక్షించారని వివరించారు. గబ్బిలం వంటి ఆవేదనాభరిత కావ్యాన్ని వెలువరించటమే కాకుండా దీనుల పట్ల సమాజ రుగ్మతలను వెల్లడించారని తెలిపారు. ప్రతిమల బెండ్లి చేయుటకు వందలు, వేలు వ్యయింతురుగాని ముప్పది మూడు కోట్ల దేవత తెగబడ్డ దేశమందు పేదల క్షుత్తులారునే అని తన కవిత్వాన్ని జాషువా నిర్దేశించుకున్నారని వెల్లడించారు. సమాజంలోని అనేక అంశాలతో కవిత్వ పరిమళాలు వెదజల్లారని, కులాల, మతాల వివక్షతలేని సమాజాన్ని కాంక్షించారని తెలిపారు. అనేక మంది సంఘ సంస్కర్తల విధానాలను అధ్యయనం చేసి సామ్యవాదాన్ని అభిమానించారని అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రానాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బుట్టి రాయప్ప, రైల్వే యూనియన్ నాయకులు అనపర్తి గుప్తా, డీబీపీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు అన్నవరపు నాగేశ్వరరావు, డీహెచ్‌పీఎస్ నగర అధ్యక్షుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శి సంగుల పేరయ్య, కొడాలి ఆనందరావు, ఇన్సాఫ్ నాయకులు ఎస్.కె.నజీర్, హెల్పింగ్ హోప్‌లెస్ డైరెక్టర్ ఈదులూరి రాధాకృష్ణ, ప్రజానాట్యమండలి నాయకులు ఆర్.పిచ్చియ్య, చాకలి ఐలమ్మ విగ్రహ కమిటీ కన్వీనర్ శ్రీనివాస్, గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నేత సీహెచ్ రాజేంద్రప్రసాద్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఆర్.ప్రభుదాసు, డీహెచ్‌పీఎస్ నాయకులు కె.స్టాలిన్, ప్రతిపాటి రాజు, కాళ్ల ప్రకాశరావు, జగన్నాథం, రమేష్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లద్దాఖ్‌పై కేంద్రం వైఖరి గర్హనీయం: ఐజేయూ

హైదరాబాద్/చండీగఢ్: లద్దాఖ్‌కు రాష్ట్ర హోదా కల్పించాలన్న డిమాండ్ విషయంలో కేంద్ర ప్రభుత్వ ప్రతికూల వైఖరిని ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) ఖండించింది. సామాజిక కార్యకర్తలను విచారించే, లద్దాఖ్ ప్రజల డిమాండ్లను తిరస్కరించే దురంహకార వైఖరికి కేంద్ర ప్రభుత్వం తక్షణం ముగింపు పలకాలని ఐజేయూ అధ్యక్షుడు కె.శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శి బల్విందర్ సింగ్ జమ్మూ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రాంతాల ప్రత్యేక సంస్కృతి, పర్యావరణం, ప్రజల రక్షణతో ప్రజాస్వామ్య రాష్ట్ర పునరుద్ధరణ కోసం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని పేర్కొన్నారు. నిజం చెప్పే బాధ్యతను సిగ్గు లేకుండా వదులుకున్న కార్పొరేట్ మీడియా విభాగాల పాత్ర కూడా అంతే దురదృష్టకరమని వారు అన్నారు. అధికారిక వైఖరిని చిలకపలుకులుగా వల్లెవేస్తూ, భిన్నాభిప్రాయాల గొంతులను అణచివేస్తూ కేంద్ర ప్రభుత్వ వైఖరిని సంబరాలు చేసుకోవడం ద్వారా వారు తమను తాము ప్రచార కేంద్రాలకు తగ్గించుకున్నారని తెలిపారు.

లద్దాఖ్ ప్రజలపై బీజేపీ, ఆర్ఎస్ఎస్ దాడి

రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: లద్దాఖ్‌ను ఆరవ షెడ్యూల్ కింద చేర్చాలని పోరాడుతున్న లద్దాఖ్ ప్రజలు, సంస్కృతీ సంప్రదాయాలపై బీజేపీ, ఆర్ఎస్ఎస్ దాడి చేస్తున్నాయని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఆదివారం ఆరోపించారు. గతవారం లెహ్‌లో జరిగిన హింసాకాండ నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. లద్దాఖ్‌కు రాష్ట్ర హోదా డిమాండ్ వెనుక ప్రధాన గొంతుకగా నిలిచిన పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్‌ను జాతీయ భద్రతా చట్టం కింద అదుపులోకి తీసుకుని రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ జైలులో ఉంచారు. 'ఎక్స్'లో చేసిన ఒక పోస్ట్‌లో రాహుల్... 'లద్దాఖ్‌కు చెందిన అద్భుతమైన ప్రజలు, సంస్కృతీసంప్రదాయాలపై బీజేపీ, ఆర్ఎస్ఎస్ దాడి చేస్తున్నాయి. లద్దాఖ్ ప్రజలు తమ గొంతు వినిపించమని అడిగారు. బీజేపీ నలుగురు యువకులను చంపి సోనమ్ వాంగ్‌చుక్‌ను జైలులో పెట్టడం ద్వారా ప్రతిస్పందించింది. హత్యను ఆపండి. హింసను ఆపండి. బెదిరింపులను ఆపండి' అని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు.

విద్యుత్ వినియోగదారులకు ఊరట

- రూ.923.55 కోట్లు వెనక్కి
- ట్రూఅప్ చార్జీలపై ఏపీఈఆర్‌సీ నిర్ణయం
- ఇక ట్రూ డౌన్: మంత్రి గొట్టిపాటి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ట్రూఅప్ చార్జీల పేరిట అదనంగా వసూలు చేసిన రూ.923.55కోట్లు ప్రజలకు తిరిగి ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్‌సీ) కీలక నిర్ణయం తీసుకుంది. ఆ మొత్తం వినియోగదారులకు తిరిగి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి డిస్కమ్‌లు ప్రతిపాదించిన రూ.2,758.76కోట్ల ట్రూఅప్ మొత్తానికిగాను రూ.1,863.64కోట్లకు అనుమతి ఇచ్చింది. అదనంగా వసూలు చేసిన రూ.923.55 కోట్లను విద్యుత్ వినియోగదారులకు తిరిగి చెల్లించాలని ఏపీఈఆర్‌సీ ఆదేశించింది. దీంతో వినియోగదారులకు భారీ ఊరట లభించనుంది. నాడు జగన్ ప్రభుత్వం పెంచిన ట్రూఅప్ చార్జీలను ట్రూడౌన్ చేసే దిశగా కార్యాచరణ చేపట్టినట్లు కూటమి ప్రభుత్వం చెబుతోంది. ఈ మొత్తాన్ని ఇలా సర్దుబాటు చేస్తారు. ట్రూడౌన్ చార్జీల రూపంలో మిగిలిన రూ. 923.55 కోట్లను ఈ సంవత్సరం నవంబర్ నుంచి వచ్చే ఏడాది అనగా...2026 అక్టోబర్ వరకు వచ్చే విద్యుత్ బిల్లుల్లో సర్దుబాటు చేస్తారు. దీనివల్ల యూనిట్‌కు 13 పైసలు చొప్పున వినియోగదారులకు లబ్ధి చేకూరనుంది. దీన్ని వచ్చే నెల బిల్లులోని యూనిట్లపై అమలు చేస్తారు. 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు వినియోగదారులు వినియోగించిన యూనిట్లకు వర్తింపచేసి...ఆ మొత్తాన్ని ఇక మీదట రాబోయే బిల్లులో సర్దుబాటు చేస్తారు. 2024-25లో విద్యుత్ కొనుగోళ్లకు సంబంధించిన వివరాలను ఈ ఏడాది జూన్ 30న విద్యుత్తు పంపిణీ సంస్థలు (డిస్కమ్‌లు) ఏపీఈఆర్‌సీకి నివేదించాయి. ఆ నివేదికలను మూడు నెలల్లోపు పరిశీలించి ఈఆర్‌సీ నిర్ణయం తీసుకోవాల్సి ఉండగా...ఈనెల 27న ఉత్తర్వులు వెలువడ్డాయి. ఏపీఈఆర్‌సీ స్థాపన తర్వాత వినియోగదారులకు రీఫండ్ చేయడం ఇది తొలిసారి. ఏపీఈఆర్‌సీ ఆదేశాలతో ఈ మొత్తం సొమ్ము ప్రభుత్వం వెనక్కి ఇవ్వాల్సిన పరిస్థితి ఉంది. గత ప్రభుత్వ హయాంలో చాలా వరకు ట్రూఅప్ అనే పేరును మాత్రమే విన్న వినియోగదారులు...కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తొలిసారి ట్రూడౌన్(చార్జీల తగ్గింపు)అనే మాటను వినబోతున్నారనీ అధికారులు చెబుతున్నారు. ట్రూఅప్ చార్జీలు, విద్యుత్ మీటర్లపై వామపక్ష పార్టీలు ఉద్యమిస్తున్నాయి.ప్రజలకు ఇచ్చిన హామీకి అనుగుణంగా ఇప్పటికే వసూలు చేస్తున్న రూ.15,485 కోట్ల భారాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నాయి. ఎన్నికల్లో ప్రజలపై విద్యుత్ భారాలు మోపబోమని కూటమి ప్రకటించి...అధికారంలోకి రాగానే ట్రూఅప్ చార్జీలు వడ్డించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ట్రూఅప్ చార్జీలతో విద్యుత్ బిల్లులు భారీగా రావడంతో ప్రజలు ఆర్థికంగా చితికిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.

వైసీపీ హయాంలో 9 సార్లు విద్యుత్ చార్జీల పెంపుపు మంత్రి గొట్టిపాటి

వైసీపీ ప్రభుత్వ హయాంలో విద్యుత్ చార్జీలను తొమ్మిది సార్లు పెంచారని, జెన్కో, ట్రాన్స్కో సంస్థలను సర్వనాశనం చేశారని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ధ్వజమెత్తారు. విద్యుత్ చార్జీల ట్రూడౌన్‌పై...ఆదివారం తాడేపల్లిలో మంత్రి విలేకరుల సమావేశం నిర్వహించారు. విద్యుత్ చార్జీలు పెంచబోమన్న హామీని తాము నిలబెట్టుకున్నామన్నారు. నాడు జగన్ ప్రభుత్వం పెంచిన ట్రూఅప్ చార్జీలను...ట్రూడౌన్ చేసే దిశగా కార్యాచరణ చేపట్టాం. యూనిట్‌పై 13 పైసలు తగ్గించామని, భవిష్యత్తులో ఇంకా తగ్గిస్తామని చెప్పారు. 2014లో లోటు విద్యుత్ నుంచి 2019 నాటికి మిగులు విద్యుత్ సాధించామన్నారు. వైసీపీ వచ్చాక విద్యుత్ అవసరాలు తీర్చలేక మళ్లీ లోటులోకి వెళ్లిందని, ఇతర రాష్ట్రాల నుంచి విద్యుత్ కొనుగోలు చేసి నష్టం చేకూర్చారని వివరించారు. ప్రజలపై రూ.18వేల కోట్ల భారం మోపారని, లక్షా 25వేల కోట్ల వరకు విద్యుత్ వ్యవస్థకు నష్టం చేకూర్చారని వివరించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సంస్కరణలు తెచ్చి విద్యుత్ వ్యవస్థను గాడిలో పెట్టిందన్నారు. తాము తెచ్చిన సంస్కరణల వల్లే విద్యుత్ చార్జీలు తగ్గించగలిగామని చెప్పారు. పీపీఏలు రద్దు చేసి ఒప్పందం చేసుకున్న సంస్థలను ఇబ్బంది పెట్టారని, మా ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి పెంచామని స్పష్టం చేశారు. విద్యుత్ కొనుగోళ్లకు ఎక్కువ ఖర్చు పెట్టడం తగ్గించామని,ఇతర రాష్ట్రాలతో విద్యుత్ ఇచ్చిపుచ్చుకునేలా వ్యవహరిస్తున్నామని తెలిపారు. సూర్యఘర్ పథకం కింద ఏపీకి 20 లక్షల కనెక్షన్లు వచ్చాయని, సౌర పలకలు ఏర్పాటు చేసుకున్న వారికి రాయితీ ఇస్తున్నామని మంత్రి చెప్పారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.